సంపుటి: 44
సంచిక: 1

ఫోన్ నెం:
64843

# అపరాధ పరిశోధన

## సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 84 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

ఫిబ్రవరి, 1987

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి

# అపరాధ పరిశోధన పోటీ-221
## [ఫలితాలు]

డిసెంబరు '86 నెల "అపరాధ పరిశోధన పోటీ-221" కి సరియైన సమాధానాలు:

1. మెదడు వాపు వ్యాధి.
2. బస్సు.
3. ఇన్సూరెన్స్ కంపెనీలు
4 ఎల్లిగడ్డ.
5. ఫారెక్స్

పై జవాబుల ప్రకారం ఒక పాఠకురాలు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి మార్చి '87 నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలల పాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

బహుమతి గ్రహీత:—

శ్రీమతి వసుంధర,
C/o ఎస్. గోవిందరాజులు,
27/14, పేట,
కర్నూలు - 518 001.

# ఈ నెలలో...

## కథలు (మాస పత్రిక)


4. విషపుదారి—వి. పద్మప్రియ
17. జాతర—సుంకరి రాంప్రసాద్
36. రుద్రాక్షమాల—వసుంధర
53. మిస్టర్ ఎక్స్—ప్రతాప రవిశంకర్
67. ఆఫీసర్ల సమావేశం—జొన్నలగడ్డ రామలక్ష్మి
85. మృత్యువలయం—యస్.టి.వి. అజీజ్
110. బ్లడ్ సక్కర్—శివరామ్
125. ఏడో నంబర్ ఇల్లు—పి. అరుణ
139. మహిమాన్వితుడు—కె. బి. యస్. కుమార్
165. విషం కక్కిన వానపాము—'రాజీ'
177. మరణయాత్ర—(సీరియల్) ప్రతాప రవిశంకర్


## నవలలు (సప్లిమెంట్)


3. హనుమాయమ్మ గ్రంథాలయం—వసుంధర
42. అడక తెర—వి.యస్. రావ్
126. హైజాకర్స్—సుంకరి రాంప్రసాద్
174. అన్వేషణ—(సీరియల్) వి. యస్. రావ్


ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

# విషపు దారి

## వి. పద్మప్రియ

నేనొక దొంగని! ఒక సామాన్యమయిన దొంగని! బ్యాంకు దోపిడీలు, రైళ్ళలూఠీలు చేసేంత స్తోమతు లేకపోయినా మామూలు దొంగతనాలు చేయటంలో నేను బహు నేర్పరిని! అందుకు నిదర్శనం నేను ఒక్కసారి కూడా పోలీసులకి పట్టుబడక పోవటమే!

నేను గొలుసు కత్తిరించిన రెండు గంటలదాకా ఓ స్త్రీకి ఆ విషయం తెలియనివ్వని నేర్పరితనం నాకుంది. జేబు కొట్టేసినా ఆ వ్యక్తి అది వెంటనే గుర్తించకుండా చేయగల సామర్థ్యం వుంది.

ఈ దొంగతనాల బిజినెస్‌లో నాకు పార్టనర్స్ ఎవరూ లేరు. ఏకాకిని! ఏ పని చేసినా దానికి సంబంధించిన ప్లానూ నాదే. దానివల్ల వచ్చే ఫలితమూ నాదే.

నా చుట్టుపక్కవాళ్ళ యిళ్ళల్లో చాలాసార్లు చాలా వస్తువులు పోయాయి. కానీ దానికి కారణం నేనని ఎవ్వరూ గోరంత కూడా ఎప్పుడూ అనుమానించలేదు. ఎందుకంటే నేను ఒక ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాను. ఒక చిన్న గది తీసుకుని ఆఫీసుకి వస్తూ పోతూ చాలా గౌరవప్రదంగా కనిపిస్తున్నాను. ఎవ్వరితోనూ దోస్తీలు లేవు. ఎక్కువగా మాట్లాడను. అందువల్ల సమాజం దృష్టిలో నేనో మర్యాద గల పౌరుణ్ణి.

సమాజంలో యిటువంటి గౌరవం, స్థానం కల్పించుకోవటం ఏ దొంగకయినా చాలా ఉపకరిస్తుంది. ఎక్కడికి వెళ్ళినా జనం అతణ్ణి అనుమానించరు. పోలీసుల ఎక్స్‌రే కళ్ళు అతణ్ణి వెంటాడవు. ప్రాణం హాయిగా వుంటుంది. చాపకింద నీరులా సమాజాన్ని ముంచి పారేయటం నాలాంటి గౌరవ ప్రదమయిన దొంగలకి అతి సులభం.

ఫ్యాక్టరీలో పని అయ్యేసరికి ఐదు అవుతుంది. ఆ తర్వాత నా వేట మొదలవుతుంది. అదృష్టాన్నిబట్టి దొరికే డబ్బు అంకెలు మారుతూ వుంటుంది. ఓసారి యాభయి కన్నా దొరకదు. లక్కు బాగుంటే రెండు సవర్ల దుక్కలాంటి బంగారం గొలుసు దొరుకుతుంది.

బంగారాన్ని డబ్బుగా మార్చుకోవటం నాకు పెద్ద

కష్టం కాదు. అయితే అందుకు ఎప్పుడూ ఒకే షాపుని నమ్ముకోను నేను. ముందే చెప్పానుగా. ఎవరి దృష్టిలోనూ నేను అనుమానస్పదుడుగా వుండబోవటం నాకిష్టం లేదని.

రెండు వృత్తుల్లోనూ కలిపి వచ్చే సంపాదన సరిగ్గా దాస్తే, నిజానికి నేనీపాటికి లక్షాధికారి నయ్యుండేవాణ్ణి. కానీ చెప్పుకుంటే సిగ్గుచేటు. నా దగ్గర ఎప్పుడూ రెండొం దలకన్నా ఎక్కువ వుండదు. అందుకు కారణం నాకున్న దురలవాట్లు. విపరీతమయిన తాగుడు, రేసులు, వగైరా-వగైరా. నా డబ్బంతా ఆ అలవాట్లే మింగేస్తున్నాయి.

అయితే ఆ అలవాట్లన్నీ మానుకుని ఆత్రుతగా, గాభరాగా పనికిపోతూ డబ్బు కూడబెట్టుకోవాల్సిన అగత్యం ఒకటి పిడుగుపాటులా వచ్చి పడిందీ మధ్య. అదేమిటో చెబుతాను.

ఆరునెల్ల క్రితం నాకు కడుపులో నొప్పి వచ్చింది. ఎన్ని మందులు వాడినా అది మళ్ళీ మళ్ళీ వస్తూ చికాకు కలిగిస్తూండేది. కానీ కొన్ని రోజుల క్రితం ఆ నొప్పి వున్నట్టుండి ఒక్కసారిగా ఉధృతమైపోయింది. ప్రాణం పోయేంత బాధతో గిలగిలలాడిపోయాను. పెద్ద హాస్పటల్లో స్పెషలిస్టు ఆ పరీక్షలనీ, యీ పరీక్షలనీ నన్ను పది రోజులు అబ్జర్వేషనులో వుంచి, చివరికి నా వ్యాధి ఏమిటో తేల్చాడు.

"నీ కడుపులో లివర్ పక్కన కొన్ని కంతులు లేచి త్వర త్వరగా పెరిగిపోతూ బ్లడ్ సెల్స్‌ని నాశనం చేస్తున్నాయి. మామూలు మందులకి లొంగే వ్యాధి కాదిది. రాయవెల్లూరు హాస్పటల్లో స్పెషలిస్టులు ఆపరేషన్ చేయాలి. అన్ని ఖర్చులూ కలిపి ఇరవయి ఐదు వేల

దాకా అవుతుంది'' అన్నాడు.

నేను నిర్ఘాంతపోయాను.

''పైగా ఇది నాన్చటానికి వీల్లేని వ్యాధి. ఇప్పటికే బాగా ముదిరిపోయింది. నెలరోజులలోపు ఆపరేషను చేసి తీరాలి. ఈసారి మళ్ళీ స్ట్రోక్ వచ్చిందంటే ఆ కంతులు పగిలి ప్రాణానికే ముప్పు రావటం ఖాయం'' అన్నాడు సీరియస్‌గా చూస్తూ.

నా వ్యాధి ఎంత భీకరమయిందీ అన్నది ఆయన కళ్ళల్లోనే తెలుస్తోంది. నాకు ప్రాణభయంతో ఒళ్ళంతా జలదరించింది. ధైర్యం, మొండితనం నా సహజ గుణాలనుకునేవాణ్ణి. కానీ ఆ క్షణంలో అవి ఎక్కడికి పారిపోయాయో నాకే తెలియదు. బిక్క మొహంతో డాక్టరుగారి చేతులు పుచ్చుకుని,

''సార్! తప్పకుండా నెలరోజులలోపు ఆపరేషను చేయించేసుకుంటాను. కానీ ఈలోపు మళ్ళీ కడుపునొప్పి వస్తే?'' అన్నాను భయంగా.

''డోంట్‌వర్రీ మిస్టర్! అందుకే ఈ మాత్రలు రాసిస్తున్నాను. ఎల్లవేళలా యివి నీ వద్ద వుంచుకో. ఎప్పుడయినా నెప్పి వస్తే వెంటనే ఈ టాబ్లెట్ వేసుకుంటే ఏ ప్రమాదమూ వుండదు. వెంటనే వేసుకోవాలి. ఆలస్యం చెయ్యకూడదు. ఇంకో విషయం. ఒక్క టాబ్లెట్ కన్నా ఎక్కువ వేసుకోకూడదు. పొరపాటున రెండు వేసుకున్నావా అరగంటలో గుండె ఆగిపోతుంది. అంత పాయిజనస్ యివి! చాలా జాగ్రత్తగా వుండాలి సుమా!'' అంటూ ఆ చీటీ నాకు అందించాడు డాక్టరు.

నా ప్రాణం కొంత తెరిపిన పడింది.

''థాంక్సండి. ప్రస్తుతానికి ఏ ప్రమాదమూ లేదు

కదా?''

"ఏమీ లేదు. నెల లోపు ఆపరేషన్ చేయించుకుంటే ఏం ఫర్వాలేదు. ఈ లోపు నేను రాయవెల్లూరు హాస్పటల్లో నా ఫ్రెండ్‌తో మాట్లాడి నీ ఆపరేషన్‌కి అన్ని ఏర్పాట్లూ చేయిస్తాను. అందుకు అవసరం అయ్యే డబ్బు మాత్రం త్వరగా సమకూర్చుకో! ఇరవై ఐదువేలు దాకా అవుతుంది మరి!''

నా గుండె గుబగుబలాడింది. ఇరవయి అయిదువేలు! నెల రోజులలోపు! సంపాదించగలనా? ఇదివరకటి నా సామర్థ్యం ఈ ప్రస్తుత అనారోగ్య పరిస్థితిలో ప్రదర్శించటానికి కుదురుతుందా?

నేను దిగులుగా బయటకు వస్తుంటే,

"తాగుడు, స్మోకింగ్ పూర్తిగా మానెయ్యండి. బి ఎలర్ట్!'' అన్నాడు డాక్టర్.

ఆరోజు రాత్రంతా కంటిమీద కునుకులేదు.

మృత్యువు వికటాట్టహాసం చేస్తూ చెయ్యి చాపుతున్న భావన!

ఎలా ఈ గండం తప్పించుకోవటం?

నేను చేసేది చిన్న ఉద్యోగం. ఫ్యాక్టరీలో మాకు లోన్సులాంటివేమీ యివ్వరు. అప్పు తీసుకుందామంటే మాత్రం అంతెవరిస్తారు? ఇంక యిదివరకులాగే దొంగతనాలే గతి! అయితే నెలరోజులలోపు అంత డబ్బు దొరుకుతుందా? దొంగలకి సామర్థ్యమొక్కటే కాదు, అదృష్టం కూడా తోడుండాలి! అదే యిప్పుడు నాకు కరువయినట్టుగా తోస్తోంది. లేకపోతే నిక్షేపంలా వుండేవాణ్ణి నాకీ జబ్బేమిటి?

రెండురోజుల రెస్టు తర్వాత నేను మళ్ళీ వేట మొద

లెట్టాను. హఠాత్తుగా దేశంలో డబ్బుకి కరువొచ్చినట్టు ఎవడి పర్సులో నూ వందకి మించి డబ్బుండటంలేదు. ఆడ వాళ్ళ మెళ్ళల్లో రోల్డుగోల్డు గొలుసులెక్కువయ్యాయి. కారుల్లో తిరిగే ధనవంతులు నా వ్యూహాలకి అందరు.

ఫ్యాక్టరీకి వెళ్ళకుండా సిక్‌లీవు పెట్టి కేవలం ఇదే పని మీద తిరుగుతున్నా. పదిరోజులు పూర్తయ్యేసరికి నా దగ్గిర కేవలం రెండువేలు మాత్రం పోగయ్యాయి. నాకు మాన సిక ఆందోళన పెరిగిపోతోంది. ఒకటే ఆదుర్దా. ఒక్కో రోజు గడుస్తున్నకొద్దీ నా ఆయువు ఒక్కోభాగం తరిగి పోతున్నట్లనిపిస్తోంది

ఇలా వుండగా ఒకరోజు పొద్దున లేవగానే పేపర్లో ఒక వార్త నా దృష్టిని ఆకర్షించింది.

చలనచిత్ర పరిశ్రమకి సంబంధించిన నటులు కొందరు మూకుమ్మడిగా కలిసి వరదబాధితుల సహాయార్థం ఊరూరా ప్రదర్శనలిస్తున్నారట. వారి మొదటి ప్రోగ్రాం విజయ వాడతో మొదలవుతుంది రెండు రోజుల్లో.

ఏమున్నా లేకపోయినా మన జనాలకి సినిమాపిచ్చి ఎక్కువ. ఆడవాళ్ళకి మరీను. నటులని చూడటానికి వెర్రిగా ఎగబడతారు జనాలు. ఆ సందడిలో నాకు పది వేలకి తక్కువ కాకుండా దొరకటానికి బోలెడు అవకాశా లున్నాయి. చూద్దాం ఏమవుతుందో! విజయవాడ ప్రయా ణానికి వెంటనే సిద్ధం అయ్యాను.

## 2

తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తాడన్న సామెత నా విషయంలో అక్షరం పొల్లుపోకుండా నిజమయ్యింది.

తీరా నేను విజయవాడ వెళ్ళేసరికి సినిమా నటుల ప్రోగ్రాం కేన్సిలయ్యిందని, మరో పదిరోజుల తర్వాత

అది ప్రారంభం అవుతుందనీ తెలిసింది. భరించలేనంత నిరుత్సాహంతో తిరుగు ప్రయాణానికి రైలెక్కాను.

జీవితంమీద నాకు పూర్తిగా ఆశ నశించింది. ఆయు వుంటే బతుకుతాను. అదృష్టం వుంటే నెలరోజుల్లోపు డబ్బు దొరుకుతుంది. లేదంటే పోతాను. నా చేతుల్లో ఏం లేదిక. ఓ రకం తెగింపుతో కూడిన విరక్తితో కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చున్నాను.

పది నిముషాల్నించీ నన్ను తదేకంగా అబ్జర్వుచేస్తున్న ఎదుటి సీట్లోని వ్యక్తి యిక ఉండబట్టలేక

"ఏమండీ మీపేరు విశ్వనారాయణమూర్తా?" అన్నాడు హఠాత్తుగా.

నేను ఉలిక్కిపడి అతనివైపు చూసి "అవునండీ" అన్నాను ఆశ్చర్యంగా మీకెలా తెలిసిందన్నట్టు.

అతని మొహం కలువపువ్వులా విప్పారింది.

వెంటనే లేచి నా పక్కన కూర్చుని నా తొడమీద గట్టిగా చరుస్తూ,

"ముందే అనుకున్నాన్రా నువ్వేనని. అయినా ఎందు కయినా మంచిదని పేరడిగాను. ఏంట్రా అలా చూస్తావ్? నేను—వెంకట్రావుని! చిన్నప్పుడు ఎంత స్నేహంగా వుండేవాళ్ళం! ఒకే బడిలో సెన్తుదాకా చదువుకున్నాం కాదుట్రా? యింకా గుర్తురాలా?" అన్నాడు నవ్వుతూ.

వాడి పలువరస చూడగానే చటుక్కున గుర్తొచ్చేశాడు. కొక్కిరిపళ్ళని ఎప్పుడూ తెగ ఏడిపిస్తూ వుండేవారు వాణ్ణి బళ్ళో? ఆ వెంకట్రావా వీడు? ఎంత మారిపోయాడు?

"ఓర్నీ! నువ్వా! ఎన్నాళ్ళకి కలిసాంరా? బావున్నావా? ఎక్కడికి ప్రయాణం?" అన్నాను సంతోషంగా. అప్ప

ట్నించీ వాడు గంటసేపు వదలకుండా కబుర్లు చెప్పాడు. ఏదో ఆఫీసులో గుమాస్తా పనిట. నలుగురు పిల్లలు. ఏదో రోజులు ఈడ్చుకొస్తున్నాడట. వాడికో చెల్లెలుంది. ఆ అమ్మాయి పెళ్ళి యింకో పదిహేను రోజుల్లో జరగబోతోందిట. పెళ్ళికి నేను తప్పకుండా రావాలని చెబుతూ అడ్రసడిగాడు నా ఫ్యాక్టరీ అడ్రసు యిచ్చాను.

చిన్నప్పటి అనుభవాలన్నీ గుర్తుచేసి బాగా నవ్వించాడు వెంకట్రావు కాసేపు. మనసు తాత్కాలికంగా ఉల్లాసంగా మారింది నాకు.

మధ్యలో ఓసారి బాత్‌రూమ్‌కి వెళ్ళబోతూ తన చేతిలోని నల్లబ్యాగు నా చేతిలో పెడుతూ,

"జాగ్రత్తరోయ్! డబ్బుంది" అన్నాడు రహస్యం చెబుతున్నట్టు.

"ఎంత?" అన్నాను అప్రయత్నంగా.

"ఇరవై ఐదువేలు! చెల్లెలి పెళ్ళికోసం మా వూళ్ళో పొలం అమ్మి తీసుకొస్తున్నాను. కొనుక్కున్నవాడు పల్లెటూరివాడు కదా, డిడి యివ్వకుండా క్యాష్ యిచ్చేశాడు. సరేలే, కాస్త జాగ్రత్తగా వుంటే ఏమవుతుందిలే అని నేను కూడా ధైర్యం చేసి తీసుకొచ్చేస్తున్నాను" అన్నాడు.

హఠాత్తుగా నా చెవుల్లో ఎవరో అమృతం పోసినట్లయ్యింది ఇరవై ఐదువేలు అనగానే! గుండె చిత్రంగా స్పందించింది. సరిగ్గా నాక్కావలసినంత డబ్బుంది ఈ బ్యాగ్‌లో! ఇదంతా నా స్వంతమయితే! ఎంత అదృష్టం! నేను బ్రతికి బయటపడతాను.

కానీ-కానీ- యిది తప్పేమో? వెంకట్రావుగాడి చెల్లెలి పెళ్ళి ఆగిపోదూ? ఆగిపోతే నాకేమిటి?

నా ప్రాణంకన్నా ఎక్కువా ఈ సెంటిమెంట్లు? వెంక ట్రావు బాత్‌రూమ్‌లోంచి బయటికొచ్చేలోపల నా మనసు ఆ డబ్బు గురించే బోలెడన్ని విషపు టాలోచనలతో నిండి పోయింది.

వాడు నా ఆలోచనల తాలూకు నైచ్యాన్ని గుర్తించ లేక, ఎప్పటిలానే నవ్వుతూ నా పక్కన కూర్చుని ఎడ తెరపి లేకుండా కబుర్లు కొనసాగించాడు.

నా మెదడు తన పనిలో తనుంది.

ఈ దొంగతనం అనుకున్నంత తేలిక కాదు. వాడి కళ్ళు కప్పి ఈ బ్యాగ్ తీసుకుపోవటం చాలా కష్టం. పైగా ఎరక్కపోయి నా అడ్రసు వాడికిచ్చేశాను. అది నాకు చాలా ప్రమాదాన్ని తెచ్చిపెడుతుంది. ఏమిటీ సమస్యకి పరిష్కారం?

"అదికాదురా? ఏముంది వెధవ ప్రాణం రెండు మాత్ర లేసుకుంటే పోతుంది. అలాంటిదానికి ఎండ్రిన్ తాగి భయంకరమైన బాధతో విలవిల్లాడి మరీ పోయాడురా తెలివితక్కువ వెధవ!" అన్న వెంకట్రావు మాటలు హఠాత్తుగా నా చెవుల్లో దూరి మెదడుకి చేరాయి.

"ఏమిట్రా ఎవరి గురించి?" అన్నాను.

"వాడేరా పెదసోమరాజని వుండేవాడు కాదూ? ఇంట్లో ఏవో సమస్య... తట్టుకోలేక ఎండ్రిన్ తాగి చచ్చాడీ మధ్యే! అందు... అంటున్నాను, చచ్చేదేదో హాయిగా చావ రాదూ రెండు మాత్రలు మింగి? వాడి నరకయాతన కళ్ళారా చూసాననుకో పోయేటప్పుడు! అబ్బబ్బ! హారిబుల్!"

రెండు మాత్రలు! రెండు మాత్రలు!

ఉన్నట్టుండి మెరిసిందో మెరుపు నా మెదడులో. "ఈ

మాత్రలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకటికన్నా ఎక్కువవేసుకో కూడదు జాగ్రత్త! రెండు వేసుకుంటే అరగంటలో గుండె ఆగిపోతుంది! చాలా పాయిజనస్!"

డాక్టరుగారు నాకు చీటీ ఇస్తూ చెప్పిన మాటలు నా చెవుల్లో ప్రతిధ్వనించాయి.

నా పెదాలమీద చిరునవ్వు చిందులాడింది. నా బ్యాగ్ వైపు ఓ సారి చూశాను. అందులో వున్న డబ్బాలో వున్నాయి నా ప్లానుకి సహకరించే ఆ రెండు మాత్రలు!

## 3

"ఇక పడుకుంటానురా, నిద్రొస్తోంది" అన్నాడు వెంకట్రావు నే నందించిన కూల్ డ్రింక్ తాగిన తర్వాత.

"నిశ్చింతగా నిద్రపో!" అన్నాను వాడి కళ్ళల్లోకి చూస్తూ.

రైలు స్టేషన్ దాటి స్పీడందుకుంది.

అందరూ నిద్రలకి ఆయత్తమవుతున్నారు. వెంకట్రావు బెర్తు వాల్చుకుని బ్యాగ్ జాగ్రత్తగా తలక్రింద పెట్టుకుని పడుకున్నాడు. నాకు క్రింది బెర్తు వచ్చింది. నేను దాని మీద పడుకుని వాడికేసే కన్నార్పకుండా చూస్తూ చాలా సేపు అలాగే వున్నాను.

గంట తర్వాత మెల్లగా లేచి, వాడి నాడి అందుకుని చూశాను. కొట్టుకోవటంలేదు, గుండెమీద చెయ్యి వేశాను. ఆడటంలేదు. స్పష్టంగా తెలుస్తోంది. వాడు పోయాడు! అంత ప్రశాంతంగా ప్రాణాలు తీయగల ఆ మాత్ర లంటే విపరీతమయిన అభిమానం కలిగింది నాకు.

ఇక ఏ ప్రమాదంలేదు. వాడి బ్యాగు కొట్టేసినందువల్ల ఎలాంటి నష్టం లేదిక నాకు.

వాడి తల క్రింది బ్యాగు నెమ్మదిగా తీసి నా దగ్గర పెట్టుకున్నాను.

తెల్లవారగట్ల ఐదింటికి వస్తుంది నా స్టేషను.

అయితే టి.సి. నాలుగుకల్లా బహుశా చెకింగ్‌కి రావచ్చు.

అందుకే ఆ టైమ్‌కి నేను రైలు దిగిపోవటం మంచిది. లేకపోతే వెంకట్రావు పోయాడన్న విషయం టి.సి.కి తెలిస్తే లేనిపోని గొడవలు జరగొచ్చు!

నేను నిద్ర అనేదాన్ని ఎంత మాత్రం దగ్గరకు రానీయకుండా రాయిలాగా అలాగే కూర్చున్నాను.

సరిగ్గా నాలుగు అవుతుండగా ఏదో ఔటర్ సిగ్నల్ దగ్గర ఆగింది రైలు.

వెంటనే లేచి నుంచున్నాను. శాశ్వత నిద్రలో వున్న వెంకట్రావుని ఆఖరిసారి చూశాను. ఎందుకో జాలేసింది ఒక్క క్షణం. కానీ యిక్కడ జాలికి తావులేదు. ఈ ప్రపంచంలో దేనికన్నా కూడా నాకు నా ప్రాణం ముఖ్యం!

చకచకా నల్లబ్యాగు ప్లస్ నా బ్యాగుతో రైలు దిగాను. పట్టాల వెంటబడి, కీచురాళ్ళ ధ్వని వింటూ చీకట్లో ముందుకు నడకసాగించాను. ఓ గంట నడిస్తే ఏదో ఊరు వస్తుంది. అక్కణ్ణించి టాక్సీ ఎక్కి మా వూరికి పది నిముషాల్లో చేరుకోవచ్చు.

నేను దిగిన రైలు కూత పెట్టుకుంటూ నా పక్కనించి దూసుకుపోయింది. అందులో వెళ్తున్న వెంకట్రావు శవాన్ని తల్చుకుని 'పూర్ ఫెలో' అనుకున్నాను.

చల్లగాలి రయ్యిన వీస్తోంది. చుట్టూ చెట్లు, తుప్పలు.

ఎక్కడా జన సంచారం లేదు. అయినా నాకేమీ భయంగా లేదు. నేనే ఒక దొంగని కదా! నాకు దొంగల గురించి భయమెందుకు?

హుషారుగా ఈలవేస్తూ నడుస్తున్నాను.

చీకట్లో చూసుకోలేదు. ఫెడేలున తగిలిందో రాయి కాలికి! ముందుకి తూలబోతూ, "అబ్బా!...." అని కెవ్వున అరిచాను.

ఎదురుదెబ్బ బాధకి కాదు నా అరుపు!

హఠాత్తుగా నా కడుపులో మొదలయిన భయంకర నొప్పికి!!

నా చేతిలో వున్న రెండు బ్యాగులూ క్రింద పడి పోయాయి. నేను క్రింద కూలిపోయి కడుపు చేత్తో పట్టుకుని మెలికలు తిరగసాగాను! నా గుడ్లు వెళ్ళుకొస్తున్నాయి!

నా దగ్గరున్న రెండు మాత్రలు వెంకట్రావు తాగిన కూల్‌డ్రింక్‌లో కలిపాను. ఇప్పుడు నా ప్రాణం కాపాడటానికి ఒక్క మాత్ర కూడా నా వద్ద లేదు.

వరసగా రెండు నిముషాల్లో రెండు వామిటింగ్స్ అయిపోయాయి! నొప్పి క్షణక్షణానికీ పెరిగిపోతోంది. గుండె టకటకా అతివేగంగా కొట్టుకుంటోంది!

విపరీతమయిన బాధవల్ల నా నోట్లోంచి మూలుగు తప్ప యింకో శబ్దం రావటంలేదు. అరికాళ్ళు చల్లబడుతున్నాయి. గిరగిరా తిరిగిపోతున్న నా కళ్ళ ముందు వెంకట్రావు గొగ్గిపళ్ళతో వికృతంగా నవ్వుతున్నాడు.

"చావు, చావు" అని శపిస్తున్నాడు.

నా ఒళ్ళంతా చెమట్లు దిగ్గారిపోతున్నాయి—

నాకు తెలిసిపోయింది. మృత్యువు నన్ను సమీపిస్తోంది. బహుశా, యింకో రెండు నిముషాల దూరంలో వుండివుంటుంది. నా పాపం పండిపోయింది. నా స్నేహితుడి అమాయకపు ప్రాణంతీసి నేను బావుకున్నదేమీలేదని తెలిసింది.

నన్ను కాపాడుకోవటానికి వాడుకోవాల్సిన మాత్రలు వెంకట్రావును హతం చేయటానికి ఉపయోగించాను. నా గొయ్యి నేనే తవ్వుకున్నాను. నా మృత్యువుకి నేనే తలుపు తీశాను.

దుర్మార్గులయిన స్వార్థపరుల్ని ఈ ధరిత్రి ఎక్కువ కాలం భరించదు. భరించలేదు. ఇది పచ్చినిజం!

అబ్బా!! నెప్పి! నెప్పి! నెప్పి!!

నా కళ్ళు మూతలు పడుతున్నాయి క్రమంగా....క్రమ క్రమంగా. □

## ఎయిడ్స్ నిరోధం?



# జాతర

## — సుంకరి రాంప్రసాద్ —

జాతర!

పోలిపల్లె అమ్మవారి జాతర!

పోలిపల్లె చుట్టూ వున్న పదహారు గ్రామాలకు పండగ అది.

పండగ నాడు.... ఒక్కొక్క గ్రామంనుండీ ఒక్కొక ఘటం చొప్పున పదహారు ఘటాలూ పోలిపల్లెకు చేరు కుంటాయి.

పసుపు పూసిన క్రొత్త కుండలకు, కుంకుమ గంధపు బొట్లు పెట్టి, వేపాకు మండలు కట్టి పూజలు చేస్తారు. వాటినే అమ్మవారి ఘటాలు అంటారు.

పూర్వం పోలిపల్లె సంస్థానాధీశులు వసంతకాలంలో.... వసంతోత్సవాలు జరిపి దండయాత్రలకు వెళ్ళేవారట.

రాజులూ, రాజ్యాలూ కాలగర్భంలో కలసిపోయినా, ఆ వసంతోత్సవాలు మాత్రం అమ్మవారి జాతరపేరుతో జరుగుతూనే ఉన్నాయి.

కోడెద్దుల బండ్లనే యుద్ధ శకటాలుగా అలంకరించి, తలకు పాగాలు చుట్టి, కాసె కోకలను బిగించి కట్టుకొని, వీరతిలకం దిద్దుకొని, ఆయుధాలు చేపట్టి, ఆ బండ్లపై అమర్చిన కొయ్య చక్రాలపై కూర్చుంటారు పోలిపల్లె గ్రామ యువకులు.

అవి యుద్ధ రథాలు!

వాటి వెనుక బాణా కర్రలను, ఈటెలనూ పట్టుకొని వీరావేశంతో పరుగెత్తుతారు మరికొందరు యువకులు.

ఆ పండుగను చూడటానికి చుట్టు ప్రక్క గ్రామాల నుండి వచ్చే వేలకొలదీ జనంతో క్రిక్కిరిసి, అత్యంత కోలాహలంగా ఉంటుంది పోలిపల్లె.

అలనాటి వైభవానికి గుర్తుగా మిగిలిన శిథిలమైన రాజుగారి కోటను వింతగా చూసేవారు కొందరు.

రంగుల రాట్నం ఎక్కించమనో, పిల్లనగ్రోవిని కొనమనో పేచీపెట్టే పిల్లలూ. ఖర్జూరం, చెఱకుగడలూ, పంచదార చిలుకిలూ కొనుక్కునేవారూ, బేరమాడే

నెపంతో రెండేసి ఖర్జూరపు పలుకులు నమిలేసే కొంటె వాళ్ళు....

ఉత్తరానున్న కొండ ఎక్కి చూస్తే, నేల ఈనినట్లు తిరుణాలలో తిరుగుతున్న జనం.

జనం....జనం........

ఒకటే జనం:....

## 2

ఆర్టీసీ బస్సు దిగి తిరునాళ్ళలోనికి ప్రవేశించారు మూర్తి, మాధవ, రవి, సూరిబాబు.

విజయనగరం కాలేజీలో బి. ఎ. చదువుతున్న ఈ నలుగురూ సిగరెట్లు కాల్చడం దగ్గరనుండీ, మందు కొట్టడం వరకూ అన్నీ కలసే చేస్తారు. కాలేజ్‌కు వెళ్ళా లన్నా, సినిమాకు పోవాలన్నా....నలుగురూ కలవా ల్సిందే!

వారిలో ఒక్క మూర్తిది తప్ప, మిగిలిన ముగ్గురిదీ విజయనగరమే!

మూర్తిది మాత్రం పోలిపల్లెకు మూడు కిలోమీటర్ల దూరంలో వున్న తగరపువలస.

పోలిపల్లె జాతరగూర్చి మూర్తి గొప్పగా చెప్పటంతో జాతరను చూడడానికి వచ్చారు అతడి మిత్రులు.

వారు తిరుణాలలో ప్రవేశించారు.

సాయంత్రం కావడంతో తిరుణాలలో సందడి ఎక్కు వయింది. ఒకరి నొకరు త్రోసుకుంటూ సాగిపోతున్నారు జనం.

ఆ రష్‌లో....ఎదురవుతున్న అమ్మాయిలకు భుజా లను తాకిస్తూ....వారి వంటిపై చేతులు వేస్తూ మురిసి పోతున్నారు ఆ నలుగురు మిత్రులూ.

కాలేజ్‌లో అయితే....ఫస్టు పిరియడ్‌కు ఎగనామం పెట్టేసి, ప్రతిరోజూ వుమెన్స్ కాలేజ్ ముందు కాపుకాసి కాలేజ్‌కు పోతున్న అమ్మాయిలను ఆబగా చూస్తుండే వారు. పళ్ళికిలించేవారు. కనుసయిగలు చేసేవారు.

కేవలం చూపులతోనే చొంగలు కార్చుకొనేవారికి, ఇలా తిరుణాలలో....అమ్మాయిలను తాకుకుంటూ వారికి అంత దగ్గరగా రాసుకుంటూ పోతుంటే వారికి చెప్పలేనంత థ్రిల్‌గా వుంది.

వారు అమ్మవారి గుడి దగ్గిరకు చేరుకున్నారు.

అమ్మవారి గుడివద్ద జనం మరింత త్రొక్కిసలాడుకుంటున్నారు. ఆడవారికీ, మగవారికీ వేరు వేరుగా క్యూలు ఉన్నా, గర్భగుడిలోనికి వెళ్ళేసరికి ఆడా, మగా అంతా కలసిపోతున్నారు.

రష్‌కు భయపడి కొందరు గుడిలోకి వెళ్ళకుండా బయటనుండే అమ్మవారికి దండాలు పెట్టేస్తున్నారు.

"గుడిలోకి వెళదామేట్రా?" మిగిలిన ముగ్గురివంకా చూస్తూ అడిగాడు మూర్తి.

"ఎంత మాట గురూ! అలా గర్భగుడిలోనికి చూడు. ఆడా మగా ఎంత ఫ్రీగా కలసిపోతున్నారో!"

క్యూలో వెళుతున్న ఆడవారి వంక ఆకలిగా చూస్తూ అన్నాడు సూరిబాబు.

"భలే మంచి చౌకబేరము,
యిక మించినెన్ దొరకదు...."

అంటూ పాట పాడుతూ అప్పుడే క్యూ కూడా కట్టేసారు రవి. మాధవ్.

క్యూ మెల్లగా కదులుంతూది.

తొలగిన పైటలనూ, పరికిణీలను, ఓణీలనూ, పరా

మర్శిస్తున్నాయి వారి చూపులు.

వీరు నలుగురూ గర్భగుడిలోనికి ప్రవేశించేసరికి కరెంట్ ఫెయిలయింది. అంతా కటిక చీకటి. అప్పటికే వారు అమ్మాయిల వెనక్కు చేరారు.

అది అమ్మవారి జాతర అనీ, అది పవిత్రమైన గర్భ గుడి అనిగానీ, తామున్నది అమ్మవారి సన్నిధిలో అని గానీ వారు ఆలోచించటం లేదు.

వారికి గుర్తున్నదీ.... కనిపిస్తున్నవీ.... అందమయిన ఆడవాళ్ళ వంటి సొంపులు మాత్రమే!

తమ ముందున్న అమ్మాయిల శరీరాన్ని తమకంగా తడమసాగారు వారు. తమ గుండెలమీదా, తొడలమీదా, పిరుదులపయినా ప్రాకుతున్న చేతులను విదలిస్తూ.... కెవ్వుమని కేకలు వేసారు ఆ అమ్మాయిలు.

ఇంతలో కరెంట్ రావడంతో అమ్మాయిలకు దూరంగా జరిగి. బుద్ధిమంతుల్లా నిలబడ్డారు వారు. అమ్మవారికి అర్ధ నిమీలిత నేత్రాలతో నమస్కరిస్తూ కాసేపటికి గర్భగుడి నుండి బయటకు వచ్చారు నలుగురూ.

అప్పటికే మసక చీకట్లు క్రమ్ముకోసాగాయి.

తిరుణాల నుండి ఇళ్ళ ముఖం పట్టసాగారు చాలా మంది జనం.

పోలమ్మ తోటలో అమ్మవారికి ఎనుపోతును బలి యిచ్చేస్తే.... యిక జాతర పూర్తయినట్లే! ఆ బలి కార్యక్రమానికి పెద్దగా జనం ఉండరు.

అప్పటికే జనం బాగా పలచబడ్డారు.

"ఎన్ని వికెట్లు కొట్టావురా?" అడిగాడు రవి.

"ఇరవయి మూడో, ఇరవయి నాలుగో" మూర్తి జవాబిచ్చాడు.

"నావి—ఇరవయి ఆరు" కాలర్ ఎగురవేస్తూ అన్నాడు సూరిబాబు.

వారి భాషలో ఎన్ని వికెట్లంటే ఎంతమంది ఆడవారు అని అర్థం. ఎంతమంది ఆడవారికి డాష్ యిచ్చిందీ.... ఎలా, ఎక్కడ వారిని తాకిందీ....ఒకరి కొకరు చెప్పుకుంటూ నడుస్తున్నారు వారు.

## 3

"లాభం లేదు. అమ్మగారూ! మరి ఇది కదలదింక!"

కారు బోనెట్‌ను మూస్తూ రుక్మిణమ్మగారితో అంటున్న డ్రయివర్ మాటలు వినేసరికి గుండెల్లో రాయి పడింది సత్యవతికి.

అప్పటికే బాగా ఆలస్యమయింది. ఇంతవరకూ కారు రిపేర్ అవుతుందని కాచుకు కూర్చున్నారు వారు. తీరా ఇప్పుడు చావు కబురు చల్లగా చెబుతున్నాడు డ్రయివర్.

"అసలు తిరుణాలకు వెళతానంటేనే కోప్పడ్డాడు అన్నయ్య" అనుకుంది సత్యవతి విసుగ్గా.

నిజానికి సత్యవతి తిరుణాలకు వచ్చి వుండేది కాదు. పక్కింటి రుక్మిణమ్మగారు బలవంతంగా ఆమెను తీసుకు వచ్చింది.

"అన్నయ్య కోప్పడతాడండీ" అంది సత్యవతి.

"ఆఁ....మీ అన్నయ్యదంతా చోద్యంలెద్దూ! కారులో వెళ్ళి, కార్లో రావడానికి ఎంతసేపు పడుతుంది? మరీ కావాలంటే మీ అన్నయ్యకు నే చెబుతాగా:" అంటూ బలవంతం చేసిందది రుక్మిణమ్మ,

సత్యవతి అంటే రుక్మిణమ్మకు ఎంతో అభిమానం. ఆమె అంత ప్రేమగా పిలుస్తుంటే కాదనలేకపోయింది ఆమె. ఆపైన సత్యవతి తల్లి కూడా—

"పోనీ నీవు వెళ్ళవే! అన్నయ్యతో నే చెబుతాలే!" అంది.

ఎట్టకేలకు అందరి ప్రోద్బలంతో తిరుణాలకు బయలు దేరింది ఆమె.

తీరా, తిరుణాల నుండి వస్తూ వుండగా కారు ట్రబుల్ యిచ్చింది. ఎటూ కాని దారి. ఇలా వుండిపోయారు వారు.

"నేను తగరపువల్స వెళ్ళి మెకానిక్‌ను తీసుకొని వస్తాను అమ్మగారూ!"

అంటూ డ్రయివర్ వెళ్ళిపోయాడు.

చీకటి చిక్కబడుతూంది.

సత్యవతి భయంగా చుట్టూ చూసింది.

రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. ఆగిపోయిన కార్లో తనూ. రుక్మిణమ్మగారూ, ఆమె యిద్దరు కుమార్తెలు విజయ, జ్యోతీ, ఆ పయిన చంటికుర్రాడు బుజ్జిగాడు వున్నారు.

దూరంగా జాతరలో డప్పులమోత వినిపిస్తూంది. బలి వేయబోయే ఎనుపోతును ఊరేగిస్తున్నారు కాబోలు.

"చల్లని తల్లి అని అందరూ పూజించే అమ్మవారికి నోరులేని జీవాలను బలి ఎందుకిస్తారో? కొన్నిచోట్ల మను షుల్ని కూడా బలు లిస్తారట!"

జోరుగా వినవస్తున్న డప్పులమోతను వింటూ తనలో తానే అనుకుంది సత్యవతి.

"అమ్మా? అలా లోవ వరకూ వెళ్ళి రిక్షాలు ఏమైనా ఉన్నాయేమో చూద్దామే!" అంది విజయ.

"అబ్బా! నేను మరి నడవలేను తల్లీ! ఇప్పటికే తిరు ణాలలో తిరిగి, తిరిగీ కాళ్ళు పుళ్ళయిపోయాయి."

కారు డోర్ తీసి సీట్లో కూలబడుతూ అంది రుక్మి ణమ్మ. అమ్మ ఒడిలో తల పెట్టుకొని నిద్రకు ఉపక్ర మించాడు బుజ్జిగాడు.

"పోనీ, మేం అలా వెళ్ళి రిక్షాలుంటే తీసుకువస్తామే!" అంది విజయ.

కూతురువైపు కోపంగా చూసింది రుక్మిణమ్మ.

"ఈ చీకట్లో ఎక్కడికి వెళతారే?"

"అ(! ఇక్కడ మాత్రం చీకటి కాదేమిటి. అయినా లోవ ఎంత దూరం వుంటుందే? మహా వుంటే మూడు ఫర్లాంగుల దూరం వుంటుందేమో! అంతేగా!"

రుక్మిణమ్మ ఆలోచనలో పడింది.

అవును. నిజమే!

డ్రయివర్ మళ్ళీ ఎప్పటికి వస్తాడో....ఏమో! ఈ చీకట్లో ఎటూగాని స్థలంలో తాము మాత్రం ఎంతసేపని ఉంటారు?

లోవ వెళ్ళటమే మంచిదేమో!

లోవ నాలుగు రోడ్ల కూడలి. మంచి ట్రాఫిక్ సెంటర్. అక్కడ రిక్షాలో, ఆటోలో ఉండకపోవు.

ఇక్కడ ఒంటరిగా బిక్కు బిక్కుమని కూర్చునే బదులు లోవలో ఏదయినా ట్రాన్స్‌పోర్టు గురించి ప్రయ త్నించడమే మేలేమో!

వెధవది తనకి చూస్తే కీళ్ళ నొప్పులు. మూడు ఫర్లాం గులు నడవడమంటే తనవల్ల కాదు.

ఏం చేయటం?

ఎటూ తేల్చుకోలేక చివరకు అన్యాపదేశంగానే "ఊ" కొట్టిందామె.

"ఒకరి కొకరు తోడుగా ముగ్గురున్నారుకదా!" అంటూ

సరిపెట్టుకుంది రుక్మిణమ్మ.

సత్యవతి, విజయ, జ్యోతి మాట్లాడుకుంటూ లోవ సెంటర్ వయిపు నడవటం ప్రారంభించారు.

## 4

మూర్తి, అతడి మిత్రులు రోడ్డు మీదకు వచ్చేసరికి, విజయనగరానికి పోయే లాస్ట్‌బస్ కూడా వెళ్ళిపోయింది.

"ఏం చేద్దాం గురూ?" అన్నాడు రవి.

"అలా లోవ సెంటర్‌దాకా వెళదాం. ఏవయినా లారీలు దొరకవచ్చు అక్కడ."

జేబులో నుండి సిగరెట్ పేకెట్ తీస్తూ అన్నాడు మూర్తి.

"ఎంత దూరం వుంటుందిరా ఆ లోవ?"

ఏదయినా వెహికల్ వస్తూందేమోనని రోడ్డు వయిపు చూస్తూ అన్నాడు సూరిబాబు.

ఆ రూట్‌లో కూడా లారీలు అప్పుడప్పుడు వస్తుంటాయి. అయితే అది శ్రీకాకుళం నుండి విశాఖపట్నం వెళ్ళే రూట్. విజయనగరం వెళ్ళాలంటే లోవ సెంటర్‌కు వెళ్ళాల్సిందే.

"అఁ....! ఓ మైలు దూరం ఉంటుందేమో!" అన్నాడు మూర్తి వారికి సిగరెట్లను ఆఫర్ చేస్తూ.

నలుగురూ సిగరెట్లు ముట్టించారు.

"అయితే నడక తప్పదంటావు!" నీరసంగా అన్నాడు రవి.

"పదరా గాడిదా!" అంటూ రవి వీపుపై చిన్నగా చరిచాడు మాధవ్.

మూర్తి ముందుకు దారి తీసాడు.

తారు రోడ్డును వదలి, ప్రక్కనున్న కాలి బాటవయిపు

వెళుతున్న మూర్తి వంక ఆశ్చర్యంగా చూసారు వాళ్ళు.

"ఇదేమిటి గురూ! మెయిన్ రూట్‌ను వదలి ప్రక్క దారులు పడుతున్నావు?" అన్నాడు రవి నవ్వుతూ.

"ఇది అడ్డదారి లేవోయ్" అన్నాడు మూర్తి.

వారు నలుగురూ పొలాలకు అడ్డం పడి ఆ కాలి బాటలో నడవసాగారు.

వారు తారురోడ్డుగుండా వెళ్ళి ఉండినట్లయితే, వారికి దారిలో ఆగిపోయిన కారు కనిపించి ఉండేది. కారులో నున్న రుక్మిణమ్మగారు కనిపించి ఉండేవారు.

అప్పుడు ఈ కథకు ముగింపు యింకోలా వుండేది.

## 5

చీకటిలో రోడ్డు కిరువయిపులా ఉన్న చెట్లు జుత్తులు విరబోసుకున్న భూతాల్లా ఉన్నాయి.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ....కర్ణకఠోరంగా వినవస్తున్న కీచురాళ్ళ రొద!

ఉండి, ఉండి చల్లనిగాలి జువ్వుమని వీస్తుంది. ప్రక్క నున్న పొదల్లో ఏదో పాము బుస కొట్టిన ధ్వని.

ఏదో మొండిగా బయలుదేరారుగాని, చీకటిలో ... నిర్మానుష్యంగా వున్న రోడ్డుమీద నడుస్తుంటే ఆ ముగ్గు రమ్మాయిలకూ చెప్పలేనంత భయంగా వుంది.

సత్యవతి, విజయ ఒక్క ఈడువారే. పదిహేడు, పద్దెనిమిదేళ్ళ వయసుంటుంది వారికి. ఇద్దరూ భీముని పట్టణం జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ చదువుతున్నారు. జ్యోతి విజయ కన్న చిన్నది. హైస్కూలులో పదవ తరగతి చదువుతూంది.

భయాన్ని మరచిపోవడానికి ఏవో కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు వారు.

అదే సమయంలో....

అడ్డు త్రోవను వస్తూన్న మూర్తి, అతడి మిత్రులు ఆ అమ్మాయిలను చూసారు.

చీకటిలో దూరంగా నడుచుకుంటూ వెళుతున్నవారిని మొదటగా చూసింది రవి.

"ఒరేయ్! అమ్మాయిల్రోయ్!"

అన్నాడు రవి గబ, గబా రోడ్డును ఎక్కుతూ.

"అవున్రోయ్! క్లాస్ కలర్‌లాగే కన్పిస్తుంది" నడక వేగాన్ని పెంచుతూ అన్నాడు సూరిబాబు.

వాళ్ళు నలుగురూ రోడ్డును క్రాస్ చేసారు.

తమ వెనుక ఏవో అస్పష్టంగా మాటలు వినిపించే సరికి వెనక్కు తిరిగి చూసారు ఆ అమ్మాయిలు.

తమ వంకే వేగంగా నడుచుకుంటూ వస్తున్న నలుగురు యువకులను చూడగానే, ఆ అమ్మాయిలు కూడా నడక వేగాన్ని పెంచారు.

చీకటి....

ఆ పైన నిర్జన ప్రదేశం....ఎదురుగా అందమైన అమ్మాయిలు. కోరికతో ఆ యువకుల రక్తం వేడెక్క సాగింది.

"ఒరేయ్! ఆ టర్నింగ్ తిరిగితే లోవ సెంటర్ వచ్చేస్తుంది. ఆ లోపలే వీళ్ళను పట్టాలి. కమాన్ హరియప్!" అంటూ ముందుకు పరిగెత్తాడు మూర్తి.

అతడిని అనుసరించారు మిగిలిన ముగ్గురూ.

తమ వంకే పరిగెత్తుకొని వస్తున్న ఆ యువకులను చూసేసరికి భయంతో వణికిపోయారు ఆ అమ్మాయిలు.

'కెవ్వు' మని అరుస్తూ పరిగెత్తసాగారు.

లేడిపిల్లల వెనుక పరిగెత్తే చిరుతగండుల్లా....ఆ

యువకులు వారిని తరుముతున్నారు.

ఆడది ఒంటరిగా కన్పిస్తే, ఆమెను అనుభవించాలనే తప్ప, ఆమెను రక్షించాలని కలలో కూడా తలవనంతగా మగాడు పతనమైన ఈ వ్యవస్థలో....

బలవంతుడు బలహీనుణ్ణి వేటాడే ఆటవికనీతి ఉజ్వ లంగా వర్ధిల్లుతున్న ఈ జనారణ్యంలో....

భీతహరిణల్లా పరిగెడుతున్న ఆ అభాగినులను ఆదు కునేవారే లేరా అని ఆక్రోశిస్తున్నట్లుగా హోరుమంటూ గాలి వీస్తూంది.

గాలికి పరికిణీ కుచ్చిళ్ళు కాళ్ళకు అడ్డుపడుతూండ టంతో ఆ అమ్మాయిలకు పరిగెత్తటం కాస్త కష్టంగా ఉంది.

కాళ్ళు తడబడుతున్నా, ఆయాసంతో గుండెలు ఎగిసి, ఎగిసి పడుతున్నా—ఆ అమ్మాయిలు పరిగెడుతూనే ఉన్నారు.

వారి వెనుక రేచుకుక్కల్లా దూసుకు వచ్చేస్తున్నారు ఆ యువకులు.

దూరంగా మిణుకు మిణుకుమంటూ లోవ సెంటర్ లోని లైట్లు కన్పిస్తున్నాయి.

"ఇంకెంత....ఇంకో ఇరవయి అడుగులు వేస్తేచాలు" అనుకున్నారా అమ్మాయిలు.

అంతలో....

పరిగెడుతున్న సత్యవతి కాలు ఒక రాయికి తగిలింది. కాలు తడబడింది. ముందుకు తూలింది. అదేసమయంలో గాలికి ఎగిరిన ఆమె పరికిణీ చివర్లు పాదానికి చుట్టు కున్నాయి.

అంతే!

ఆమె బోర్లా పడిపోయింది. ఆ పడటంలో రోడ్డుమీద నుండి క్రిందనున్న పల్లంలోనికి చాపచుట్టలా జారి పడి పోయింది.

పడిపోయిన సత్యవతిని గమనించలేదు మిగిలిన ఇద్ద రమ్మాయిలూ. వారిద్దరూ ప్రాణాలు బిగబట్టుకొని పరిగెడు తున్నారు.

రోడ్డు పైనుండి క్రిందకు జారిన సత్యవతిని గమ నించిన సూరిబాబు టక్కున ఆగిపోయాడు.

"దీని సంగతి నేను చూస్తాను. మీరు వారి సంగతి చూడండ్రా" అంటూ గబ, గబా రోడ్డు దిగాడతడు.

విజయ, జ్యోతిల వెనుక మాధవ్, మూర్తి పరిగెత్త సాగారు.

రవి ఒక్క క్షణం ఆలోచించాడు.

"గుప్పిటలోని ఒక్కపిట్ట గూటిలోని రెండింటికన్నా మేలు!" అన్న ఆంగ్లసామెత గుర్తుకు వచ్చింది అతడికి.

వెంటనే అతడు కూడా సూరిబాబు వెంటే చక, చకా రోడ్డు దిగాడు.

క్రిందబడ్డ సత్యవతి లేచి నిలబడదామనుకునేసరికి తనవయిపే వస్తున్న రవి, సూరిబాబు కనిపించారు. భయంతో వణికిపోయిందామె.

తప్పించుకుని పారిపోదామనుకుంది ఆమె.

కాని అప్పటికే వారు ఆమెను చుట్టుముట్టారు. సత్య వతి మీదకు ఆత్రంగా వంగుతున్న రవిని భుజం పట్టుకు ఆపాడు సూరిబాబు.

"ఇక్కడ కాదు. ఆ తోటలోనికి తీసుకుపోదాం"— కొ_స్త దూరంలో పొలాల మధ్య కన్పిస్తున్న గుబురు మామిడి తోటను చూపిస్తూ అన్నాడు సూరిబాబు.

గింజుకుంటున్న సత్యవతి నోటిలో ఆమె ఓణీనే క్రుక్కి, ఆమెను ఎత్తుకొని ఆ తోట వైపు పరిగెత్తారు వారు.

ఆమె గిజగిజా గింజుకుంటూంది.

నిస్సహాయంగా కన్నీరు కారుస్తూంది.

దూరంగా....

జాతరలోని డప్పుల శబ్దం పరాకాష్టకు చేరుకుంది. అంటే....బలిపీఠం దగ్గరకు ఎనుపోతును చేర్చారన్న మాట!

ఇక మిగిలింది 'బలి' కార్యక్రమమే!

## 6

"ఏం....రా! ఏమయింది?" అడిగాడు సూరిబాబు చేతులు నలుపుకుంటూ వస్తున్న మూర్తి, మాధవ్‌లను చూస్తూ.

"బాడ్ లక్! తప్పించుకున్నారు గురూ!" అన్నాడు మాధవ్ నిరాశగా.

"మధ్యలో ఆ లారీ ఒకటి వచ్చింది. పోతున్నవాడు పోకుండా పెద్ద హీరోలా ఆపాడు ఆ లారీవాడు. ఆడ పిల్లలు చేయి ఊపేసరికి ఆశ పుట్టిందేమో! యింక గొడవెందుకని గుట్టుగా వెనక్కు వచ్చేశాం!" అన్నాడు నిట్టూరుస్తూ మూర్తి.

"మరి ఈ పిట్ట?" చుట్టూ చూస్తూ అనుమానంగా అడిగాడు మాధవ్.

"అదిగో ఆ తోటలో. రవిగాడు ఓ పట్టు పడుతున్నాడు" నవ్వుతూ అన్నాడు సూరిబాబు.

"మరి చెప్పవేం?" అంటూ తమకంగా వళ్ళు విరుచుకొని ముందుకు వెళ్ళబోతున్న మూర్తిని ఆపి....

"గెస్స్ ఆర్ ఫస్ట్?

"నీవు యిక్కడ కాపలా చూడు బుజ్జీ. మేమిద్దరం వెళ్ళి పస్తాం!"

అంటూ సూరిబాబు మాధవ్ తోటవైపు నడిచారు.

వారి వంక అసహనంగా చూస్తూ సిగరెట్ వెలిగించాడు మూర్తి.

ఒక్కొక్క క్షణం గడిచిపోతూంది.

ఓ అయిదు నిముషాల తర్వాత చొక్కా గుండీలు పెట్టుకుంటూ వస్తున్న రవిని చూస్తూ.... "ఏమంటుందిరా పిట్ట?" అన్నాడు మూర్తి ఆత్రంగా.

చిన్నగా నవ్వాడు రవి.

"మామూలేరా!

భోరుమని ఏడుస్తూ కాళ్ళు పట్టుకుంది.

అన్నయ్యా! నన్ను విడిచిపెట్టు. నీ చెల్లెలులాంటి దాన్ని. నా బ్రతుకు పాడుచేయకు అంటూ ప్రాధేయ పడింది.

"కన్నెపిల్ల కన్నీళ్ళకు కరిగిపోతే కోరికెలా తీరుతుంది?" నవ్వుతూ అన్నాడు రవి.

"అన్నయ్యా! అందా! మరి చెప్పవేం?

ప్రపంచ సుందరి క్లియోపాత్రను పెళ్ళాడిన ఆమె సొంత తమ్ముడు, అక్కయ్య పొందుకోసం ఆమె బెడ్ రూమ్ ముందు పడిగాపులు కాసేవాడట!

రాజవంశ రక్తం కలుషితం కాకుండా స్వంత అక్కా, తమ్ముళ్ళకు, అన్నా, చెల్లెలకు పెళ్ళిల్లు చేసేవారటలే.... ఈజిప్ట్‌లో.

'నేనూ ఈ ఒక్కసారి ఈజప్టులో పుట్టాననుకుంటాను. అప్పుడు నీవు చెల్లివయినా, అక్కవయినా ఏ అభ్యం

తరమూ వుండదు' అని చెప్పలేకపోయావా ఆ పూర్ క్రీచర్‌కి" అన్నాడు మూర్తి.

వారిద్దరూ పగలబడి నవ్వుకున్నారు.

ఆ నవ్వుకు కీచురాళ్ళు టక్కున నోళ్ళు మూసుకున్నాయి. శీలంపట్ల వారికున్న నమ్మకాన్ని, అన్నా, చెల్లెల్ల సంబంధంపట్ల వారికున్న అవగాహననూ చూసిన ఆ కీచురాళ్ళు కూడా సిగ్గుపడ్డాయేమో!

సిగ్గులో మూగపోయాయేమో!

ఇంతలో సూరిబాబు వచ్చేశాడు .... చిరునవ్వులు చిందిస్తూ.

"వెళ్ళు గురూ" అంటూ కన్నుకొట్టాడు రవి.... మూర్తిని చూస్తూ.

హుషారుగా తోటవైపు అడుగులు వేసాడు మూర్తి.

## 7

మూర్తి వెళ్ళేసరికి....

మాధవ్ ఫాంట్ జిప్పును పెట్టుకుంటున్నాడు. విప్పేసిన షర్టు అతడి భుజంపైన వుంది. ఒక తీయని అనుభవానికి గుర్తుగా అతడి నుదుట చిరుచెమటలు పట్టి వున్నాయి.

మూర్తిని చూసి చిన్నగా నవ్వాడతను.

మూర్తి భుజాన్ని తట్టి, నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు మాధవ్.

మూర్తి ముందుకు చూసాడు.

అసలే చీకటి రాత్రి. ఆపైన గుబురుగా వున్న ఆ తోట మరింత చీకటిగా వుంది.

కాస్త దూరంలో....ఓ చెట్టు క్రింద....వెల్లకిలా పడి వున్న ఓ యువతి ఆకారం అస్పష్టంగా కన్పించింది

అతడికి.

ఆమె వంటిపై ఓణీలేదు. లంగా తొడల వరకూ చెదిరి వుంది. చిరిగి పీలికలైన జాకెట్. హుక్స్ తెగిన బ్రా.... చీకటిలో సైతం ఆమె నగ్నదేహం తెల్లగా, నిగనిగా మెరుస్తూంది.

అతడు మెల్లగా ఆమెను సమీపించాడు.

సత్యవతి నిస్సహాయంగా కనులు మూసుకొని వుంది. అప్పటికే ముగ్గురు పీల్చి, పిప్పిచేసారేమో .... ఆమె శరీరం కూడా ఆమె స్వాధీనంలో లేదు.

ఎదిరించీ. ఎదిరించీ అలసిపోయింది ఆమె. ఇప్పుడు ప్రతిఘటించే ఓపిక కూడా లేదు ఆమెలో.

మూర్తి అడుగుల చప్పుడుకు తలను కూడా త్రిప్పి చూడలేదు ఆమె.

మెల్లగా ఆమె మీదకు వాలిపోయాడు మూర్తి. నగ్నంగా వున్న ఆమె దేహం తనలో కోరికలను రెచ్చగొడుతుంటే, ప్రక్కకు త్రిప్పుకున్న ఆమె ముఖాన్ని తన వైపుకు త్రిప్పుకొని, ఆమె పెదవుల కోసం ఆత్రంగా వంగాడు మూర్తి.

అంతే!

"కెవ్వు!" మన్న కేక ఇద్దరి నోటమ్మట ఒకేసారి వచ్చింది

కరెంట్ షాక్ కొట్టినట్లు దిగ్గుమని పైకి లేచారు యిద్దరూ. వారి శరీరాలు వణికిపోతున్నాయి.

వేయిపిడుగులు తనమీద పడినట్లుఅనిపించింది మూర్తికి. అతడి చెవుల్లో ఏదో హోరు.

ఆ హోరులో....అస్పష్టంగా ఏవో మాటలు.

"నేనూ ఈ ఒక్కసారికి ఈజిప్టులో పుట్టాననుకుంటాను. అప్పుడు నీవు చెల్లివయినా, అక్కవయినా ఏ అభ్యంతరమూ వుండదు."

రవితో అతడు నవ్వుతూ అన్న మాటలు. వేయి గొంతులతో అతడి చెవుల్లో మార్మోగుతున్నాయి.

నోటివెంట మాట కూడా రాక అలా అచేతనంగా వుండిపోయాడు మూర్తి. .

మూర్తివంక ఒక్కసారి పిచ్చిదానిలా చూసింది సత్యవతి.

"అన్నయ్యా!" అని బావురుమని ఏడుస్తూ కాస్త దూరంలో వున్న దిగుడుబావి వంక పరుగెత్తిందామె.

మూర్తి యింకా అలా శిలాప్రతిమలాగానే నిలుచున్నాడు.

'దబ్' మని ఏదో నూతిలో పడ్డట్టు శబ్దం వినిపించేసరికి తోటలోకి పరుగెత్తుకు వచ్చారు రవి, సూరిబాబు, మాధవ్.

దిగుడుబావిలో తేలుతున్న సత్యవతి శవం వారిని వెక్కిరిస్తూ సాక్షాత్కరించింది.

ఓ ప్రక్క విగ్రహంలా నిలబడ్డ మూర్తి!

పిచ్చివాడిలా అలా మాటా మంతీ లేకుండా నిలుచుండిపోయిన మూర్తిని పట్టుకుని కుదుపుతూ...."ఏమయిందిరా మూర్తీ!" అని అడిగాడు సూరిబాబు.

ఆ ముగ్గురినీ చూసేసరికి మూర్తిలో ఏదో పిచ్చి ఆవేశం ప్రకోపించింది.

తనను ఏదో అడుగబోతున్న సూరిబాబు పీక పట్టుకొని నులమసాగాడు. విడిపించబోయిన రవిని, మాధవ్‌ను కాళ్ళతో తన్నాడు. గోళ్ళతో రక్కాడు. పిచ్చికుక్కలా

వారిని కరిచాడు.

మూర్తి పరిస్థితి వారికి అర్థం కాలేదు.

అంతవరకూ బాగానేవున్న మూర్తి ఒక్కసారిగా ఇలా తమమీదకు యెందుకు విరచుకుపడుతున్నాడో అర్థం కాక తెల్లబోయారు వారు.

అవును మరి....

ఈ జాతరలో తమ కామానికి బలిపశువుగా మారి, ఇప్పుడు దిగుడుబావిలో శవంగా తేలుతున్న సత్యవతి.... మూర్తి చెల్లెలేనన్న నిజం....వారికేం తెలుసు!

ఆ నిజాన్ని జీర్ణించుకోలేక—

ఆ షాక్‌ను తట్టుకోలేక—

తమ మిత్రుడు మూర్తి మతిని కోల్పోయాడని, శాశ్వతంగా పిచ్చివాడైపోయాడని....పాపం వారికి ఆ క్షణంలో తెలియదు! □

## గట్టి తుమ్ము!



# రుద్రాక్షమాల

## వసుంధర

“నమస్కారం సేఠ్‌జీ!” అన్నాడతను.

రామారావు సోఫాలో వెనక్కి జారగిలబడి ఆగంతకుడి వంక కుతూహలంగా చూసి - “నీకుద్యోగం కావాలా? ఏం చేస్తావు?” అన్నాడు.

"ఏమైనా చేయగలనండి" అన్నాడతడు.

"ఏమైనా అంటే!"

"ఏమైనా సరేనండి...."

"ఉదాహరణ చెప్పు" అన్నాడు రామారావు.

"మీకో అమ్మాయిపై మనసయిందనుకోండి. ఆమె సప్తసముద్రాల కవతల ఒంటిస్థంభం మేడలో వున్నాసరే తీసుకుని వచ్చి ఈ గదిలో వుంచగలను."

"నేనలాంటి వాడిననుకున్నావా?" రామారావు చిరుకోపంతో అన్నాడు.

"మీ కెలాంటి ఉదాహరణ కావాలో చెప్పండి" అన్నాడతడు.

రామారావు సోఫాలో ముందుకు వంగి అతడి వంక పరీక్షగా చూస్తూ "ఈ ఉదాహరణ యివ్వాలని నీ కెందు కనిపించిందో చెప్పు" అన్నాడు తీవ్రంగా.

"సుభద్ర నాకు తెలుసు" అన్నాడతడు.

"సుభద్ర ఎవరు?" అన్నాడు రామారావు.

"పేరు మీకు గుర్తుండకపోవచ్చు. సుమారు సంవత్సరం క్రితం ఈ గదిలోనే మీరామెను...." ఆగాడతడు.

రామారావుకు సుభద్ర గుర్తుకు వచ్చింది.

రసగుల్లాలాంటి పిల్ల. కానీ నోరూరించడమే తప్ప దగ్గరగా రాదు. ఆమె అంటే తొలిచూపులోనే మోజుపడ్డాడతను. ఆమె గురించి వాకబు చేశాడు. ఓ కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తోంది. తండ్రిలేదు. తల్లి, ఇద్దరు తమ్ముళ్ళు....

ఆమెకు తన కంపెనీలో రెట్టింపు జీతంమీద ఉద్యోగ మిచ్చాడు.

తర్వాత తన కోరిక చెప్పాడు.

మృదువుగా నిరాకరించిం దామె.

అప్పుడామె ఈ గదికి రప్పించబడింది.

తర్వాత ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు విని జాలి పడ్డాడు.

అర్థంలేని విలువల నాపాదించుకుని కొందరు జీవితంలో సుఖానికీ అటుపైన జీవితానికీ దూరమవుతారు.

నీతికి విలువలేదని గ్రహించడంవల్లనే తను జీవితంలో యింత పైకి వచ్చాడు.

"సుభద్ర నీకేమవుతుంది?"

"ఇద్దరం ప్రేమించుకున్నాం...."

"అయితే ఇక్కడి కెందు కొచ్చావు?"

"సుభద్రకంటె ఎక్కువగా నేను జీవితాన్ని ప్రేమిస్తున్నాను...."

రామారావు సోఫాలో మళ్ళీ వెనక్కు జారగిలబడి "ఇంకా ఏమైనా మంచి ఉదాహరణ చెప్పు" అన్నాడు.

"తగిన ప్రతిఫలముంటే మీ అంతటివారిని హత్య చేయగలను" అన్నాడతను.

"జీవితాన్ని ప్రేమించేవారు హత్యలు చేయలేరు...."

"అంటే మీరు జీవితాన్ని ప్రేమించడంలేదా?"

రామారావు భృకుటి ముడతలు పడింది—"నీ ఉద్దేశ్యం?"

"సుబ్రహ్మణ్యం నాకు తెలుసు" అన్నాడతడు.

"సుబ్రహ్మణ్యం ఎవరు?"

"మీకూ తెలుసు...."

ఏదో అనబోయి ఆగిపోయాడు రామారావు.

సుబ్రహ్మణ్యం తన కంపెనీలో ఉద్యోగి. నీతిని నమ్ముకున్నవాడు. కంపెనీకి ప్రమాదకరమైన రహస్య మొకటి

తెలుసుకుని రామారావుకు చేరవేశాడు. రామారావు ఆశ్చర్యాన్ని నటించి తను చూస్తానన్నాడు. కొన్నాళ్ళాగి సుబ్రహ్మణ్యం మళ్ళీ రామారావుని హెచ్చరించాడు. రామారావతణ్ణి గదికి పిలిచాడు. చూసీ చూడనట్లూరుకుంటే మంచి లాభముంటుందన్నాడు. అతడు లొంగలేదు.

అర్థంలేని విలువల నాపాదించుకుని జీవితంలో సుఖానికీ అటుపైన జీవితానికీ దూరమయ్యాడు సుబ్రహ్మణ్యం.

"సుబ్రహ్మణ్యం నీకెలా తెలుసు?"

"సుబ్రహ్మణ్యం తండ్రి సహృదయుడు. నా చదువుకాయన చాలా సాయం చేశాడు. ఆయన్ను నేను తండ్రికంటె ఎక్కువగా గౌరవిస్తాను...."

రామారావు సోఫాలోంచి లేచి నిలబడి "నువ్వు నిజంగా ఉద్యోగం కోసమే వచ్చావా?" అన్నాడు.

"మీకా సందేహ మెందుకొచ్చింది?" అన్నాడతడు.

"నీ పేరు?"

"చంద్రం"

"మిస్టర్ చంద్రం! నువ్వు నా గతాన్ని గుర్తుచేసి తెలివిగా మాట్లాడేననుకుంటున్నావు. కానీ నా కిలాంటివి నచ్చవు. నువ్విక వెళ్ళొచ్చు...."

"మీ రడిగితేనే కదా నే నుదాహరణలు చెప్పాను."

"నీ ఉదాహరణలు నాకు నచ్చలేదు...."

చంద్రం వినయంగా "అయితే నేను తమకో విషయం మనవి చేసుకోవాలి" అన్నాడు.

"ఊఁ"

"మీకు అర్జంటుగా ఓ మనిషి కావాలి. నాయుడుగారింటికి కబురెట్టారు. ఆయన పంపే మనిషికోసం ఇక్క

దెదురు చూస్తున్నారు....”

“కావచ్చు. కానీ నువ్వు నాకు నచ్చలేదు....”

“నాయుడుగారు పంపిన మనిషి మీకు నచ్చకపోవడం ఎప్పుడైనా జరిగిందా?” అన్నాడతడు.

“లేదు. ఆ విషయం నేనూ నాయుడూ చూసుకుంటాం....”

“చూసుకునే అవకాశం మీకు రాకపోతే?”

“ఎందుకు రాదు?”

“ఎందుకంటే” అని చంద్రం ఒక్క క్షణం ఆగి “నన్ను నాయుడుగారు పంపలేదు. అందుకే నేను మీకు నచ్చలేదు” అన్నాడు.

“ఎవర్నువు?” అన్నాడు రామారావు తెల్లబోయి.

“నా పేరు చంద్రం. సుభద్ర, సుబ్రహ్మణ్యం నాకొక్కవలసిన వాళ్ళు. ఇక్కడ మీరు నాకు ఏకాంతంగా దొరుకుతారని తెలిసి వచ్చాను. పని పూర్తి చేసుకుని తగిన ప్రతిఫలంతో వెళ్ళిపోతాను....”

“ఏం చేస్తావు నువ్వు?”

చంద్రం జేబులోంచి బటన్ నైఫ్ తీశాడు “మిమ్మల్ని దీంతో పొడిచి చంపుతాను.”

రామారావు నవ్వాడు “నన్నెవ్వరూ చంపలేరు. చంపినవాడు బ్రతికి బయటపడలేడు.”

“ఈ యింట్లో మీరు ఏకాంతంగా వున్న తరుణంలో నాయుడు పంపిన మనిషి తప్ప వేరొకడిక్కడ మిమ్మల్ని కలుసుకోగలడా?”

“లేడు”

“కానీ నేను కలుసుకున్నాను”

“అంటే?”

"మీ నమ్మకా లబద్ధమయే రోజొచ్చిందని అర్థం."

"నిన్ను నాయుడు పంపాడని నా నమ్మకం."

"అయితే నాయుడు పంపిన మనిషి చేతిలో మీకు చావుంది...."

"ఎలా చంపుతావు?"

బటన్ నొక్కాడు చంద్రం - "చూపించనా!"

రామారావు కళ్ళలో రవంత బెదురు కనిపించింది- "నాయుడు మనిషివి కాకపోతే నువ్విక్కడి కెలా వచ్చావు?"

"నాయుడు మీ దగ్గరకు సీతారామాన్ని పంపాలనుకున్నాడు. సీతారామం నావల్ల చాలా లాభాలు పొందాడు. తన రహస్యాలు చాలా చెప్పాడు నాకు. మీ దగ్గరకు వెడుతున్న విశేషం చెప్పాడు. అతణ్ణెలా ట్రాప్ చేయాలో నాకు తెలుసు. అతడి స్థానంలో నేను వచ్చాను-"

"నాయుడి మనుషులంత సులభంగా ట్రాప్‌లో పడరు...."

"నిజమే! కానీ మేమిద్దరం ఒకేగూటి పక్షులం. నేనతడిపైన రోజీని ప్రయోగించాను. అతడికి ఆడవాళ్ళంటే క్రేజ్. రోజీ ఋష్యశృంగుల్లో కూడా క్రేజ్ పుట్టించగల ఆడది. ఆమె మత్తులో పడి అతడు తన పనిని నా కప్పజెప్పాడు. అనుకున్న సమయానికి వచ్చిన కారులో సీతారామం స్థానంలో నేను వచ్చాను...."

"బహుశా నీ శక్తిసామర్థ్యాలు నిరూపించుకుందుకీ పని చేసి ఉంటావు. నువ్వు నన్ను చంపుతావని నే ననుకోను-"

"అనుకోనంత మాత్రాన మీరు బ్రతికిపోరు-" అన్నాడు చంద్రం.

"చూడు. నువ్విప్పుడు నన్ను చంపి బైటకు వెళ్ళావనుకో. ఈ వీధి దాటి ఎక్కడకు వెళ్ళినా నిన్ను క్షణంగా శోధించనిదే నా మనుషులు వదిలిపెట్టరు. నీ దగ్గర అనుమానాస్పదమైనదేం దొరికినా నీ పనై పోతుంది-"

"ఇక్కడికి రాగలిగినవాణ్ణి ఇక్కణ్ణించి వెళ్ళనూ గలను...."

"నువ్వెళ్ళిన కొద్ది నిముషాల్లో గదిలోకో అమ్మాయి వస్తుంది. ఆమె నన్ను చూసి కేకలు పెడితే నీ పని...."

చంద్రం నవ్వి-"ఆమె మీ గదిలోకి వచ్చి నిద్రమాత్ర వేసుకుని పడిపోతుంది. స్పృహతప్పిందని అంతా అనుకుంటారు-"

అప్పుడు రామారావు ముఖంలో నిజంగా భయం కనపడింది—"నీకు చాలా విశేషాలు తెలుసును...." అన్నాడు.

"ఈ పూటకు వచ్చే అమ్మాయి నా మనిషి. నాయుడు రోజీని కోరాడు. రోజీ నాకు చెప్పింది. రోజీకి నేనంటే చాలా యిష్టం - ...."

"నన్ను చంపకు-—" అన్నాడు రామారావు చటుక్కున.

"మీ మెడలో పదిలక్షలు విలువచేసే రుద్రాక్షమాల ఉంది. ప్రతి రుద్రాక్షలోనూ ఒక వజ్రం దాచబడిందని నాకు తెలుసు. మీ రుద్రాక్షలు ప్లాస్టిక్ గుల్లలనీ నాకు తెలుసు. అది తీసుకుని వెడతాను...."

రామారావు మెడలోంచీ రుద్రాక్షమాల తీసి చంద్రానికిచ్చి-"ఈ రుద్రాక్షమాల గురించి తెలుసుకున్నావంటే నువ్వు సామాన్యుడివి కాదు. ఇవి తీసుకుని వెళ్ళిపో- నన్ను చంపకు-" అన్నాడు.

చంద్రం రుద్రాక్షమాల అందుకుని జేబులో వేసుకుని- "నిన్ను బ్రతకనిస్తే నన్ను బ్రతకనివ్వవు-" అన్నాడు.

"బ్రతకనిస్తాను-" అన్నాడు రామారావు.

"నేను నిన్ను నమ్మను-" అంటూ చటుక్కున బటన్ నైఫ్‌తో అతడి గుండెల్లో పొడిచాడు చంద్రం.

రక్తం చివ్వున చిమ్మింది.

రామారావు వెనక్కు పడిపోయాడు. మరుక్షణమే అతడు కనులు తేలవేశాడు.

చంద్రం అక్కణ్ణించి బైటకు నడిచాడు.

ఇంట్లో ఎవ్వరూ లేరు.

వీధిలో ఇంటి కెదురుగా ఓ బిచ్చగా డున్నాడు.

చంద్రం బిచ్చగాణ్ణి సమీపించాడు-"రుద్రాక్షమాలను నీ జోలిలో వేస్తున్నాను. రేపు శివాలయం దగ్గర కలుసు కుంటాను. నా కప్పుడది చేరాలి. తెలిసిందా?" అన్నాడు.

బిచ్చగాడు తలూపాడు.

బిచ్చగాడు ఊరిబైట సత్రంలో ఉంటున్నాడు. వారం రోజుల నుంచి వాణ్ణి మంచి చేసుకున్నాడు చంద్రం. రోజూ పదిరూపాయల చొప్పున యిచ్చాడు. ఇప్పు డిక్కడ ఉండమనికూడా తనే చెప్పాడు. ఉదయం నుంచీ ఆ బిచ్చగా డా వీధిలోనే ఉన్నాడు. వచ్చేపోయేవాళ్ళను అడుక్కుంటున్నాడు.

వాడినెవరూ అనుమానించరు.

రోజుకో వీధి మారుస్తూ ఏడాదిగా అడుక్కుంటు న్నాడు.

చంద్రం ఉత్సాహంగా ముందడుగువేసి ఓసారి తన వంక చూసుకున్నాడు. చుక్క రక్తం కూడా తనపై చింద లేదు.

అతడు రెండు సందులు తిరిగాడు.

అక్కడ కారుంది.

కారు పక్కన ఓ మనిషి నిలబడ్డాడు-"అనుకున్న టైముకే వచ్చావు-" అన్నాడతడు.

చంద్రం నవ్వాడు.

"విశేషాలేమిటి?" అన్నాడతడు.

"చూసుకో-" అన్నాడు చంద్రం చేతులెత్తి.

అతడు చంద్రం జేబులు శోధించాడు.

"గుడ్?" అన్నాడు.

చంద్రం నవ్వాడు.

"ఊళ్ళో యే సినిమా లాడుతున్నాయి...?" అన్నాడతడు.

అతడు తనను కాసేపు కబుర్లలో పెడతాడని చంద్రానికి తెలుసు. ఆ యింట్లో ఆ యువతి ఏమన్నా విడ్డూరం చూస్తే పరుగున అక్కడికి వస్తుంది.

చంద్రం అతడికి బదులిస్తున్నాడు.

ఓ పావుగంట తర్వాత అతడు—"కారెక్కు—" అన్నాడు. చంద్రం కారెక్కాడు.

అతడు డ్రైవింగ్ సీట్లో కూర్చుని—"ఎక్కడకు?" అన్నాడు.

"థియేటర్ చంప—" అన్నాడు చంద్రం.

కారతణ్ణి థియేటర్ చంప దగ్గర దింపి వెళ్ళిపోయింది.

చంద్రం అక్కడే ఉండి టికెట్లివ్వడం ప్రారంభం కాగానే రెండో ఆటకు టికెట్ను తీసుకున్నాడు.

తలుపులు తీయగానే హాల్లోకి వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు.

హాల్లో దీపాలారిపోగానే అతడు త్వరగా వేషం మార్చుకున్నాడు. చిన్న గెడ్డం-కత్తెరమీసాలు-బట్టతల-చిన్న పులిపిరికాయ....

ఎదుట అద్దం లేకుండా అతడు వేషం మార్చుకున్న తీరు అద్భుతం.

సినిమా అవుతూండగా అతడు సీట్లోంచి లేచి ఔట్ పాస్ తీసుకున్నాడు. బాత్రూంకు వెళ్ళాడు.

చొక్కా తిరగేసి తొడుక్కున్నాడు. పాంటు తిరగేసి తొడుక్కున్నాడు, రెండింటికీ రంగు, డిజైన్లు మారిపోయాయి.

కాలికి వేసుకున్న బూటులో చిన్న మార్పులు చేశాడు. అది ఆకుజోడుగా మారిపోయింది.

అతడు బాత్రూంలోంచి తిరిగి థియేటర్లోకి వెళ్ళాడు.

సినిమా పూర్తిగా చూశాడు.

సినిమా అయిపోయేక హోటల్ శృంగార్‌కు వెళ్ళాడు.

అప్పటికప్పుడో గది బుక్ చేసుకున్నాడు.

గదిలోంచి ఫోన్ చేశాడు-ఓ నంబర్‌కి:

"హలో!" అందవతలి గొంతు.

"హలో-నేను చంద్రాన్ని-నాయుడుగారేనా మాట్లాడుతూంట!"

"ఆఁ—వెళ్ళిన పనేమైంది?"

"పండు...."

"నిజంగా?"

"రేపు సాయంత్రం ఆరింటికి రుద్రాక్షమాల మీకిస్తాను...."

"నాకు నమ్మశక్యం కావడంలేదా...."

"రేపు పూ ర్తిగా నమ్ముదురుగాని. సెలవు...."

చంద్రం ఫోన్ పెట్టేసి పడుకున్నాడు.

## 2

మర్నా డుదయం ఆరింటికి నాయుడు కార్లో బయల్దే రాడు. పావుగంటలో కారాయన్ను రామారావింటికి జేర్చింది.

హాల్లో ఎదురయ్యాడు రామారావు.

"కులాసానా?" అన్నాడు నాయుడు.

"కులాసాయే-కానీ-నిన్నొక తమాషా జరిగింది-" అన్నాడు రామారావు.

"ఏమిటది?"

"ఇన్నాళ్ళకి మీ వల్ల పొరపాటు జరిగింది-"

"నావల్ల పొరపాటా-అసాధ్యం...."

"జరిగింది వింటే మీరే ఒప్పుకుంటారు-" అంటూ రామారావు నాయుడికి చంద్రంతో జరిగిన అనుభవం వివరించాడు.

"అరే-మీరెలా బ్రతికారు...."

"అతడి బటన్‌నైఫ్ నిజమైన కత్తికాదు. పొడవగానే లోపలికిపోయి ఎర్రసిరాను వెదజిమ్మే నాటకాల మోడలు కత్తి. చివర అతడేదో మత్తుమందు ఉంచి వుండాలి. అతడు నన్ను పొడవగానే ఆ మందు నాకు స్పృహతప్పించింది...."

"తర్వాత?"

"గదిలోకి ఆ అమ్మాయి ప్రవేశించి వుంటుంది. రక్తం చూసి స్పృహ తప్పినట్లు నటించి వుంటుంది. అనుకున్న ప్రకారం అక్కడ మూడుగంటలుండి తను వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన అరగంటవరకూ నన్నెవ్వరూ

పలకరించరు. ఆ అరగంటలో సరిగ్గా నాకు మెలకువ వచ్చింది. బయట వాళ్ళెవ్వరికీ ఏ అనుమానమూ కలగని విధంగా నా రుద్రాక్షమాల అపహరించబడింది. నేను బ్రతికుండడమే ఒక అద్భుతం. ఆ చంద్రాన్ని నే నభినందిస్తున్నాను."

"మాల పోయిందని మీకు బాధగా లేదా?"

"బాధ ఎందుకు? ప్రాణాలు పోతే ఆ మాల నన్ను రక్షించలేదుగదా!" అన్నాడు రామారావు.

"అంటే పదిలక్షల మాల పోయిందని మీకు బాధగా లేదన్నమాట!" అన్నాడు నాయుడు ఆశ్చర్యంగా.

"అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం. ముందు మీరు మీ మనిషి గురించి సంజాయిషీ యిచ్చుకోవాలి-"

నాయుడి ముఖం గంభీరంగా అయిపోయింది-"రామారావుగారూ-మీరు మీ తప్పుకు నన్ను తప్పుపడుతున్నారు-" అన్నాడు.

"తప్పు మీదా నాదా?" అన్నాడు రామారావు.

"మా యింటి కెవరూ వచ్చి ఆ విధంగా దోచుకుని వెళ్ళిపోలేరు——...." అన్నాడు నాయుడు.

"మా ఇంటి విషయమూ యింతే!"

"నేను చెప్పే దీ యిల్లు గురించి కాదు. మీ ఏకాంత గృహం గురించి" అన్నాడు నాయుడు.

"నేనూ ఏకాంతగృహం గురించే చెబుతున్నాను. అక్కడ నాకే ప్రమాదమూలేదు. నా ప్రమాదం మిమ్మల్ని నమ్మడంవల్ల ఏర్పడింది-"

"రామారావుగారూ-మన దారులు మంచివికావు. అలాంటప్పుడు అనుమానం కూడా మన జీవితంలో ఒక భాగమై ఉండాలి. మీరు మీ ఏకాంతగృహాన్ని నమ్ముకోవడంవల్ల

మిమ్మల్ని నమ్ముకున్న నాక్కూడా ప్రమాదముంది. ఇది ఋజువు చేసి హెచ్చరించాలనే నేనీ పథకం వేశాను-" అన్నాడు నాయుడు

"అంటే?" అన్నాడు రామారావు ఆశ్చర్యంగా.

"చంద్రానికి మిమ్మల్ని మోసగించడానికి నేనే అనుమతి నిచ్చాను. మీకోసం పంపిన యువతి నతడికి సహకరించమన్నాను-"

రామారావు తెల్లబోయి — "అయితే రుద్రాక్ష మాల....!" అన్నాడు.

"కంగారుపడకండి-సాయంత్రానికది క్షేమంగా మీకు చేరుతుంది-"

"ఎందుకింత పని చేశారు?"

"రెండు ప్రయోజనాల నాశించి...."

"ఏమిటవి?"

"ఒకటి....ఏకాంత గృహం విషయంలో మీ అజాగ్రత్తను హెచ్చరించడం-రెండు చంద్రాన్ని ఓ ముఖ్యమైన పనికి తీసుకునేందుకు పరీక్షించడం...." అన్నాడు నాయుడు.

"మీరు చాలా పెద్ద రిస్కు తీసుకున్నారు. చంద్రం మిమ్మల్ని మోసం చేస్తే ..."

"చెయ్యడు-చెయ్యలేదు...."

"అయ్యో! అంత నమ్మకమేమిటి మీకు? పదిలక్షలు విలువచేసే వజ్రాలు...." అన్నాడు కంగారుగా రామారావు.

"ఇప్పుడు మీకు మాల గురించి ఆసక్తి పుట్టుకొచ్చినట్లుంది!"

"నేను హంతకుడి బారినుంచి తప్పించుకున్నానని

తెలిసినప్పుడు మాల విలువైనదనిపించలేదు నాకు-కానీ అదంతా మోసమని తెలియగానే నా మాల నాకు విలువైన దనిపిస్తోంది-" అన్నాడు రామారావు.

"మీరు చంద్రానికి మాల గురించి చెప్పకుండా ఉండా ల్సింది...."

"నేను చెప్పలేదు. అదతడికే తెలుసు. సరైన అవ కాశం దొరికితే-తను మెడలోని రుద్రాక్షమాలను సంగ్ర హించి తన సామర్థ్యాన్ని నిరూపించుకోగల నన్నాడు చంద్రం. నేనా అవకాశ మిచ్చాను. మీ రోడి పోయారు...."

"ముందు నేను మళ్ళీ ఆ రుద్రాక్షమాలను చూడాలి. అంతవరకూ నాకు స్థిమితముండదు-" అన్నాడు రామా రావు కంగారుగా.

"ఆ మాల మీ చేతుల్లో ఉంచే బాధ్యత నాది:"అన్నాడు నాయుడు.

## 3

సాయంత్రం ఆరయింది.

నాయుడింట్లో నాయుడు, రామారావు కూర్చుని వున్నారు.

రామారావు దృష్టంతా టైంమీదే ఉంది.

నాయుడు మాత్రం-మనిషికి హాని కలిగించకుండా-తెలి విగా పదిలక్షలు విలువచేసే వజ్రాలను హరించుకుపోయిన చంద్రం సామర్థ్యానికి తెగ ముచ్చటపడిపోతున్నాడు.

ఆయన ముచ్చట రామారావుకు విసుగును కలిగిస్తోంది.

"టైము ఆరుం పావయిందీ—" అన్నాడు రామా రావు.

"కంగారుపడకండి-అతడు తప్పక వస్తాడు-" అన్నాడు నాయుడు నమ్మకంగా.

"మనకు సమయం విలువైనది. ఆరంటే ఆరుంపావుకి కూడా రావడానికి సమయం విలువ తెలిసినట్లు కాదు" అన్నాడు రామారావు.

ఆరుంపావుకాదు-టయిము ఏడు....ఏడున్నరఅయింది.

చంద్రం రాలేదు.

"పది లక్షలు....పోయాయి...." అన్నాడు నాయుడు చిరాగ్గా.

టైము ఎనిమిదిన్నరయ్యాక రామారావు లేచి "నాకు పాఠం చెబుదామనుకుని మీరు పాఠం నేర్చుకున్నారు. ఈ రోజుకు సెలవు...." అన్నాడు.

నాయుడు రామారావును గుమ్మందాకా సాగనంపాడు.

సరిగ్గా అప్పుడే ఇంటి ముందు జీపొకటి ఆగింది. అందులోంచి పోలీసినస్పెక్టర్ చంద్రశేఖర్ దిగి వారిని సమీపించి - "అరే ఇద్దరూ ఇక్కడే ఉన్నారా?" అన్నాడు.

"వాట్ మిస్టర్ చంద్రశేఖర్...." అన్నాడు నాయుడు.

"యూ బోత్ ఆర్ అండరరెస్ట్' అన్నాడు చంద్రశేఖర్.

నాయుడు, రామారావు ఇద్దరూ తెల్లబోయారు.

"అయాం నాట్ జోకింగ్...." అన్నాడు చంద్రశేఖర్.

"కారణం తెలుసుకోవచ్చా?" అన్నాడు రామారావు.

"స్మగ్లింగ్...."

"అందుకు సాక్ష్యం?...."

"మా ఏజంటు మీమీద నిఘావేసి తిరుగులేని సాక్ష్యాలు

సంపాదించాడు....'' అన్నాడు చంద్రశేఖర్.

''ఎవరా ఏజంటు?'' అన్నాడు నాయుడు.

''ఏజంటును మీకు చూపేదిలేదు. సాక్ష్యాలు చూపిస్తాను....'' అన్నాడు చంద్రశేఖర్.

నాయుడు, రామారావు పోలీసు జీపెక్కారు. పది నిముషాల్లో జీపు పోలీస్ స్టేషన్ చేరుకుంది.

అక్కడ రామారావు, నాయుడు తమ గురించి చూడకూడని ఫోటోగ్రాఫ్‌లు చూశారు. ఇద్దరూ కూడా వంచిన తలె లెత్తలేకపోయారు.

రామారావు నాయుడి చెవిలో - ''నా అనుమానమంతా చంద్రం మీద ఉంది'' అన్నాడు.

''నా అనుమానమూ అదే!'' అన్నాడు నాయుడు.

''మీరు గొప్పవారు. కానీ ఈ రాత్రికి లాకప్‌లో ఉండక తప్పదు'' అన్నాడు చంద్రశేఖర్ వినయంగా.

''తర్వాత వదిలేస్తారా?'' అన్నాడు రామారావు.

''బెయిల్ మీద వదలగలం. ముందు మీ నుంచి వాఙ్మూలాలు తీసుకోవాలి'' అన్నాడు చంద్రశేఖర్.

రామారావు, నాయుడు - ఇద్దరూ లాకప్ రూంలోకి వెళ్ళారు.

అక్కడ వారికి మరో వ్యక్తి తటస్థపడ్డాడు.

అతడు చంద్రం!

''నువ్వికక్కడున్నావా?'' అన్నాడు రామారావు.

అప్పుడు చంద్రం అసలు వేషంలోనే వున్నాడు.

''నమ్మకద్రోహి!'' అన్నాడు నాయుడు.

''నాయుడుగారూ! మీ నీడలో నేను అయిదేళ్ళ శిక్షణలో అద్భుతమైన సామర్థ్యాన్ని సంపాదించాను. నా కదలికలు చార్లెస్ శోభరాజ్‌ని మించినవి. కానీ పెద్ద పొర

పాటు చేశాను. నమ్మకద్రోహం చేయలేదు...."

"నీ మాటలు నేను నమ్మను" అన్నాడు నాయుడు.

"నన్ను నేనే నమ్మలేకపోతున్నాను. ఇలా జరుగుతుందని నే నెప్పుడూ అనుకోలేదు" అన్నాడు చంద్రం.

నాయుడు కోపంగా ఉన్నాడు.

రామారావు శాంతాన్ని ప్రదర్శిస్తూ - "అసలేం జరిగిందో చెప్పు వింటాను" అన్నాడు.

"సమాజం ఆమోదించని పనులు చేసేవాడెంతటి సమర్ధుడయినా, ఎన్ని తెలివితేటలు కలిగి ఉన్నా అతడి వల్ల తప్పటడుగు ఏర్పడక తప్పదు. అందుకే సమర్థత గల మనిషి నీతిగా జీవించడానికి ప్రయత్నించాలి. అప్పుడే అతడికి సుఖంగా ఉంటుంది."

"ఇంట్రడక్షన్ చాలు - ఏం జరిగిందో చెప్పి ఏడు" అన్నాడు నాయుడు.

"నా పథకం తెలివిగా, సులువుగా అమలు జరపడానికి నేను బాగా శోధించి ఒక బిచ్చగాడి నెన్నుకున్నాను. నిజానికదెంతో గొప్ప అయిడియా. అయితే నా దురదృష్టంకొద్దీ ఆ బిచ్చగాడు సీ.బీ.ఐ ఏజంటు. ఈ ఊళ్ళో కొందరు పెద్దమనుషుల బండారం బయటపెట్టడానికి ఒక టిన్నర సంవత్సరంగా ఆ వేషంలో తిరుగుతున్నాడు. నేను తనని పట్టగానే వాడు నా చుట్టు మనుషుల్ని పెట్టి తద్వారా నాయుడుగారివీ - ఆవిధంగా రామారావుగారివీ రహస్యాలు లాగించాడు. నేననుసరించబడే అవకాశమున్నదనే నాకు తెలియదు. చూస్తూ చూస్తూ రుద్రాక్ష మాల వాడి చేతిలో పెట్టి ఈవేళ తెచ్చుకుందుకు వెళ్ళి పోలీసుల పాలయ్యాను...." అన్నాడు చంద్రం.

రామారావుకూ, నాయుడుకూ నోట మాట రాలేదు. □

# మిష్టర్ ఎక్స్

ప్రతాప రవిశంకర్

దుస్తులు · మార్చుకుంటున్నప్పుడు కాలింగ్ బెల్ చప్పుడయ్యింది. ఎవరై వుంటారని డాక్టర్ గిరిజ ఆలోచించలేదు. ఎందుకంటే కొంతమంది పేషంట్లు ఇంటికి కూడా వస్తుంటారు కాబట్టి.

ఆమె ఆ గదిలోనించి బయటకు వెళ్ళేలోపల ఇంకో రెండుసార్లు ఆ బెల్లు చప్పుడు చేస్తూనే వుంది.

మొహం మీదకు పడిన వెంట్రుకలను వెనక్కు నెట్టుకుంటూ తలుపు తెరిచింది ఆమె.

ఎదురుగా నవ్వుతూ నిలబడిన ఆ మనిషిని గిరిజ ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదు. కాని అతడు మాత్రం బాగా పరిచయం వున్నవాడిలా "నమస్తే డాక్టర్. బావున్నారా...." అనడిగాడు చిరునవ్వుతోనే.

"రండి" అన్నదామె లోపలకు నడుస్తూ.

ఆమె వెనుకే అతడూ లోపలకు వచ్చి బల్లకు ఎదురుగా వున్న గాద్రెజ్ కుర్చీలో కూర్చున్నాడు.

పేషంట్ కాదు అతను. జబ్బు పడిన లక్షణాలు అతని మొహంలో ఆమెకు కనపడలేదు.

"ఎవరు మీరు?" అడిగింది గిరిజ అతడ్ని పరిశీలనగా చూసి....

అతడు నవ్వి "మిస్టర్ ఎక్స్ అనుకుంటారా?" అన్నాడు.

అతడి మాటలు గిరిజకు ఆశ్చర్యంగా అనిపించాయి. ఎందుకంటే గౌరవప్రదమయిన ఒక వృత్తిలో వున్న మనిషితో ఏమాత్రం పరిచయంలేని మనిషి అంత నిర్లక్ష్యంగా, జోక్‌గా మాట్లాడడు.

మళ్ళీ అతనే అన్నాడు "అవును. ప్రస్తుతానికి నా పేరు మిస్టర్ ఎక్స్."

"జోక్ చెయ్యటానికి వచ్చారా?" చాలా మామూలుగా అడిగింది గిరిజ. అతను ఎటువంటి మనిషో తెలియలేదు. ప్రస్తుతానికి అతని మానసిక స్థితి బాగా వుండక పోవచ్చును.

"నో జోక్స్ డాక్టర్. ఇప్పుడు నేను నా పేరు వివరాలు చెప్పలేను."

"అయితే నన్నెందుకు కలుసుకున్నారు మిస్టర్ ఎక్స్?"

"నా పేరును వెంటనే గుర్తు పెట్టుకున్నందుకు థాంక్స్ .... మిమ్మల్నొక సహాయం అర్థించటానికి వచ్చాను" అన్నాడతను.

"ఏమిటా సహాయం?" కుతూహలంగా అడిగింది గిరిజ.

"నేను కోరిన విధంగా మీరొక పోస్టుమార్టం రిపోర్టు ఇవ్వాలి" నవ్వుతూ అన్నాడతడు.

ఈసారి నిజంగానే ఆశ్చర్యపడింది ఆమె. అతను జోక్ చెయ్యటం లేదని, సీరియస్‌గానే మాట్లాడుతున్నాడనీ అనుకుంది....

"పోస్టుమార్టమ్ రిపోర్టా? ఎవరి రిపోర్టు? ఈ రోజు పోస్టుమార్టం చెయ్యటానికి ఒక్క శవం కూడా రాలేదు కదా!" అన్నదామె బల్లమీద చేతులుంచుతూ ముందుకు వంగి....

"అవును. నిజమే....ఈ రోజు ఒక్క శవం కూడా పోస్టుమార్టమ్ కోసం మీ దగ్గరకు రాలేదు. కాని నేను కోరిన విధంగా పోస్టుమార్టమ్ రిపోర్టును ఇవ్వటానికి ఒప్పుకుంటే కొన్ని గంటల్లోనే శవం మీ దగ్గిరకు వస్తుంది" అన్నాడు మిస్టర్ ఎక్స్.

"ఏమిటి మీరనేది?" కళ్ళు పెద్దవి చేసి అడిగింది గిరిజ.

"ఆల్ రైట్ ....మిమ్మల్ని కన్‌ఫ్యూజ్ చెయ్యటం నాకిష్టంలేదు. క్లియర్‌గా చెబుతాను. నేనొక మనిషిని హత్య

చెయ్యదల్చుకున్నాను. ఆ మనిషి హత్య చెయ్యబడితే వెంటనే ఆ అనుమానం నా మీదకు వస్తుంది. అందుకు కొన్ని కారణాలు వున్నాయి. ఐతే ఆ హత్య జరిగిన సమయానికి నాకు బలమైన ఎలిబీ వుంటే ఆ నేరంనించి నేను బయటపడతాను. పోలీసుస్టేషన్‌లో వుండటాన్ని మించిన పటిష్టమైన ఎలిబీ ఇంకోటి వుండదనుకుంటాను. అర్థమవుతోందా డాక్టర్?" అడిగా డతను ఆమె కళ్ళల్లోకి చూసి....

ఆమె మాట్లాడలేకపోయింది వెంటనే. తన ఎదురుగా కూర్చున్న మనిషి ధైర్యాన్ని గురించి ఆలోచిస్తోంది గిరిజ. ఎంతోమంది క్రిమినల్స్ గురించి ఆమె పుస్తకాల్లో చదివింది. కాని అటువంటి అనుభవం తనకే ఎదురవుతుందని ఆమె ఎప్పుడూ అనుకోలేదు.

ఇప్పుడు ఆ పరిస్థితిని ఎదుర్కొంటోంది.

మళ్ళీ మొదలుపెట్టాడు అతను—

"ఆ మనిషిని హత్యచేసిన తర్వాత ఏదో ఒక చిన్న అల్లరి సృష్టించి కొన్ని గంటల్లోనే నేను పోలీసుల కష్టడీలోకి వస్తాను. పోస్టుమార్టం కోసం ఆ శవం మీదగ్గరకు వస్తుంది. అప్పుడే మీరు నేను కోరిన సహాయం చెయ్యవలసి వుంటుంది. నేను పోలీసుస్టేషన్లో వున్న సమయంలో ఆ హత్య జరిగినట్టుగా మీరు పోస్టుమార్టం రిపోర్టులో రాయాలి. అంతే నేను మిమ్మల్ని కోరేది."

ముగించాడు మిస్టర్ ఎక్స్. పలుచగా వున్న అతడి పెదవులు నవ్వుతున్నాయి.

గిరిజకు భయమేసింది.

"ఈ సహాయం చెయ్యటానికి మీరు ఒప్పుకోరనుకుం

టాను'' అన్నాడు అతనే....

"అవును'' అన్నదామె చిన్నగా—భయం నించి తేరు కుంటూ....ఇటువంటి సమయంలో తను భయపడితే ఆ మనిషి మరింత భయపెట్టి తనని లొంగదీసుకుంటాడని గిరిజకు అనిపించింది.

"నిజమే....మీరే కాదు....ఫాల్సు పోస్టుమార్టమ్ రిపోర్టు ఇవ్వటానికి ఎక్కువమంది డాక్టర్లు ఒప్పుకోక పోవచ్చు. హత్య జరిగిన తర్వాత ఐతే కొంతవరకు ఫర్వా లేదు కాని తన అంగీకారం కారణంగా ఒక మనిషి హత్య చెయ్యబడతాడని ముందుగానే తెలిసినప్పుడు ఎవ్వరూ ఒప్పుకోరు. మీరు కూడా ఒప్పుకోరని నాకు తెలుసు. ఐనా వచ్చాను. ఎందుకంటారు....?'' అన్నాడు నవ్వ కుండా.

"నాకు తెలీదు'' అన్నది గిరిజ.

"ఎందుకంటే ఆ మనిషిని హత్య చెయ్యక తప్పదు కాబట్టి. మిమ్మల్ని ఎలాగైనా ఒప్పించగలననే ధైర్యం వుంది. ఇప్పుడు చెప్పండి డాక్టర్... మీరు ఏ షరతుల మీద నాకు సహాయం చెయ్యటానికి ఒప్పుకుంటారు?'' మిస్టర్ ఎక్స్ సీరియస్‌గా అడిగాడు.

ఆమె మాట్లాడలేదు. ఆలోచిస్తోంది. తప్పదు తన ఎదురుగా కూర్చున్న మనిషి సాధారణమైన వ్యక్తి కాదు! ఒక మనిషిని హత్య చెయ్యటానికి పటిష్టమైన పథకం ఆలోచించాడు. ఇటువంటి క్రిమినల్‌ని వదిలిపెట్టకూడదు. వెంటనే పోలీసులకు ఫోన్ చెయ్యాలి.

"చెప్పండి....ఒప్పుకుంటే మీకు లాభం....ఏమైనా మీరు అంగీకరించక తప్పదు డాక్టర్'' బల్లమీద చేత్తో రాస్తూ అన్నాడు మిస్టర్ ఎక్స్.

గదిలో వెలుగుతున్న ట్యూబులైటు వెలుతురులో ఒకసారి అతడి మొహాన్ని చూసి కుర్చీలోనుంచి లేచి నిలబడింది గిరిజ.

అతడ్ని దాటి టెలిఫోన్ వున్న గదిలోకి వెళుతూ ఆగి ఒకసారి వెనక్కు చూసి ఇలా అన్నది ఆమె "కూర్చోండి....ఇప్పుడే వస్తాను....గేస్ ఆఫ్ చెయ్యటం మరచిపోయాను."

అతడు తలవూపి నవ్వాడు.

ఆమె వెళ్ళిపోయింది. రెండునిముషాల తర్వాత విసుగ్గా బయటకు వచ్చింది.

కుర్చీలో అతను లేడు. వెళ్ళిపోయి వుండాలి వెంటనే....

ఫోన్ ఎందుకు పలకటంలేదో ఆమెకు అప్పుడర్థమయ్యింది. బయటకు వచ్చి చూసింది.

నిజమే. టెలిఫోన్ స్థంభానికి కనెక్టు చెయ్యబడిన తీగె తెగిపోయి గోడమీదుగా వ్రేలాడుతోంది.

అక్కడే నిలబడి ఆ రోడ్డు చివరికల్లా మిస్టర్ ఎక్స్ కోసం చూసింది ఆమె.

కాని—అతడు కనపడలేదు.

## 2

కొంచెం సేపటివరకూ డాక్టర్ గిరిజ బయట గేటుదగ్గిరే నిలబడి వుంది. ఏం చెయ్యటానికీ వెంటనే ఆమె నిర్ణయించుకోలేక పోయింది.

దగ్గిర్లోవున్న ఎవరింటికైనా వెళ్ళి పోలీసులకు ఫోన్ చెయ్యవచ్చు. కాని అందువల్ల ఉపయోగం వుండదని ఆమెకు వెంటనే అర్థమయిపోయింది.

మిస్టర్ ఎక్స్ అతని అసలుపేరు కాదు. అతను ఎవర్ని

హత్యచెయ్య దల్చుకున్నాడో సూచనగా కూడా చెప్పలేదు. అటువంటప్పుడు తను పోలీసులకు ఎక్స్ గురించి తెలియ జేసినా ప్రయోజనం లేదు.

ఆమె అలా ఆలోచిస్తున్నప్పుడే ఇంట్లో గోడ గడియారం తొమ్మిదిగంటలు కొట్టింది. ఉలిక్కిపడింది ఆమె. తొమ్మిదిగంటలకు పది నిముషాలు ముందుగానే ఆమె కూతురు రూప ట్యూషన్‌నుండి ఇంటికి వస్తుంది. రూపకు పదకొండేళ్ళు. సెవెంత్ చదువుతోంది.

అప్పుడు గుర్తుకువచ్చిందె గిరిజకు కూతురు గురించి. మిస్టర్ ఎక్స్ గురించి ఆలోచిస్తూ రూప గురించి మరచి పోయింది.

కూతురు కోసం ఆమె ఇంకొంచెం సేపు అక్కడే నిలబడింది. ఆ రోడ్డులో అట్టే సందడిలేదు.

దూరంగా సందు చివర స్ట్రీటులైటు వెలుగుతోంది.

చలిగావుంది.

ఆమెకు అప్పుడు భయం కలిగింది.

మిస్టర్ఎక్స్ తన అంగీకారం తెలుసుకోకుండానే ఎందుకు వెళ్ళిపోయాడు? తను పోలీసులకు ఫోన్ చెయ్యటానికి వెళుతున్నట్టు అతను తెలుసుకుని వుంటాడు తను ఎలాంటి ప్రయత్నం చేస్తుందో అతను ముందుగానే వూహించి వుండాలి. అందుకే ఇంట్లోకి వస్తూనే టెలిఫోన్ తీగను కట్‌చేశాడు.

తను అబద్ధం చెప్పినట్టు కూడా అతనికి తెలిసిపోయి వుంటుంది. ఎందుకంటే గేస్ ఆఫ్ చెయ్యకుండా వుంటే ఇల్లంతా ఆ వాసనతో నిండిపోయివుండేది.

అంటే—తన నిర్ణయం మిస్టర్ ఎక్స్‌కి తెలిసిపోయి వుంటుంది. అందుకే వెళ్ళిపోయాడు.

కాని—అంత సులభంగా అతను తనని వదిలి పెడతాడా?

భయమేసింది గిరిజకు.

అవును. అతను మళ్ళీ తిరిగి ఎప్పుడో తనని కలుసుకుంటాడు.

ఆమెకు శరీరం వణికింది. ఆమె భర్త అక్కడకు రెండువందల కిలోమీటర్ల దూరంలో వున్న ఓ పట్టణంలో డాక్టరుగా ప్రాక్టీసు చేస్తున్నాడు. ఆ ఇంట్లో గిరిజ - కూతురుతో వుంటోంది. ఇంకొన్ని రోజుల్లోనే అక్కడి నుండి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని భర్త దగ్గరకు వెళ్ళబోతున్నది ఆమె—

పది నిముషాలు అక్కడే నిలబడినా రూప రాలేదు. ఒక్కోసారి ఏ స్నేహితురాలి ఇంటికయినా వెళ్ళినప్పుడు కొంచెం ఆలస్యంగా తిరిగి వస్తుంది. అలాగని సరిపెట్టుకోలేక పోయింది గిరిజ.

మిస్టర్ ఎక్స్ వచ్చి వెళ్ళిపోయిన తర్వాత ఆమె ఇది వరకంత ధైర్యంగా వుండలేకపోయింది.

ట్యూషన్‌హోం అక్కడకు కొంచెం దూరంలో వుంది. ఇంటికి తాళంపెట్టి వెళ్ళాలనుకున్నది గిరిజ.

ఆమె వెనక్కి తిరగబోతున్నప్పుడు రోడ్డుకు ఒక వైపునుంచి వేగంగా ఒక మోటారు సైకిలు దూసుకుని వచ్చింది.

ఆగిపోయింది గిరిజ.

దానిమీద వున్న మనిషి గిరిజ ముందుకు రాగానే దేన్నో చేత్తో ఆమె ముందుకు విసిరి వేగంగా వెళ్ళిపోయాడు. నిముషంలో ఆ వీధిలోనించి మాయమైపోయాడు.

అప్పుడు చూసింది గిరిజ తన కాళ్ళదగ్గిర పడివున్న తెల్లరంగు కవర్ని. స్టేషనరీ షాపుల్లో ఎక్కడయినా చాలా సులభంగా దొరికే కవరు అది.

దాన్లోపల తడిమింది. మడతపెట్టిన కాయితం వుంది అందులో.

ఆమె చేతులు వణికాయి.

వేగంగా లోపలకు వచ్చి దీపం వెలుతుర్లో ఆ ఉత్తరాన్ని ఇలా చదువుకున్నది.

"డియర్ లేడీ డాక్టర్—

నా గురించి పోలీసులకు తెలియజేయాలనుకున్నారు మీరలాంటి ప్రయత్నం చేస్తారని నాకు ముందుగానే తెలుసు. కాని మీకు ఒక విషయం తెలీదు. నేను కోరుకున్న విధంగా జరగటానికి నేను ఏ పనైనా చేస్తాను. హత్య చెయ్యటానికే సిద్ధపడిన మనిషికి కిడ్నాప్ చెయ్యటం కష్టంకాదు. అందుకే ట్యూషన్‌నుంచి తిరిగి వస్తున్న మీ కూతురు రూపను నాతో తీసుకువచ్చాను.

రేపు ఉదయం పదిగంటల లోపల మీ టెలిఫోన్ పలికేట్టుగా చేసుకోండి....ఆ తర్వాత ఏదో ఒక సమయంలో ఎక్కడినించో మీతో టెలిఫోన్‌లో మాట్లాడతాను. అప్పుడు మీరు నాకు సహాయం చెయ్యటానికి ఒప్పుకుంటున్నదీ, లేనిదీ తెలియజేయండి చాలు.

పోలీసుల సహాయం కోరితే ఏం జరుగుతుందో మీకు తెలుసనుకుంటాను. ఒక హంతకుడు కాబోయే మనిషితో తలపడే ధైర్యం మీకు లేదనుకుంటాను...."

అంతే—కింద సంతకంలేదు. లేకపోయినా తెలుస్తూనే వుంది ఆ ఉత్తరాన్ని మిస్టర్ ఎక్స్‌గా వచ్చిన మనిషే

రాశాడని. బహుశ అతను ఆ ఉత్తరాన్ని చెయ్యి మార్చి రాసివుండాలి. అందుకే అక్షరాలు వరుసలో లేకుండా ఎగుడు దిగుడుగా వున్నాయి

జాగ్రత్తపడుతున్నాడనుకుంది గిరిజ.

ఆమెకు దుఃఖం కలిగింది. ఏడ్చినా ప్రయోజనంలేదని తెలుసు. నిజం....పోలీసులకు ఫోన్ చేసినా వాళ్ళు రూపను తెలుసుకుంటారనే నమ్మకంలేదు. అలాంటి ప్రయత్నం చేస్తే మిస్టర్ ఎక్స్ ముందుగా తన కూతుర్నే హత్య చెయ్యవచ్చు. పసిపిల్లను కూడా చంపటానికి వెనుకాడే మనిషిలాగా లేదు.

ఈ పరిస్థితులో ఆయన వుంటే బావుండేది—అను కుంది గిరిజ. మెదడులో ఆలోచనలే కాకుండా ఒంటరి తనం కూడా ఆమెను భయపెట్టింది. మిస్టర్ ఎక్స్మీద కోపం—అసహ్యం ఏర్పడ్డాయి.

ఐనా తనేం చెయ్యగలదు.

తెల్లవారే వరకూ కాచుకుని వుండాలి. తప్పదు అను కుంది గిరిజ.

## 3

ఆమె ఫోన్ దగ్గిరే కూర్చుని వుంది. రాత్రంతా నిద్ర పోలేదు. తన నిర్ణయం మీదనే తన కూతురు రూప భవి ష్యత్తు ఆధారపడివుందని ఆమెకు తెలుసు.

మిస్టర్ ఎక్స్కు సహాయం చెయ్యటానికే డాక్టరు గిరిజ నిర్ణయించుకున్నది. అందుకే ఆమె అతడి గురించి పోలీసు లకు తెలియపరచలేదు.

టెలిఫోన్ డిపార్టుమెంటువాళ్ళు ఉదయం పదిగంటలకు వచ్చి తెగిపోయిన తీగలను కనెక్టు చేసి వెళ్ళారు.

మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటిన పది నిము షాలకు ఫోన్ మోగింది. వెంటనే రిసీవర్ ఎత్తింది ఆమె.

"ఎవరు?"

గుర్తుపట్టింది గిరిజ. అది మిస్టర్ ఎక్స్ గొంతు.

"గిరిజను మాట్లాడుతున్నాను" అన్నదామె హీనమైన గొంతుతో.

"గుడ్....మీరు ఫోన్‌దగ్గిరే కాచుకుని వుంటారని నాకు తెలుసు. పోలీసులను కలుసుకోనందుకు థాంక్స్." అన్నాడు మిస్టర్ ఎక్స్....

"ఇంతకీ రూప ఎలా వుంది? క్షేమంగా వుందా?" ఆత్రంగా అడిగింది ఆమె.

"మీ ఇంట్లో వున్నంత క్షేమంగా వుంది. చెప్పాను కదా నేను. కేవలం నా పని జరగటానికే మీ అమ్మాయిని తీసు కెళ్ళాను. ఇకముందు రూప క్షేమం మీ నిర్ణయంమీద ఆధారపడి వుంటుంది. ఇప్పుడు చెప్పండి ఏం నిర్ణయించు కున్నారు? ఒప్పుకున్నట్టేనా?"

"నిజానికి నాకు ఇష్టంలేదు. కాని నాకు నా కూతురు క్షేమం కావాలి. అందుకే ఒప్పుకుంటున్నాను. మీరు చెప్పి నట్టుగానే పోస్టుమార్టమ్ రిపోర్టు ఇస్తాను."

"గుడ్. మీరు మంచి నిర్ణయం తీసుకున్నారు. ఇంకో గంటలో రూపను వదిలేస్తాను. రూప తిరిగివచ్చిన తర్వాత మీ నిర్ణయం మార్చుకోరనుకుంటాను. అలా జరిగితే ఈసారి నేను మీతో బేరం పెట్టను. రూప శవం మీఇంటికి సీలు చేసిన పెట్టెలో తిరిగి వస్తుంది. నేను తెగించిన మనిషిని....ఆల్‌రైట్....ఇక నా ప్రయత్నంలో నేను వుంటాను. హత్య జరిగిన తర్వాత పోలీసు కస్టడీలోకి

వెళ్ళటానికి ముందు మళ్ళీ మీకు ఫోన్‌చేసి మాట్లాడతాను. మీ అమ్మాయికోసం ఎదురుచూస్తూ కూర్చోండి. థాంక్ యూ ఎగెయిన్'' అని ఫోన్ పెట్టేశాడు మిస్టర్ ఎక్స్.

ఒక గంటసేపు డాక్టరు గిరిజ చాలా అసహనంగా గడిపింది. మిస్టర్ ఎక్స్ చెప్పినట్టుగా ఆమె కూతురు రూప సరిగ్గా గంట తర్వాత గేటు నెట్టుకుని ఇంట్లోకి వచ్చింది.

తర్వాత పది నిముషాలకు గిరిజ టెలిఫోన్ తీసి ఒక ట్రంకాల్ బుక్‌చేసింది.

మిస్టర్ ఎక్స్ చాలా మంచివాడని చెప్పింది రూప తల్లితో.

* * *

పూర్తిగా తెల్లవారలేదు. అప్పుడే టెలిఫోన్ మోగింది. బద్ధకంగా లేవలేదు గిరిజ. చురుగ్గా వెళ్ళి రిసీవర్ ఎత్తింది.

''డాక్టరు గిరిజేనా?'' అడిగాడు మిస్టర్ ఎక్స్....అతడి గొంతు మామూలుగానే వుంది.

''అవును''

''అంతా అనుకున్నట్టుగానే జరిగిపోయింది. ఇంకో గంటలో నేను పోలీసు కస్టడీలో వుంటాను. అటువంటి యేర్పాటు నేను ముందుగానే చేసుకున్నాను. ఇప్పుడు టైమెంతయ్యిందో నోట్ చేసుకోండి. హత్యా సమయాన్ని ఒక గంటా ఇరవై నిముషాల వెనక్కి లాక్కుని రండి.''

''అలాగే'' అన్నది ఆమె చిన్నగా ఏదో ఆలోచిస్తూ.

ఫోన్ పెట్టెయ్యటానికి ముందు మిస్టర్ ఎక్స్ ఇలా అన్నాడు ''నా మనుషులు మిమ్మల్ని కనిపెడుతూ వుంటారని మరచిపోవద్దు. నేను తెగించిన మనిషిని''

## 4

"నా పేరు శివరామ్" అన్నాడతను. అతడ్ని పోలీసు కస్టడీలో వున్న మిస్టర్ ఎక్స్ ఆశ్చర్యంగా చూశాడు.

లావుగా, పొడుగ్గా వున్నాడతను. ఒత్తుగా పెరిగివుంది అతడి గడ్డం. మీసాలు కిందికి జారివున్నాయి. నెత్తిమీద నల్లటి టోపీవుంది. పొట్టిచేతుల షర్టును నల్లటి ప్యాంటులోకి దోపుకున్నాడు.

చూయింగ్‌గమ్ నములుతూ "నిన్ను బ్లాక్‌మెయిల్ చెయ్యటానికి వచ్చాను" అన్నాడతను చిన్నగా అతడికే వినపడేట్టుగా—

మిస్టర్ ఎక్స్ "బ్లాక్‌మెయిలా!" అన్నాడు నమ్మలేనట్టు....

"అవును. వీరభద్రరావును నువ్వు హత్య చెయ్యటం నాకు తెలుసు. పోస్టుమార్టమ్ రిపోర్టు గురించి డాక్టరు గిరిజను బెదిరించటం కూడా నాకు తెలుసు. రెండు రోజులుగా నిన్ను నీడలాగా వెంటాడుతున్నాను" అన్నాడు శివరామ్.

"నిజమేనా?" అన్నాడు మిస్టర్ ఎక్స్ కొంచెం భయంగా....

"అవును. డాక్టరును భయపెట్టావు. ఆమె నువ్వు కోరినట్టుగానే రిపోర్టు ఇస్తుంది. నువ్వు ఈ హత్యానేరం మీద పడకుండా తప్పుకుంటావు. కాని నేను నిన్ను నేను తప్పుకోనివ్వను"

"ఎవర్నువ్వు? నీకేం కావాలి?" అడిగాడు మిస్టర్ ఎక్స్.

"నీ రహస్యాలు బయటపడకుండా వుండాలంటే నువ్వు ఇరవై వేలు నాకివ్వాలి" అన్నాడు శివరామ్.

"చాలా ఎక్కువ" అన్నాడు మిస్టర్ ఎక్స్....

"నిజానికి చాలా తక్కువ. ఎక్కువ డిమాండు చెయ్యడం నా కిష్టంలేదు...."

"ఆల్ రైట్....ఒప్పుకుంటున్నాను. నేను బయటకు వచ్చిన తర్వాత నన్ను కలుసుకో" అన్నాడు మిస్టర్ ఎక్స్.

శివరామ్ జేబులోనించి చిన్న ప్యాకెట్టు బయటకు తీశాడు. అందులో చూయింగ్‌గమ్ తీసి నోట్లో వేసుకున్నాడు. ఇంకోటి తీసి మిస్టర్ ఎక్స్‌కు ఇస్తూ "నన్ను మోసం చెయ్యవుకదా" అనడిగాడు.

అతను దాన్నితీసుకుని నోట్లో వేసుకుని "లేదు. తప్పకుండా ఇస్తాను" అన్నాడు మిస్టర్ ఎక్స్.

"మళ్ళీ కలుస్తాను....బెస్టాఫ్‌లక్" అని అక్కడినించి బయటకు వెళ్ళిపోయాడు శివరామ్.

అతను వెళ్ళిన పదినిముషాలకు మిస్టర్ ఎక్స్ సెల్‌లో ఒక కార్నర్‌లో పడి చచ్చిపోయాడు.

డాక్టరు గిరిజ ట్రంక్‌కాల్ బుక్‌చేసి తన భర్తను పిలిపించిందని—అతనే మారువేషంలో శివరామ్‌గా తనని కలుసుకున్నాడనీ మిస్టర్ ఎక్స్ వూహించలేక పోయాడు. అంతేకాదు. అతను ముందుగానే యాంటీ పాయిజనస్ డ్రగ్ తీసుకున్నాడనీ విషపూరితమైన చూయింగ్‌గమ్‌ని తనకు ఇచ్చాడనీ కూడా మిస్టర్ ఎక్స్ అనుమానించలేదు.

మిస్టర్ ఎక్స్ హత్యలపరం ఒక్క పోస్టుమార్టం రిపోర్టుతో ఆగదని—అందుకే అతడ్ని తెలివిగా అంతం చెయ్యాలనీ డాక్టరు గిరిజ భర్త నిర్ణయం చేశాడు.

ఇంతకీ — డాక్టరు గిరిజ హతుడి పోస్టుమార్టం రిపోర్టును సరిగానే ఇచ్చింది. ఇప్పుడామెకు మిస్టర్ ఎక్స్ గురించి భయంలేదు కాబట్టి. □

# ఆశీస్సర్గ సమావేశం

జొన్నలగడ్డ రామలక్ష్మి

"ఏమండీ!" అని పిలిచింది శ్రీమతి గోముగా.

ఆమె అలా పిలిస్తే నాకెంతో యిష్టం.

అలాంటి పిలుపు వినే విశ్వామిత్రుడు తపస్సుకో నమస్కారం పెట్టి మేనక వెంట వెళ్ళిపోయుంటాడు.

"ఊఁ" అన్నాను.

"రేపు ఆఫీసుకు సెలవు పెట్టండీ!" అంది.

"ఎందుకు!" అన్నాను.

"సరదాగా గడుపుదాం" అంది.

"సరదాగా అంటే!" నాకు తెలియనట్లు తన చేతే చెప్పించాలని అన్నాను.

"ఏదో పండుగ చేసుకున్నట్లుగా!"

"నాలుగు రోజుల క్రితం మనం పెళ్ళిరోజు జరుపుకున్నాంగా—"

శ్రీమతి పెదవి విరిచింది-"దానికి నలుగుర్నీ పిలిచాం. వాళ్ళ గురించి ఏర్పాట్లు చేయడానికీ, వాళ్ళకు మర్యాదలు చేయడానికీ. వాళ్ళు వెళ్ళేక అన్నీ సర్దుకోడానికీ ఆ రోజు సరిపోయింది. మనకంటూ ఏమి మిగలలేదు."

"అయితే ఏమంటావు?"

"కేవలం మనిద్దరి కోసం ఒక రోజు సెలవు పెట్టండి."

నా తనువు పులకరించింది.

మా పెళ్ళయి రెండేళ్ళయింది. అయినా నాకు శ్రీమతి ఎంతో కొత్తగా అనిపిస్తుంది. జీవితమంతా రంగుల కల లాగే ఉంది. ఆమె తన గురించే ఆలోచించినట్లు కన పడినా - నిజానికి తను చేసే ప్రతీ పనీ నన్ను సంతోష పెట్టడానికే.

"కానీ నాలుగు రోజుల క్రితమే ఒక సెలవు పెట్టాను."

"అసలీవేళ సెలవు పెట్టమందామనుకున్నాను. కానీ మీ రాఫీసరుగదా - ఒక రోజు ముందుగా చెప్పాల్సుంటుందని...." ఆగింది శ్రీమతి.

"అది కాదు - ఒకేవారంలో రెండు సెలవులు...."

సీళ్ళు నమిలాను.

"మీ కింకా క్యాజువల్ లీవులు ఆరున్నాయి. ఈ ఏడాది పూర్తి కావడానికి నాలుగు నెలలే ఉంది" శ్రీమతి నా లీవు రికార్డేకరువు పెట్టింది.

"కానీ నేనీ ఊరొచ్చి ఇంకా ఆరువారాలు కాలేదు" అన్నాను.

"అయితే మాత్రం ఉద్యోగంలో ఎప్పుడు చేరినా సెంట్రల్ గవర్నమెంట్ వాళ్ళకి మొత్తం పన్నెండు క్యాజువల్ లీవులూ ఉంటాయటగా" అంది శ్రీమతి.

ఆఫీసు రూల్స్ నాకంటే బాగా శ్రీమతికే తెలుసు. మా ఆఫీసు కాకపోయినా మా పక్కింట్లో ఓ సీనియర్ సెంట్రల్ గవర్నమెంటు ఆఫీసరున్నాడు. ఆయన భార్య శ్రీమతిని శిష్యురాలిగా స్వీకరించి - సెంట్రల్ గవర్న మెంటు ఉద్యోగులకుండే సదుపాయాలన్నీ చెబుతూ వుంటుంది.

నేనుద్యోగంలో చేరి ఆరువారాలే అయింది. పెద్దలు సరదా పడ్డంవల్ల ఉద్యోగం లేకుండానే పెళ్ళి చేసుకు న్నాను. అయితే ఇలా పెళ్ళి కాగానే అలా ఉద్యోగం దొరకలేదు నాకు. శ్రీమతి బియ్యే చదువుతోంది. ఆమె పుట్టింట్లోనే ఉండి తన చదువు పూర్తి చేసుకునే సరికి నా ఉద్యోగం వచ్చింది.

నాకు ఆఫీస రుద్యోగం వచ్చినందు కందరూ శ్రీమతి గొప్పతనాన్నే పొగిడారు.

ఆరు వారాల నుంచే మేమిద్దరం స్వతంత్ర జీవనం గడుపుతున్నాం. అంతకు ముందు కలిసి గడపకపోలేదు. అయినా ఆర్థిక స్వాతంత్ర్యం లేదప్పుడు.

"ఉన్నాయనుకో - కానీ అంత వెంట వెంటనే బాగుం

దదు....'' అన్నాను. ఎందుకంటే ఆరు వారాల్లోనూ అప్పుడే నేను ఆరు క్యాజువల్ లీవ్స్ పెట్టాను. కొత్తగా సంసారం ప్రారంభించానని నా విషయంలో మా పై అధికారి కాస్త లిబరల్‌గానే ఉన్నాడు.

''నా కోసం'' అంది శ్రీమతి గోముగా.

''సరే!'' అన్నాను వెంటనే. ఆమె అలా గోముగా అడిగితే ఏమయినా చేయగలను మరి!

## 2

ఆఫీసుకు వెళ్ళగానే ముందు బాస్‌ని కలుసుకుని మర్నాటి సెలవు గురించి చెప్పాను.

బాస్ వెంటనే - ''రేపు కుదరదు, ఎల్లుండి తీసుకో'' అన్నాడు.

ఎల్లుండి శనివారం. ఎలాగూ సెలవే! ఆయనకా విషయం చెప్పకుండా ''రేపు కుదరదా సార్! ఇంట్లో చాలా గొడవవుతుందేమో!'' అన్నాను.

''రేపు ఆఫీసర్లందరికీ మీటింగు పెడుతున్నాను. అది చాలా ముఖ్యమైంది....'' అన్నాడు బాస్.

ఆఫీసర్ల మీటింగనగానే నాకు చాలా ఉత్సాహం వచ్చింది.

మా ఆఫీసులో మొత్తం మూడువందలమంది ఉద్యోగులు. అందులో ఇరవయి మంది ఆఫీసర్లు. వాళ్ళలో నేనొకణ్ణి. నే నుద్యోగంలో జేరేక ఆఫీసర్ల మీటింగింత వరకూ కాలేదు.

ఈ మీటింగులో నా ప్రాధాన్య తేమిటో తెలుసుకోవాలని - ''సార్! ఈ మీటింగుకు నేనుండి తీరాలా?'' అన్నాను.

''అయ్యో! ప్రతి ఆఫీసరూ ఉండితీరాలి. నువ్వుండ

నంటే ఎలా?'' అన్నాడు బాస్.

బాస్ దగ్గర సెలవు తీసుకున్నాను.

నా సెక్షన్‌లోకి వెళ్ళి చీఫ్ అసిస్టెంట్ శాంతయ్యగారిని పిలిచాను. ఆయన చాలా మంచివాడు. పరీక్షలు ప్యాసు కాలేక ఆఫీసరు కాలేకపోయాడు కానీ ఏ ఆఫీసరుకూ ఆయన లేనిదే గడవదు.

ఆయన వయసులో నాకంటె బాగా పెద్దవాడు. నేనాయన పెద్దరికాన్నీ, అనుభవాన్నీ గౌరవిస్తాను. ఆ కారణంగా ఆయన నన్నభిమానిస్తాడు. ఆయనతో నేనాఫీసర్లా కాక కొడుకులా ప్రవర్తిస్తాను. అదాయన అలుసుగా తీసుకోడు.

''రేపు చాలా అర్జంటు పనుంది. సెలవు పెట్టాలంటే ఆఫీసులో ముఖ్యమైన పనుంది'' అన్నానాయనతో.

''ఇంటి పనికంటె ఆఫీసు పని ముఖ్యం కాదుబాబూ'' అన్నాడాయన.

''కానీ రేపు ఆఫీసర్స్ మీటింగుంది'' అన్నాను. విసుగ్గా అన్నప్పటికీ నా ప్రాముఖ్యతకు రవంత గర్వం కూడా ఉంది.

''ఆఫీసర్స్ మీటింగేనా - అయితే ఏం ఫరవాలేదు. సెలవు పెట్టేయ్ బాబూ'' అన్నాడు శాంతయ్య సింపుల్‌గా.

నేనాయనతో ఇంకేం మాట్లాడలేదు. ఎంత మంచివాడయినా అసిస్టెంటన్నాక ఆఫీసర్సంటే అసూయుండక పోదు. ఆ మీటింగులో తనకూ పాల్గొనే అవకాశముంటే అప్పుడాయన దాన్ని పొగుడుతాడు. లేకుంటే ఇలా హీనపరుస్తాడు.

తర్వాత నా కొలీగ్స్‌తో మాట్లాడేను ఆఫీసర్లెవ్వరూ ఆ మీటింగు గురించి పట్టించుకోవడంలేదు. ఇంట్లో

ముఖ్యమైన పనుంటే ఆ మీటింగుకి వెళ్ళాల్సిన పనేమీ లేదనీ - సెలవు పెట్టేయమనీ చాలామంది సలహా యిచ్చారు.

నేనింకా కొత్తవాణ్ణి ఆ మీటింగులో పాల్గొనే అవకాశం నాకు లేకుండా చేయాలని వారందరూ అనుకున్నట్లు తోచింది నాకు ఎందుకంటే ఆఫీసర్లందరిలోకీ నేనే బాగా చిన్నవాణ్ని. నన్ను చూస్తే చాలామందికి అసూయ.

అలాగా అని ఊరుకున్నాను తప్ప మర్నాడా మీటింగులో పాల్గొనాలన్న దృఢ నిశ్చయం నాక్కలిగింది

ఇంటికి వెళ్ళి శ్రీమతికి అసలు విషయం చెప్పాను.

ఆమెకు కోపం వచ్చింది—"ఆఫీసులో ముఖ్యమైన పనులంటూ ఉండవు. దేశం రక్తంతో, కరువుకాటకాలతో ఉడుకెత్తిపోతూంటే తాపీగా విదేశయాత్రలు చేస్తూ అంతర్జాతీయ సమస్యల గురించి ఆందోళన చెందే నాయకులున్న మన దేశంలో ఆఫీసుపని గురించి యింటి పని మానుకుంటారా?" అందామె.

శ్రీమతి తెలివికి నేనాశ్చర్యపడి—"ఇలా మాట్లాడ్డం నీకెవరు నేర్పారు? ప్రభుత్వోద్యోగిని. నువ్వు దేశనాయకులను విమర్శించకూడదు-" అన్నాను.

"ఏం చేయాలో ఏం చేయకూడదో మీకంటే నాకే బాగా తెలుసు. రేపు మీరు సెలవుపెట్టి తీరాల్సిందే-" అంది శ్రీమతి.

"ఇప్పటికే ఆఫీసులో ఆఫీసర్లందరూ నేను చిన్నవాడినన్న అసూయతో ఆఫీసర్ల మీటింగుకి నన్ను రాకుండా చేయాలని చూస్తున్నారు. బాస్‌కు నేనంటే అభిమానం కాబట్టి కానీ నా అనుభవానికి మీటింగులో నాకు స్థాన

ముండాల్సింది కాదు. వాళ్ళంతా నన్ను సెలవుపెట్టమని ప్రోత్సహిస్తున్నారు. నేను సెలవుపెడితే బాస్ నాకు మళ్ళీ ఆఫీసులో ప్రాముఖ్యత నివ్వడు. అక్కడ నాకే గుర్తింపు ఉండదు—...'' అన్నాను.

ఈ మంత్రం శ్రీమతిమీద పని చేసింది-''మీకు నా కంటే ఆఫీసే ఎక్కువ—'' అని గొణుక్కుంటూనే అందుకంగీకరించింది.

నేను శ్రీమతిని విపరీతంగా మెచ్చుకున్నాను. ఆమె అవగాహన, మంచితనం. సంస్కారం సాటిలేనివన్నాను.

ఎందుకంటే సమస్యల్ని ఆదిలోనే త్రుంచేయడం నాకిష్టం.

శ్రీమతి కోపం చల్లారిపోయింది.

## 3

టైముకే ఆఫీసుకు వెళ్ళాను. మీటింగు గంట తర్వాత ఏర్పాటు చేయబడింది. ఎందుకంటే ఆఫీసుకు టైముకు వచ్చేవారు తక్కువ. అసలు టైముకు అరగంట వు అయితే అంతా చేరుకుంటారు. ఎందుకైనా మంచిదని బాస్ గంట టైమిచ్చాడు.

మీటింగుకి వెళ్ళాను.

రౌండ్ టేబిల్ సమావేశంలా ఉందేర్పాటు.

అందులో నేనున్నందుకు గర్వపడ్డాను.

అయితే ఉండవలసినవారిలో నలుగురు సీనియర్ ఆఫీసర్స్ లేరు. ఆ రోజే వారు సెలవు పెట్టారట.

వారి నిర్లక్ష్యానికి నేనాశ్చర్యపడ్డాను.

బాస్ గొంతు సవరించుకుని మీటింగుకి వచ్చినవారందరికీ ధన్యవాదాలు చెప్పాడు. కొందరు సెలవు పెట్టినందుకు బాధపడ్డాడు. తర్వాత-''ఆఫీసులో క్రమశిక్షణ బాగా తగ్గి

పోయింది. ఎక్కువమంది ఆలస్యంగా వస్తున్నారు. వచ్చేక కూడా పని చేయకుండా కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. కొంతమందైతే తమ సీట్లో కూర్చోకుండా ఆఫీస్ కాంటీన్లో కూర్చుంటున్నారు. మరి కొందరు ఇలా ఆఫీసుకు వచ్చి ముఖం చూపించి వెంటనే బైటకు వెళ్ళిపోతున్నారు. వీటన్నింటికి మీరేమైనా పరిష్కార మార్గాలు సూచించాలి—" అన్నాడు.

ఆయన చెప్పినవన్నీ నిజమే! వీటిని గురించి నేనూ ఆలోచిస్తూన్నాను. దీనికి మిగతావారేమంటారోనని కుతూహలంగా చూశాను.

ఒక్కరూ మాట్లాడలేదు.

ప్రతి ఒక్కరూ బాస్ ఇంకేమైనా చెబితే వినాలనే చూస్తున్నారు.

"ప్లీజ్ ....మీరు మాట్లాడండి. మీరంతా అనుభవజ్ఞులు. విజ్ఞులు. మనమంతా ప్రజల సొమ్ము తింటున్నాం. అందుకు తగ్గ ప్రతిఫలం ప్రజల కివ్వాలి. మన క్రింది ఉద్యోగుల్లోనూ మనలోనూ క్రమశిక్షణ ఉండాలి! అది మన బాధ్యత ....ప్లీజ్ ....మాట్లాడండి...."

బాస్ చాలా ఆవేశంగా అన్నప్పటికీ కూడా ఎవ్వరూ మాట్లాడలేదు. అంతా ఆయనవంకే చూస్తున్నారు.

మా సంస్థ మొత్తానికి ఆయన బాస్....

నా కాయన ఆవేదన అర్థమయింది.

ఎవరైనా మాట్లాడుతారేమోనని కాసేపు చూశాను.

ఎవరి సంగతీ అటుంచి బాస్ కూడా మాట్లాడకుండా ఎవరైనా మాట్లాడతారని ఎదురు చూస్తున్నాడు.

ఇకలాభం లేదనుకొని నేను గొంతు సవరించుకుని—

"సర్!! ఆలస్యంగా వచ్చేవాళ్ళందర్నీ శిక్షించడానికి పద్ధతి ఉంది. మూడు రోజుల ఆలస్యానికి ఒక క్యాజువల్ లీవ్ తీసేస్తాం-" అన్నాను!

బాస్ మెప్పుకోలుగా నా వంక చూసి-"అది నిజమే-కానీ ఎవరైనా ఆలస్యంగా వచ్చినట్లు మనకెలా తెలుస్తుంది?" అన్నాడు.

"ఆఫీసుకు రాగానే రిజిస్టర్లో సంతకం పెట్టి టైము వేస్తారుగా-" అన్నాను వెంటనే.

"అవును. కానీ ఆ రిజిస్టర్ ప్యూన్ దగ్గరుంటుంది. అతడు రోజూ అందరికంటే ఆలస్యంగా వస్తాడు. సంతకాలు మొక్కుబడికి ఏదో సమయంలో పెట్టిస్తాడు. అందరూ సరైన సమయానికే వచ్చినట్లు సంతకాలు పెడతారు-" అన్నాడో ఆఫీసర్.

"ఇది నిజమా?" అన్నాను నేను.

చాలామంది ఆ నిజానికి వత్తాసు పలికారు.

"ఇంతమందికి తెలిసిన ఈ నిజం నిజం కాకుండా పోదు. అలాంటప్పుడు సమస్య సులభంగా తేలిపోయింది. ముందు మనం ప్యూన్ మీద చర్య తీసుకోవాలి. దాంతో మొత్తం వ్యవహారం దారికి వస్తుంది—" అన్నాను.

"ఈ విషయంలో ఇంకెవరైనా ఏమైనా చెబుతారా?" అన్నాడు బాస్ నెమ్మదిగా.

ఎవ్వరూ మాట్లాడలేదు.

"నీ సూచన ఎవరికీ నచ్చినట్లు లేదు—" అన్నాడు బాస్.

నాకు కోపం వచ్చింది. బాస్ మీద అది ప్రదర్శించలేను కాబట్టి-"ఇతరుల సంగతి వదిలేద్దాం. నా సూచన మీకు నచ్చిందా?" అన్నాను.

బాస్ తల అడ్డంగా ఊపి-"లేదు-" అన్నాడు.

"పోనీ అందులో లోపమేమిటో నేను తెలుసుకో వచ్చా?"

బాస్ అదోలా నవ్వి-"ఇంతమంది చదువుకున్నవాళ్ళు ఆలస్యంగా వస్తూంటే ఏమీ చేయలేని మనం-హ్యూన్ నొక్కణ్ణే యేదో చేయాలనుకోవడం అన్యాయం—" అన్నాడు.

అప్పుడు నా పక్కనున్న ఆఫీసర్ నన్ను గోకి— "హ్యూన్ బాసింట్లో పని చేస్తాడు. అతడి ఆలస్యం గురించి నువ్వేమీ మాట్లాడకు....—" అన్నాడు నెమ్మదిగా.

ఆ మాటలు జీర్ణం చేసుకొనడానికి కాసేపు పట్టింది నాకు.

ఈలోగా అందరి అనుమతితోటీ బాస్ ఒక నిర్ణయానికి వచ్చేశాడు. ఆ ప్రకారం ఉద్యోగసులందరూ సరైనవేళకు రావాలని హెచ్చరిస్తూ నోటీసొకటి నోటీసుబోర్డులో పెట్టాలని అంతా ఒప్పుకున్నారు.

"ఆ విషయం నోటీసుద్వారా చెప్పాలా? ఇది అందరకూ తెలిసిన విషయమే కదా! ఆఫీసుకు ఆలస్యంగా రావడం తప్పని అందరికీ తెలియదా?" అన్నాను.

"కొన్ని విషయాలు తెలిసినట్లే కనబడతాయి. చిన్నప్పుడు బడికి వెళ్ళేప్పుడు-జాగ్రత్తగా దారి చూసుకుని నడు నాయనా-అని మా అమ్మ రోజూ హెచ్చరించేది. జాగ్రత్తగా నడవాలని నాకు తెలియదు కనుకనా....అంటే దీని అర్థమేమిటి?" అన్నాడు బాస్.

ఎవ్వరూ చెప్పలేదు.

"మా అమ్మ నాకు రోజూ నోటీసిచ్చే దన్నమాట:

మనం రోజూ యివ్వడం లేదుకదా—....” అన్నాడు బాస్.

అంతా ఘొల్లున నవ్వారు.

తన జోక్ పేలినందుకు బాస్ ముఖం వెలిగింది—

“మనం చిన్న చిన్న విషయాల పేరు చెప్పి ఎక్కువ సమయం వృధా చేయవద్దు. మిగతా సమస్యలు కూడా త్వరగా చర్చిద్దాం—”

వాటి ఫలితంగా ఆఫీసులో కబుర్లు చెప్పుకోకూడదని ఒక నోటీసూ, కాంటీన్లో ఎక్కువసేపు కూర్చోకూడదని ఇంకో నోటీసూ, ఆఫీసువేళల్లో స్వంత పనిమీద బయటకు వెళ్ళకూడదని మరో నోటీసూ—ఇలా మొత్తం అన్నీ కలిపి నాలుగు నోటీసు లివ్వాలని నిర్ణయమయింది.

“అయాం వెరీ హాపీ—అర్యూ హాపీ....” అన్నాడు బాస్.

కొందరు తల లూపారు.

కొందరు మౌనంగా ఉన్నారు.

నే నొక్కణ్ణే తల అడ్డంగా ఊపాను.

అది బాస్ దృష్టి నాకర్షించింది.

“ఆర్ యూ నాట్ హాపీ-?” అన్నాడాయన.

“పై విషయాలేవీ నోటీసుల ద్వారా తెలియబర్చాల్సిన విశేషాలు కావు ఈ నోటీసులవల్ల ఉద్యోగస్థుల్లో మార్పు తీసుకురాగలమన్న నమ్మకం నాకులేదు—” అన్నాడు ధైర్యంగా.

“నీకులా ధైర్యంగా మాట్లాడేవాళ్ళంటే నా కెంతో యిష్టం—” అంటూ బాస్ నన్ను మెచ్చుకున్నాడు.

"థాంక్స్-" అన్నాను సిగ్గుపడుతూ.

"థాంక్స్ చెబితే చాలదు. ఉపాయం కూడా చెప్పాలి—"

"ఏం ఉపాయం?" అన్నాను.

"మన ఆఫీసులో ఉద్యోగస్థులనించి పని రాబట్టే ఉపాయం నువ్వే చెప్పాలి-" అన్నాడు బాస్.

"చాలా సింపుల్ సర్! మన ఆఫీసులోని ప్రతి ఉద్యోగికీ రోజు కింత పని అని నిర్ణయిస్తాం. నిర్ణయించిన పని నిర్ణీత సమయంలో పూర్తి చేయడం ఉద్యోగి బాధ్యత. చేయలేకపోతే అందుకు సరైన కారణాలు చూపాలి. లేదా శిక్షార్హుడు కావాలి-" అన్నాను.

బాస్ ముఖం చిట్లించి - "మూడు వందలమందికి రోజువారీ, మనిషి వారీ పని నిర్ణయించాలంటావు. అంటే మన మందరం కొంతకాలంపాటు ఇతర పనులన్నీ మానేసి ఈ పనిలో పడాలి. నీ సూచన ఆచరణయోగ్యం కాదు" అన్నాడు.

నా పక్కనున్న ఆఫీసరు - "నువ్వు చెప్పినప్రకారం చేస్తే చాలామందికి ఓవర్‌టైం రాదు. తన చుట్టూ తిరిగే వాళ్ళకు బాసివ్వగల ప్రతిఫలం అదే! అందువల్ల ఆయనకీ సూచన నచ్చదు" అన్నాడు నెమ్మదిగా.

బాస్‌కి అతడేదో మాట్లాడుతున్నట్లు అర్థమై - "మీ అభిప్రాయాలు నాకు వినబడేలా చెప్పాలి" అంటూ నా పక్కనున్న ఆఫీసరువంకే తీక్షణంగా చూశాడు.

ఆ ఆఫీసరు వెంటనే - "ఇప్పటికే మన ఆఫీసులో ప్రతి ఉద్యోగీ ఇంతో అంతో ఓవర్‌టైం చేస్తున్నాడు. అంటే అందరికీ పని ఎక్కువగా వున్నదనే అర్థం అంటు

న్నాను" అంటూ మాట మార్చాడు.

"మంచి పాయింటు చెప్పావు" అంటూ బాస్ అతణ్ణి మెచ్చుకున్నాడు.

"సర్! ఓవర్ టైం నిజంగా అవసరం లేదు అందరూ మన అలుసు చూసి ఓవర్ టైం అడుగుతున్నారు...." అన్నాను.

"ఎలా చెప్పగలవు?" అన్నాడు బాస్.

"నాకు తెలుసు" అన్నాను.

"ఉదాహరణగా ఎవరినయినా చెప్పగలవా?"

"పేర్లు చెప్పానంటే వాళ్ళ యూనియన్ నీ ప్రాణాలు తీస్తుంది" అంటూ పక్కనున్న ఆఫీసరు మరీ నెమ్మదిగా నన్ను హెచ్చరించాడు.

"పేర్లెందుకు సార్! నేను మరోవిధంగా ఋజువు చేయగలను. కొంతకాలంపాటు ఓవర్ టైం పూర్తిగా తీసేసి చూద్దాం" అన్నాను.

బాస్‌కు నా సలహా బొత్తిగా నచ్చలేదు. ఆయన విసుగ్గా ముఖం పెట్టి "ఇలాంటి సూచనలవల్ల కాల హరణం తప్ప మరే ప్రయోజనమూ ఉండదు. నీకు తెలుసో తెలియదో - మన ఆఫీసులో పనులంటూ జరిగితే అవి ఓవర్ టైం వల్లనే" అన్నాడు.

ఆయన అభిప్రాయంతో ఏకీభవిస్తూ చాలామంది తల లూగించారు. నేను మాత్రం చలించకుండా - "మీరు అన్యథా భావించకండి సార్! చాలా మంది ఆఫీసు సమయంలోనే పనిచేసి దానికే ఓవర్ టైం క్లెయిమ్ చేస్తు న్నారు" అన్నాను.

బాస్ ముఖం ఎర్రబడింది - "నిజమా?" అన్నా

డాయన.

"ఊఁ" అన్నాను నేను.

"మీలో యింకెవరికయినా ఈ విషయం తెలుసా?" అన్నాడు బాస్.

నా అదృష్టం బాగుండి చాలామందికి తెలుసునన్నట్లుగా తల ఊగించారు.

బాస్ కోప్పడతాడనుకున్నాను. కానీ ఆయన నా వంక ప్రసన్నంగా చూసి - "యూ ఆర్ వెరీ స్మార్ట్ - ఓ గొప్ప విశేషాన్ని నా దృష్టికి తెచ్చావు. ఈ సమస్యకు వెంటనే పరిష్కార మార్గం చూడాలి" అన్నాడు.

"ఓవర్‌టైం కొంతకాలంపాటు తీసేసి చూద్దాం" అన్నాను.

"నీ కనుభవం చాలదు. నీ సూచన ఆచరణీయం కాదు. ఇంకా మంచి సూచన చెప్పండెవరైనా" అన్నాడు బాస్.

ఎవ్వరూ మాట్లాడలేదు.

"నువ్వు కూడా ఇంకో సూచన చెప్పలేవా?" అన్నాడు బాస్ నా వంకనే చూస్తూ.

"నా అభిప్రాయంలో ఓవర్‌టైం తీసేయడమే మంచిది...."

బాస్ తల అడ్డంగా ఊపి - "నో....నో....నో యూ ఆర్ నాట్ స్మార్ట్" అన్నాడు.

నాకు కొంచెం చిన్నతనమనిపించింది.

ఎంతసేపటికీ ఎవ్వరూ మాట్లాడకపోవడం చూసి - "పోనీ నేను చెప్పనా?" అన్నాడు బాస్.

కొందరు - "ఊఁ" అన్నారు.

"ఈ మాత్రం మీకెవరికీ స్ఫురించకపోవడం ఆశ్చర్యంగా ఉంది" అంటూ ఒకసారి గొంతు సవరించుకుని "ఓవర్ టైం చేసేవాళ్ళు ఆఫీసు వేళల్లో కాక - ఇతర వేళల్లో మాత్రమే ఓవర్ టైం పని చేయాలని ఓ నోటీసిద్దాం" అన్నాడు బాస్ సింపుల్‌గా.

అందరూ చప్పట్లు కొట్టారు.

ఆ తర్వాత నేను కూడా ఇంకేమీ మాట్లాడలేదు.

సమావేశం మరో పావుగంటసేపు నడిచింది. ఇంకో రెండు నోటీసుల గురించీ నిర్ణయం తీసుకున్నాం.

అప్పు డక్కడికి కాంటీన్ నించి ఇద్దరు బాయ్స్ వచ్చారు. టీ. బిస్కట్స్ అందరం పుచ్చుకున్నాం.

అదయ్యాక బాస్ నన్ను చూపించి - "ఇతడు చురకయిన యువకుడు. ఈ రోజు మనం నిర్ణయించిన నోటీసులన్నీ ఇస్యూచేసే బాధ్యత ఇతడికి అప్పగిస్తున్నాను...." అన్నాడు.

అందరూ చప్పట్లు కొట్టారు.

అప్పుడు బాస్ చక్కటి సలహా లిచ్చి సమావేశాన్ని జయప్రదం చేసినందుకు మా అందరికీ ధన్యవాదాలు చెప్పాడు.

సమావేశం ముగిసింది.

అక్కణ్నించి బయటకు వచ్చేక - "ఇంతకూ మన మందరం ఎందుకు సమావేశమైనట్టు?" అన్నాను పక్కనున్న ఆఫీసర్‌తో.

"సమస్యలను పరిష్కరించడానికి" అన్నా డతను.

"కానీ మనం ఒక్క సమస్యను కూడా పరిష్కరించా

మనుకోను" అన్నాను బాధగా.

"సమస్యల్ని పరిష్కరిస్తే మనకప్పుడప్పు డిలా సమావేశమయ్యే అవకాశముండదు. సమస్యల్ని చర్చించే అవకాశమూ వుండదు. మన సమావేశం సమస్యలకు గుర్తింపు. సమావేశ ఫలితం వాటికి కొత్త ఊపిరి" అన్నా డా ఆఫీసరు నవ్వుతూ.

"ఇది చాలా బాధపడాల్సిన విషయం."

"బాధ ఎందుకు? దేశాన్నేలే రాజకీయ పక్షాల నుంచి మన ప్రభుత్వ కార్యాలయాలవరకూ ఇదే పద్ధతిలో నడుస్తున్నాయి. సమస్యలను చావనిస్తే చాలామందికి మనుగడ ఉండదు. అందుకని వాటిని చావనివ్వకూడదు" అని అతడు వెళ్ళిపోయాడు.

నా కాబిన్లోకి వెళ్ళాను. మీటింగుకి వచ్చిన స్టెనో నా దగ్గరకు వచ్చి - "సర్ మినిట్స్ తయారు చేస్తాను. నోటీసులు డిక్టేట్ చేస్తారా?" అనడిగాడు.

"ముందు మీటింగు మినిట్స్ తయారుచేసి తీసుకుని రా" అని అతణ్ణి పంపేశాను.

అంతవరకూ నేను అలాంటి నోటీసులు ఇస్యూ చేయలేదు. నాకు ముందు అలాంటి నోటీసులు ఇస్యూ చేసే సీనియరాఫీసర్నడిగితే విషయం తెలుస్తుందని ఆయన దగ్గరకు వెళ్ళాను.

"పాత డ్రాఫ్టులు కావాలా?" అన్నా డాయన.

"అవునండి" అన్నాను వినయంగా. అవి చూసి అదే మోడల్లో నేనూ మేటర్ తయారు చేయాలనుకున్నాను.

ఆయన నాకో పెద్ద తాళం చెవుల గుత్తినిచ్చాడు.

"ఇదేమిటి?" అన్నా నాశ్చర్యంగా.

ఆయన నాకు తాళాలు విడదీసి చూపిస్తూ—"ఇది గది తాళం. మిగతావన్నీ గదిలో ఉన్న బీరువాల తాళాలు. అక్కడ చాలా బీరువాలుంటాయి. కానీ నువ్వు శ్రమపడి అన్ని బీరువాలూ వెతకనవసరంలేదు. 21 నంబరు బీరువాలో నోటీసుల విషయ సూచిక ఉంటుంది—" అన్నాడు.

నోటీసుల విషయ సూచికేమిటా అనుకుంటూనే ఆ గదికి వెళ్ళి తలుపు తీసి లోపల ప్రవేశించాను. అక్కడ చాలా బీరువాలున్నాయి ఆయన చెప్పినట్లే....

21 వ నంబరు బీరువా తెరిచాను.

అందులో బోలెడు ఫైల్సు. ప్రతి ఫైలూ—ఒకో విషయానికి ఉద్యోగులను హెచ్చరిస్తూ ఇచ్చిన నోటీసుల విషయసూచిక. నాక్కావలసిన నోటీసుల వివరాలు విషయ సూచికలోంచి పట్టుకుందుకే అరగంట పట్టింది. తర్వాత అసలు బీరువా తెరిచి నా కవసరమైన పాత డ్రాఫ్టులు సంపాదించి నా కాబిన్లోకి వెళ్ళి కూర్చున్నాను.

ఈ పాత డ్రాఫ్టుల ఆధారంగా కొత్తడ్రాఫ్టులు తయారు చేయాలి.

ఆ నోటీసులు చదువుతూండగా నా గదిలో ఓ అసిస్టెంట్ ప్రవేశించి— "సార్—నోటీసుల గది ఈ రోజునుంచీ మీరు చూస్తున్నారటగా—" అన్నాడు.

"అవును—ఏం?" అన్నాను.

"ఈ ఫైలు చూడాలిసార్!" అన్నాడతడు తన చేతిలోని ఫైలును నా ముందుకు తోస్తూ.

అదేమిటా అని చూశాను.

క్రమశిక్షణ గురించి హెచ్చరిస్తూ ఉద్యోగులకిచ్చే నోటీసులు దాచడానికి మరో నాలుగు స్టీలు ఆల్మిరాలు కొనడానికి శాంక్షన్ కావాలి:

సమస్యల్ని బ్రతికించడానికి గొప్ప ప్రయత్నమే జరుగుతోందనుకుంటూ ఆ ఫైలుమీద సంతకం చేశాను.

ఆ తర్వాత ఏడువారాలకి మళ్ళీ ఆఫీసర్ల మీటింగు ఏర్పాటయింది. అప్పుడే శ్రీపతికి నా చేత సెలవు పెట్టించాలన్న మనసూ పుట్టింది.

సమస్యల్ని బ్రతికించే ఆఫీసర్ల మీటింగు కోసం—నా యింట్లో నేను సమస్యలను సృష్టించ దల్చుకోలేదు.

బాస్ వద్దన్నప్పటికీ సెలవు పెట్టేశాను.

నాలోని మార్పు బాస్‌కు సంతోషాన్నే కలిగించిందని ఆ తర్వాత నాకు తెలిసింది. □

## హెల్మెట్ బాధ?



# మృత్యువలయం

యస్.జి.వి.అజీజ్

సహాట ఒకటోసారి నెమ్మదిగా కిటికీలోంచి తొంగి చూసింది శ్యామల. ఆమె గుండెదడ ఇంకా పూర్తిగా తగ్గలేదు.

ఎవరో....బిచ్చగాడు కాబోలు! నిన్నటి నుండీ ఆ

ప్రాంతాన్ని వదల్టంలేదు.

అక్కడో చెత్తకుండీ వుంది

ఎక్కణ్నుంచి వచ్చాడో! పాకుతూ దేకుతూ నిన్న సాయంత్రం నాలుగున్నర ప్రాంతంలో వచ్చాడు. ఎవరైనా విస్తరాకులు చెత్తకుండీలో వేస్తే అందులోని మెతుకులు ఏరుకొని తిన్నాడు. ముసలాడు. పాపం-నడవ లేని వాడులాగున్నాడు....ఎముకలు కొరికే చలిలో నిన్న రాత్రి అక్కడే పడుకున్నాడు పాత గోనెసంచీ కప్పుకుని.

మరో సమయంలోనైతే శ్యామల వాడి దీనస్థితికి జాలి పడి వుండేది. కూడు గుడ్డ నీడ దొరకని ఎందరో నిర్భాగ్యులు, దరిద్రనారాయణులు వున్న దేశంగా మన దేశాన్ని తల్చుకుని కుమిలిపోయేది.

కాని యిప్పుడామె హృదయంలో జాలి, సానుభూతి లాంటి పదాల తాలూకు ఛాయలు మచ్చుకైనా కానరావటం లేదు.

భయం!

భయం!!

భయం!!!

భయంకరమైన భయం ఆమె గుండెల్లో తిష్ఠ వేసుకొని ఆమెని వూపిరాడనివ్వకుండా చేస్తోంది. అంతటి చలి వాతావరణంలో సైతం ఆమె శరీరం స్వేద జలాన్ని వర్షిస్తూ సన్నగా కంపిస్తోంది.

అప్రయత్నంగా గడియారంకేసి చూసిందామె.

అయిదున్నర.

మేఘమాలికలు చుట్టు ముట్టడంతో సూర్యభగవానుడి కోపం వచ్చి అప్పటికే తప్పుకున్నాడు. ఆ అదను చూసు కొని వాయుదేవుడు క్రమంగా విజృంభిస్తున్నాడు.

ఆ ముసలి బిచ్చగాడు చెత్తకుండీ ప్రక్కనే చతికిలబడి అక్కడి చెత్తలో పడున్న బీడీ ముక్కల్ని ఏరుకుంటు న్నాడు. చెత్తకుండీ ప్రక్కనే పెద్ద మురుగుకాలువ పారు తోంది.

చిన్నసైజు లోయలా వుందది.

నాసికాపుటాల్ని బ్రద్దలు చేస్తోన్న దుర్గంధం!

"భగవాన్! కనీసం గంటసేపు ఆ ముసలాణ్ని అక్కణ్నుండి తప్పించు" దేవుడిపటాన్ని చూస్తూ కంపిస్తోన్న చేతుల్తో చేతులు జోడించింది శ్యామల.

## 2

తలుపు తట్టిన చప్పుడు విన్పించింది.

శ్యామల గుండె గుభిల్లుమంది.

ఎవరు? ఎవరై వుంటారు? ఈ వేళప్పుడు తన కోసం ఎవరు వచ్చారు? పాలవాడా? కాదు. చాకలమ్మా?! అయ్యుండదు. పేపర్ బోయ్?! తను పేపర్ తెప్పించదు. సుగుణా!? ఊహూఁ....తను సెలవు చీటీ పంపింది గాబట్టి అయ్యుండదు.

మరి తనకెవరూ చెప్పుకోదగ్గ బంధువులుగాని స్నేహి తులుగాని లేరు. ఆ మాటకొస్తే తనకి నా అన్నవాళ్ళెవరూ లేరు. అనాధోద్యానవనంలో పెరిగిన తులసి మొలక తను. ఎక్కడ పుట్టిందో తెలీదు. ఎవరికి పుట్టిందో తెలీదు. ఆశ్రమమే తల్లీతండ్రీ గురువూ దైవం! నెలకి ఆరువందల జీతంతో ఓ ప్రముఖ ఇంగ్లీష్ మీడియమ్ స్కూల్లో వుద్యోగం కూడ యిప్పించారు.

శ్యామల ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ మరో సారి తలుపు తట్టిన చప్పుడు వినిపించింది.

గాబరాగా వంటింటికేసి చూసి మరోసారి గొళ్ళెం

వేసుందో లేదోనని గమనించి గుండెల్ని చిక్కబట్టుకొని తలుపు తెరిచింది.

ఇంటి ఓనర్ కాశీపతిగారు.

"ఏమిటమ్మా అలా వున్నావు?" చిరునవ్వుతో అంటూ లోపలికి ప్రవేశించా రాయన.

"అబ్బె....ఏం లేదండీ...." తడబడిం దామె.

"అంత స్పష్టంగా కనిపిస్తూంటే ఏం లేదంటా వేమిటీ?" వంటింటి తలుపులకేసి చూపించారాయన.

గుండె ఆగినంత పనయిందామెకి. జాలిగా నిస్సహా యంగా చూసిందాయన వంక. ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి. గుండెల్లోని భయమంతా మొహంలోకి పొంగింది. మరొక్క క్షణంలో ఆమె నిజం చెప్పేసి ఆయన కాళ్ళపై వాలిపోతుందనగా....

"నువ్వింతవరకూ స్నానం కూడా చెయ్యలేదని నీ శరీరం చెబుతోంది. వంట కూడా చేసుకోలేదని మూసి వున్న వంటింటి తలుపులు చెబుతున్నాయి. నువ్వింతవరకూ టిఫిన్ కూడా చెయ్యలేదని నీ కడుపు చెబుతోంది. కనీసం కసవు కూడ చిమ్మలేదని ఈ యింటి వాలకం చెబుతోంది. స్కూల్‌కి వెళ్ళలేదని ఉదయం నుండీ ఈ ఇంటికి తాళం వెయ్యకపోవటం చెబుతోంది.

"అమ్మా శ్యామలా! ఒంటరితనం మనిషిని బాధ పెడు తుంది. అమ్మా నాన్నా అన్నయ్య లాంటివారు నాకూ వుండుంటే యెంత బావుణ్ను? అన్న భావన ముఖ్యంగా ఆడపిల్లని తీవ్రమైన అశాంతికి గురి చేస్తుంది. కాని వాటికి లొంగకూడదు. డీలా పడిపోకూడదు...." అన్నాడు కాశీపతి.

అంత భయంలోనూ ఆమె ఒక్క క్షణంసేపు తేలిగ్గా

నిట్టూర్చింది. ఆమె ఏదో అనబోతోందగా ....

"నువ్వింకేం మాట్లాడకు—మా యింటికి వెళదాం. నలుగురితో సరదాగా మాట్లాడుతూ కాసేపు గడిపితే అన్ని బాధలూ పలాయన మంత్రపఠిస్తాయి ...." అన్నాడు కాశీపతి.

ఆయన అప్యాయత చూస్తోంటే కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి శ్యామలకి. ఆర్నెల్లకోసారి అద్దె పెంచుతూ గోడలకి మేకులు కొట్టకూడదు, రాత్రి పది తర్వాత లైటు వెయ్యకూడదు ....అంటూ పనికిమాలిన ఆంక్షలు విధిస్తూ అద్దెకుండేవాళ్ళని శత్రువులుగా భావించే యింటి ఓనర్లున్న ఈ రోజుల్లో ఈ మాత్రం అప్యాయత ఆమెపై పన్నీటి జల్లే అయింది.

కాని యిప్పుడామె అలాంటి ఆప్యాయతలోని మాధుర్యాన్ని అనుభవించే పరిస్థితుల్లో లేదు. ఎవరికీ అనుమానం రాకముందే తను 'ఆ' పని పూర్తిచెయ్యాలి. రెండో కంటికి తెలీకుండా ఈ పని జరిగిపోవాలి.

ఎవరి కనుమానం వచ్చినా—

ఏ ఒక్కరు తనని గమనించినా—

ఏ చిన్న పొరపాటు దొర్లిపోయినా—

తనకి శిక్ష తప్పదు!

కటకటాలు లెక్కపెట్టక తప్పదు!!

కాశీపతి ఆప్యాయతని రేపటి నుండి తీరిగ్గా గ్రోలవచ్చు.

తనకి ఆరోగ్యం బాగా లేదనీ మరేం ఫర్వాలేదనీ, ఒంటరిగా కాసేపు రెస్టు తీసుకోవటమే దీనికి సరైన మందనీ కాస్త తేలికపడి ఇల్లంతా సర్దుకున్నాక తీరిగ్గా యింటికొస్తాననీ తడబడకుండా అనుమానం రాకుండా

చెప్పి, నమ్మించి కాశీపతిని పంపించేసరికి ఆమెకి తల ప్రాణం తోక్కొచ్చినంత పనైంది.

# 3

టైమ్ చూసుకుంది శ్యామల.

ఏడూ అయిదు.

నూటరెండోసారి కిటికీలోంచి చూసింది.

ముసలాడు విస్తరాకులు నాకేస్తున్నాడులా వుంది.

తలుపులు గట్టిగా వేసి బోల్ట్స్ వేసింది. కిటికీ తలుపులు బిగించింది. నెమ్మదిగా అడుగులు వేస్తూ వెళ్ళి వంటింటి తలుపులు తెర్చింది. లీలగా దుర్గంధం ముక్కుపుటాల్ని సోకింది.

ఆమె భయం రెండింతలైంది.

ఇంకా నయం. గదిలో ఫ్యాను తిరుగుతూండింది గాబట్టి కాశీపతి పసిగట్టలేకపోయాడు!!

రెండడుగులు ముందుకి వేసింది.

అప్పుడు గమనించిందామె—కొన్ని వేల ఎర్ర చీమల్ని!!

విందుభోజనం ఉచితంగా పెడుతున్నారు వరుసగా రండి అని బిచ్చగాళ్ళ నుద్దేశించి తండోరా వేయిస్తే వాళ్ళెంత ఆత్రంగా పరుగులు పెడతారో అలా—

బారులుతీరి, వరుస క్రమంలో—కదిలిపోతోన్న సరళరేఖల్లా-గబగబా సాగిపోతూ 'గమ్యాన్ని' చేరుకుంటున్నాయి.

వాటి గమ్యం ...

ఓ శవం....

దాదాపు ముప్పయి సంవత్సరాలున్న ఓ వ్యక్తి శవం ఆ గదిలో వికృతంగా పడివుంది.

శ్యామల ఆలోచనల్లో పడింది.

చెడువాసన ప్రారంభమైంది. రాన్రాను దుర్గంధం పెరుగుతుంది! పరిసరాలకు వ్యాపిస్తుంది. ఆ లోగానే ఈ శవం మాయం కావాలి.

ఎలా?

ఈ ముసలాడు చెత్తకుండీ ప్రక్కన వుండగా దాన్ని మురుక్కాలవలోకి నెట్టడం దుస్సాధ్యం. రాత్రి పద కొండు దాటాక్కూడ వాడు మేలుకొని వుంటాడా అను కుంటే—

మేలుకొని వుండొచ్చు.

ఎందుకంటే వాతావరణంలో బాగా చలి వుంది. ముస లాడికి కప్పుకోటానికి మూరెడు గోనెసంచీ తప్ప మరేమీ లేదు. అది చలి కాగదు. పైగా ఖళ్ ఖళ్ మంటూ ఒకటే దగ్గు.

అన్నిటికంటే పెద్ద సమస్య మరోటి సాక్షాత్కరిం చింది శ్యామల మనోఫలకంపై.

శవాన్ని మురుక్కాలవలోకి తోసెయ్యాలి నిజమే. కాని శవాన్ని మురుక్కాలవ దగ్గరికి ఎలా చేర్చాలి?

తను అబల. ఇన ఇంటికీ మురుక్కాలవకీ మధ్య దూరం కనీసం రెండు ఫర్లాంగు లుంటుంది. శవం బాగా బరువుంది. కనీసం తోసుకుపోదామన్నా అసాధ్యమే.

పోనీ యిక్కడే గొయ్యితీసి పాతిపెడితే?

బాగా డబ్బు ఆశ చూపి శవాన్ని మాయం చెయ్య టాని కెవర్నయినా నియోగిస్తే??

గొయ్యి తియ్యటానికి పాత పలుగుంది, యింట్లోనే. కాని త్రవ్విన మట్టిని ఎక్కడ వెయ్యాలి? కనీసం పెర డైనా లేదే! నేలపై పరచిన బండల్ని పెళ్ళగిస్తే మళ్ళీ

వాటిని సరైన పద్ధతిలో అమర్చగలదా?

ఎవర్నయినా నియోగిస్తే వాడు రేపొద్దున తనని బ్లాక్ మెయిల్ చెయ్యడని గ్యారెంటీ ఏమిటి?

అప్పుడు మెదిలింది ఆమె స్మృతిపథంలో....

నెలక్రితం కాశీపతిగారు తన పోర్షన్‌కి కరెంట్ రీ వైరింగ్ చేయించిన సందర్భంగా వైర్‌మెన్‌కి అందించి, ఈనాటివరకూ ఇక్కడే వుంచిన పరికరాల్లో పలుగుతో బాటు వున్న తుప్పు పట్టిన పాత రంపం!!

కాసేపు చిగురుటాకులా వణికిపోయినా తమాయించు కుంది శ్యామల.

# 4

"నమస్తే ఇన్స్పెకర్‌గారూ!"

మర్రోజు కోర్టులో సబ్మిట్ చెయ్యాల్సిన కాయితా లున్న ఫైల్సుని తిరగేసి పారచూసుకుంటోన్న అజయ్ తలెత్తి చూశాడు.

వయసు యాభై అయిదుండొచ్చు. బట్టతల. కళ్ళకి జోడు, ముడుతలుపడ్డ ముఖం, మాసిపోయిన తెల్లని లాల్చి, తెల్లని పంచె కట్టుకున్నాడు, కాళ్ళకి పట్టీలూడి పోయిన చెప్పులు.

అతని మొహంలో విషాదం, దైన్యం మూర్తీభవిస్తు న్నాయి.

కుర్చీలో కూచోమన్నట్టుగా సైగ చేశాడు ఇన్స్పెక్టర్ అజయ్.

"చెప్పండి. వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ?"

"సార్! నా ఒక్కగా నొక్క కొడుకు మూర్రోజు ల్నుండి కన్పించటం లేదు ఆశలన్నీ వాడిపైనే పెట్టు కున్నాను" ఆయన గొంతు గాద్గదికమైంది. కన్నుల్లో నీటి

పొరలు కమ్ముకొచ్చాయి.

"మీ పేరు?"

"రంగనాథం."

"మీ అబ్బాయిని గూర్చిన వివరాలు చెప్పండి."

"వాడి పేరు ప్రసాద్. వయసు ముప్పయ్. యస్.టి. బి.సి. కాలేజిలో తెలుగు లెక్చరర్. ఇంకా వివాహం కాలేదు...." ఆ తర్వాతేం చెప్పాలో తోచక ఆగిపోయాడు రంగనాథం.

"ఇదివర్లో అలా ఎప్పుడయినా వెళ్ళాడా?" ప్రశ్నించాడు అజయ్.

అడ్డంగా తలూపాడు రంగనాథం.

"మీతోగాని, వాళ్ళమ్మగారితోగాని ఘర్షణ పడ్డాడా?"

"లేదు."

"అతనికి నిద్రలో నడిచే అలవాటుందా?"

"లేదు."

"పిచ్చిగాని ఉన్మాదంగాని........"

"లేదు."

"ఎవర్నయినా ప్రేమించాడా?"

"నాకు తెలీదు."

"ఫ్రెండ్ ఇంటికిగాని, తెల్సినవాళ్ళ పెళ్ళిలాంటి ఫంక్షనుగ్గాని హడావుడిగా వెళ్ళే అవకాశం వుందేమో చూడండి."

"అలాంటిదేమీ లేదు అజయ్‌గారూ! వాడేమిటో వాడి లోకమేమిటోగా వుండేవాడు."

"అతనికంటూ సపరేటుగా ఓ లోకముందా? ఏమిటది?"

"రంగులు, కుంచెలు!! చిత్రలేఖనం వాడి హాబీ! చాల

చక్కగా బొమ్మలు వేస్తాడు. ఆ లోకంలో వున్నప్పుడు నిద్రాహారాలు కూడ మర్చిపోతాడు."

"ఆ రంగంలో అతని కెవరయినా శత్రువులున్నారా?"

"లేరు."

"ఇటీవలి కాలంలో అతడు దిగులు ముభావంలాంటి ప్రత్యేక లక్షణాలతో కనిపించాడా మీకు?"

"అలాంటిదేం లేదు."

"వాళ్ళ కాలేజీలో వాకబు చేశారా?"

"చేశాను. లీవుకూడ అప్లయ్ చెయ్యలేదని తెల్సింది."

"అబ్బాయి ఫోటో వుందా?"

జేబులోంచి కెబినెట్ సయిజు ఫొటో తీసి టేబిల్‌పై పెట్టాడు రంగనాథం.

"రిపోర్టు వ్రాసిచ్చి వెళ్ళండి. దర్యాప్తు చేసి మూడు రోజుల్లోగా ఫలితం తెలియజేస్తాం...." అన్నాడు అజయ్ గంభీరంగా.

## 5

తెగువ అన్న పదంలో ఎంతో అర్థం దాగుంది. ఊహించలేనంత విలువని కలిగుంది.

పిల్లి సాధుజంతువే. నాల్రోజులు పాలుపోసి పెంచితే కాళ్ళ చుట్టూ తిరుగుతుంది తోకని మనిషికేసి రుద్దుతూ. దానికి తెగింపు వస్తే యజమానిని కరవడానికి సయితం వెనకాడదు.

ప్రాణాపాయం సంభవిస్తుందని తోచినప్పుడూ ఆపద కౌగలించుకోబోతోందని తెలిసినప్పుడూ మనిషిలో అలాంటి తెగింపు కలుగుతుంది. అది ఎలాంటి ముగింపు కయినా దారి తియ్యగలదు.

మామూలుగా బల్లి నెత్తిన పడితే కీచుమని అరుస్తూ

ఎదటి మనిషిని కర్చుకుపోయే మనిషి సైతం - తెగిస్తే - సింహం మిద పడి దాంతో కలియబడి .. దాన్ని లొంగ దీసుకోవచ్చు.

లయబద్ధంగా కదులుతూ పరిసరాల్ని వెనక్కి నెట్టేస్తూ భారంగా కేకలు వేస్తూ వేగంగా దూసుకుపోతోంది రైలు బండి. కిటికీ పక్క సీటులో కూర్చొని వేగంగా వెనక్కి పరిగెడుతోన్న ప్రకృతి వంక నిర్వికారంగా చూస్తూ కూచుంది శ్యామల.

గతం ఆమె హృదయంలోంచి తన్నుకొచ్చి ఒడిలో దూకటానికి సిద్ధంగా వుంది. కాని బలవంతంగా నిగ్ర హించుకుంటోంది శ్యామల.

గట్టిగా కళ్లు మూసుకొని కూచుండిపో యింది.

గంట గడిచింది. తను దిగాల్సిన స్టేషన్ వచ్చింది. ఒక్కసారి క్రీగంట పెట్టెలోని ప్యాసింజర్స్‌ని గమనించి ఎవ్వరూ తన్ని గమనించటంలేదని తెలుసుకున్నాక గుండె ల్లోని సగం భారాన్ని రైలుపెట్టెలోనే వదిలేసి దిగిపోయిం దామె.

దాదాపు యిరవయి నిమిషాల్లో ఆ యింటిని కనుక్కో గలిగింది.

తలుపు తట్టింది.

లోపల కూర్చొని టేబిల్‌పై తెల్లని కాగితాలు పరచి, సిరాతో వాటిపై నల్లని అక్షరాల్ని పేరుస్తూ వాక్యాలుగా కూరుస్తూ మస్తిష్కంలో తను రాస్తోన్న కథ తాలూకు ఆలోచనల్ని రేసుగుర్రంలా పరిగెత్తిస్తోన్న శారద చేతి లోని కలం తక్కున ఆగిపోయింది. మస్తిష్కం కరెంట్ పోయిన బల్బులా మారిపోయింది.

టైమ్ చూసింది. పదకొండున్నర! భర్త కాదు. మరెవరయివుంటారు?

ఎక్కువగా ఆలోచించలేదామె. లేచి బద్ధకంగా వళ్ళు విరుచుకొని తలుపు తీసింది. అంతే....

కీచుమన్న కేక అప్రయత్నంగా ఆమె నోటి నుండి వెలువడింది.

"శ్యామలా! నువ్వా!!?" అంటూనే ఆమెని అమాంతం ఎత్తుకొని గాల్లో గిరగిరా తిప్పేసింది, అంతులేని ఆనందంతో.

శ్యామల అనాధాశ్రమంలో వున్నప్పుడు—అంటే—దాదాపు రెండేళ్ళ క్రితం....అనాధల గురించి. అనాధ శరణాలయం గురించి తెలుసుకోవటానికి వచ్చింది శారద. ముఖ్య వివరాలు మాత్రం ఆశ్రమం అధికారులు చెప్పి, పూర్తి వివరాలు అందించే బాధ్యత, శారద బాగోగులు—ఆమె అక్కడున్నన్నాళ్ళూ చూసుకునే బాధ్యత శ్యామల కప్పగించారు. తను వ్రాస్తోన్న నవల కొరకు అనాధ శరణాలయం వివరాలు తెల్సుకోవటాని కొచ్చిన శారద శ్యామల గదిలో నాలుగురోజు లుండిపోయింది.

శారద వ్యక్తిత్వం శ్యామలకి బాగా నచ్చటంతో నాలుగురోజుల్లోనే ఆమెకి ప్రాణస్నేహితురాలై పోయింది. ఆ తర్వాత కూడ ఆమెకి ఉత్తరాలు వ్రాస్తూ శారదతో తన స్నేహాన్ని మరింత పటిష్టం చేసుకుంది.

ఆప్యాయంగా ఆమెని యింట్లోకి లాక్కుపోయి కుర్చీలో కూలేసింది శారద.

"ఏమిటి విశేషాలు? ఉరుములేని పిడుగులా వూడిపడ్డావ్? ఉద్యోగం బాగా నచ్చిందా, జీవితభాగస్వామిని ఎన్నుకున్నావా? ఆశ్రమంలో అందరూ బాగున్నారా?

అరెరె....చిటికినవ్రేలికి ఆ కష్టేమిటి?" గబగబా ప్రశ్నల వర్షం కురిపించింది శారద.

*　　　　*　　　　*

"అదీ కథ. ఈ విషయం ఏ మాత్రం బైటపడినా నాకు ఉరిశిక్షో యావజ్జీవ కారాగారశిక్షో తప్పదు. కాని నేను బ్రతకాలి. నా కోసం కాదు. నా సుఖాలకోసం కాదు. నా గతమేమిటో తెలియని నన్ను చేరదీసి పెంచి విద్య నేర్పి సమాజంలో వదిలిపెట్టింది నా ఆశ్రమం. దాదాపు పద్ధెనిమిది సంవత్సరాలు నాకు ఆశ్రయమిచ్చిన ఆశ్రమం ఆశయం నెరవేర్చటంకోసం నేను బ్రతికితీరాలి శారదా! నా కున్న-కాదు-నా కబ్బిన సంస్కారాన్ని చదువుని పదిమందికి నేర్పాలి. అందుకే నీకు ఏ రంగం అంటే యిష్టం అని ఆశ్రమంవారు ప్రశ్నించినప్పుడు విద్యారంగం అని బదులు చెప్పాను. వారి దయతో ఆ స్కూల్లో టీచర్‌గా చేరి చిన్నారి భావిపౌరులకి వెలుగుబాట వేస్తున్నాను. నేను పట్టుబడితే బ్రతికున్నా మరణించినట్టే లెక్క.

"అందుకే ఆ క్షణంలో ఏం చెయ్యటానికీ పాలుపోలేదు. శవాన్ని రెండు ఫర్లాంగులు ఈడ్చుకుంటూపోవటానికి నాకు శక్తి చాలదు. పైగా యమకింకరుడికి మల్లే ఆ ముసలి ముష్టాడు అక్కడే తిష్ట వేశాడు.

"చావుధైర్యం వచ్చింది. పాత సామాన్లలో వున్న రంపాన్ని తీశాను. రెండు గంటలసేపు చేతులు నెప్పెట్టేలా శ్రమించి శవాన్ని ఏడు ఖండాలుగా కోశాను అబ్బా! ఆ దృశ్యం తల్చుకుంటే యిప్పటికీ వణుకు పుడుతోంది. ఉరిమితే ఉలిక్కిపడే శ్యామలేనా యింత పని చేసింది అన్పిస్తుంది.

"అంతలో బంగాళాఖాతంలో వాయుగుండం పుణ్యమాని ఈదురుగాలి కాస్త వర్షపు చినుకులుగా మారింది! కాసేపయ్యాక మరోసారి కిటికీలోంచి తొంగిచూశాను. ముసలాడు కన్పించలేదు.

"నెమ్మదిగా ఒక్కో ఖండాన్నీ గోనెసంచిలో వేసి రెండు ఫర్లాంగులు నడిచి మురుక్కాలవలో వేస్తూ మొత్తం ఏడుసార్లు తిరిగి మొత్తంమీద బరువు దింపుకున్నాను, వర్షంలో పూర్తిగా తడిసిపోయాను. ఇంట్లోకి వెళ్ళి మరొసారి స్నానం చేశాను. కుడిచేతి చిటికెన వ్రేలికి ఎప్పుడు ఎలా గాయమైందో-రక్తం కారుతోంది. కర్చీఫ్ చించి కట్టు కట్టేశాను. యిదంతా పూర్తయ్యేసరికి రాత్రి రెండైంది.

"నిద్ర పోదామని యెంత బలవంతంగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. అసహనంగా మంచంపై దొర్లుతూ తెల్లవార్లూ గడిపాను. ఆ వాతావరణం నుండి కనీసం నాల్రోజులు దూరంగ పోవాలి. నా కెవరున్నారు చెప్పు!? ఆపద్బాంధవిలా నువ్వు గుర్తుకొచ్చావు. అంతే-రైలెక్కేశాను....'' అంది శ్యామల నుదుటిపైని చెమటని కర్చీఫ్‌తో అద్దుకుంటూ.

చాల సేపు గంభీరంగా చూస్తూ వుండిపోయింది శారద.

"ఏమిటి శారదా అలా శూన్యంలోకి చూస్తున్నావు? నేను చేసింది తప్పంటావా!....'' దీనంగా అంది శ్యామల.

"నువ్వా వ్యక్తిని చంపినప్పుడు కేకలు వేశాడా?''

"ఆఁ....చిన్నగా. కాని గది దాటి విన్పించివుంటా యనుకోను.''

"ఆ తర్వాత గదంతా సర్దావా?"

"హాలో అతన్ని చంపాను. అతికష్టమ్మీద వంటింట్లోకి లాక్కుపోయాను."

"గది ఎలా సర్దావు అని అడుగుతున్నాను."

"గదిలో అతనికి సంబంధించినవన్నీ తగలబెట్టేశాను. నీళ్ళు పోసి గదంతా రెండు మూడుసార్లు కడిగాను. చిన్న చెంచా దగ్గర్నుండి అన్నీ శుభ్రంచేసి వేలిముద్రలు పడకుండా తుడిచిపెట్టాను. వంటయిల్లుకూడ నీట్‌గా సర్దాను. గదిలో అగరొత్తులు వెలిగించాను. యిక్కడికి బయల్దేరే ముందు కూడ నేను సంచరించిన స్పాట్స్ అన్నీ శుభ్రంగా తుడిచాను. యింతకంటే యేం చేయాలి?" అంది శ్యామల.

"అదే నువ్వు చేసిన తప్పు పని" గంభీరంగా అంది శారద.

ఉలిక్కిపడింది శ్యామల. "ఏమిటి?" అంది.

"శ్యామలా! తప్పుడు సాక్ష్యం చెప్పటం నేరం చేసిన దానికన్నా పెద్ద నేరం. అలాగే హత్య చెయ్యటం ఎంత నేరమో నేరస్థుణ్ని దాచిపెట్టడం కూడ అంత నేరమే! అఫ్‌కోర్స్ - నువ్వు నా స్నేహితురాలివి కావచ్చు. భగవంతుని దయవల్ల నేరం నీ పైకి రాకుండా వుండి పోలీసులు నిన్ను అన్వేషిస్తూ రాపోతే నీ యిష్టం వచ్చినంత కాలం యిక్కడ వుండిపోవచ్చు. అందుకు వ్యతిరేకంగా జరిగితే మాత్రం - నువ్వు నన్ను క్షమించాలి."

శారదలో శ్యామలకి నచ్చే గుణాల్లో యిదొకటి. నిష్కర్షగా మాట్లాడ్డం.

ఆమోద యోగ్యంగా గంభీరంగా తలూపింది శ్యామల.

"పద - నర్సింగ్‌హోమ్‌కి వెళదాం. వ్రేలికి బ్యాండేజ్."

"ఇదేం పెద్ద గాయంకాదు. కాఫీపొడి వేసి...."

"కాఫీపొడి ఆంటీ సెప్టిక్ కాదు. ముందు చెప్పులు వేసుకో...." గంభీరంగా అంది శారద.

## 6

"ప్రసాద్‌కి శత్రువులెవరూ లేరు. అతను మంచి చిత్రకారుడు. అతనికి డైరీ వ్రాసే అలవాటు లేదు. కాలేజీలో ఎవ్వరూ అతనికి సంబంధించిన వివరాలు అందించటంలేదు. యింతవరకూ అతని ఆచూకీ తెలీలేదు. అతనికి వనితా కాన్వెంట్‌లో పనిచేసే శ్యామల అనే టీచరుతో స్నేహం వుంది. నాలుగు రోజులుగా ఆమె స్కూలుకు రావటంలేదు. రంగనాథం రోజూ వచ్చి పోతున్నాడు. ఏం చెయ్యటానికీ పాలుబోవటంలేదు. కాస్త నువ్వు హెల్ప్‌చెయ్యాలి గురూ!" అన్నాడు ఇన్స్‌పెక్టర్ అజయ్.

సిగరెట్ తాగుతూ గంభీరంగా ఆలోచిస్తూ వుండి పోయాడు వరదరాజులు. ఆ తర్వాత అతని పెదవులు విచ్చుకున్నాయి.

"యిలా వెడితే లాభంలేదు. ఓ ఆలోచన చెపుతాను. వెళ్దాం పద...." అన్నాడు వరదరాజులు.

వరదరాజులు వన్ - టవున్ సబ్ ఇన్స్‌పెక్టరు. అతనికి రెండేళ్ళు సర్వీసుంది. ఉద్యోగం రాకముందు అతడు హైదరాబాదులో ఓ ప్రయివేట్ డిటెక్టివ్ వద్ద అసిస్టెంటుగా పనిచేశాడు.

ఇన్స్‌పెక్టర్ అజయ్ రిక్రూట్. మొన్ననే అతనికి ఉద్యోగం వచ్చింది, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో. అతని సర్వీసు కేవలం రెండు మాసాలు మాత్రమే.

వనితా కాన్వెంట్ స్కూల్లో వారికి కావలసిన సమా

చారం లభించింది.

శ్యామల సెలవులో వుందనీ ప్రసాద్ అనే యువకుడు ఆమెని కల్సుకోటానికి వచ్చేవాడనీ మొన్న జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా కాన్వెంట్ స్కూలు ప్రిన్సిపాలు ప్లస్ శ్యామల అభ్యర్థనపై గాంధీ బొమ్మని ఉచితంగా వేసిచ్చాడని, ప్రసాద్ శ్యామల పరస్పరం ప్రేమించు కుంటున్నట్టు కూడ వారి కనుమానం వుందని, శ్యామల అనాధ కావటంతో నా అన్నవారెవ్వరూ ఆమెకి లేక పోవటంతో, కులగోత్రాలు తెలీక పోవటంతో - అవన్నీ తెలిసి కూడ ప్రసాద్ ఆమెపై అభిమానం కురిపిస్తూండ టంతో వాళ్ళదారికి తాము అడ్డురాకూడదన్న సంకల్పంతో ఎవ్వరూ అభ్యంతరం చెప్పలేదని చెబుతూ, నాలుగురోజుల క్రిందట శ్యామల సెలవు చీటీ పంపిందని, సెలవుకారణం అనారోగ్యమని అందులో వ్రాసివుందని చెప్పింది అదే స్కూల్లో టీచర్గా పని చేస్తోన్న సుగుణ అనే అమ్మాయి. అంతేకాదు. ఇన్స్పెక్టర్ల కోరికపై శ్యామల అడ్రస్ కూడ విపులంగా వ్రాసి యిచ్చింది.

ఆ చిరునామా ఆధారంగా శ్యామల యిల్లు వాళ్ళు సులభంగానే కనుక్కున్నారు. తాళం వేసుంది. వాకబు చేశారు. తమకి తెలీదనీ నాలుగిళ్ళు అవతలవున్న యింటి వోనర్ని కలుసుకోమనీ శ్యామల ప్రక్కపోర్షన్ వాళ్ళు సూచించారు.

ఇన్స్పెక్టర్లు కాశీపతిని కల్సుకున్నారు. అతడు మొహం చిట్లించాడు, ఇన్స్పెక్టర్లను చూడగానే.

"కాశీపతిగారూ! ప్రసాద్ దాదాపు నాలుగైదు రోజులుగా కన్పించటంలేదని వాళ్ళ నాన్నగారు రిపోర్టిచ్చారు. అతడు

మంచి కళాకారుడు. దర్యాప్తులో అతడికీ శ్యామలగారికీ పరిచయమూ స్నేహమూ వుందని ధృవపడింది. ప్రేమ కూడ వుండొచ్చని అనుమానం వచ్చింది. ఆమెని కలిస్తే అతన్ని గురించిన సమాచారం లభించవచ్చని ఆశతో వచ్చాము.'' అన్నాడు వరదరాజులు.

ఆ మాటలతో కాస్త శాంతించాడు కాశీపతి.

"చెప్పండి. శ్యామలకోసం ప్రసాద్ ఇక్కడికి వస్తూండే వాడా?''

"వస్తూండే వాడు''

"వాళ్ళిద్దరి పరిచయం ఎలాంటిది?''

"స్వచ్ఛమైనది.''

"కాస్త వివరంగా చెప్పండి'' అజయ్ అన్నాడు.

"ఎప్పుడు వచ్చినా పగటిపూటే వచ్చేవాడు. లోకాభిరామాయణం మాట్లాడేవాడు. ఓసారి వాళ్ళిద్దరూ వుండగా నేను 'రెంట్'కోసం వాళ్ళింటికి వెళ్ళాను. వెనుదిరగబోయాను. శ్యామల వారించింది. నన్ను వెనక్కిపిల్చి అతన్ని పరిచయం చేసింది.''

"అతడు చిత్రకారుడు కదా! ఈ విషయంలో ఆమె ప్రోత్సాహం ఎలా వుండేది?''

"మేగ్జిమమ్. అతన్ని కార్టూనిస్టుగా కూడ తీర్చి దిద్దిందామె. 'యస్.పి సాద్' అనే పేరుతో అతని కార్టూనులు వివిధ వార మాస పత్రికల్లో వచ్చాయి.''

"ఎప్పట్నుండి వాళ్ళ పరిచయం?''

"దాదాపు ఎనిమిది మాసాలు''

"ఎనిమిది మాసాల్లోనే పరిచయం ప్రేమవరకూ సాగిందా?''

"ప్రేమ అంకురించటానికి క్షణం చాలు. అది విస్త రించటానికి దినం చాలు."

"వాళ్ళిద్దరూ కల్సితిరిగే వారా?"

"లేదు...."

"చివరిసారిగా ఆమెని అతన్ని మీరెప్పుడు చూశారు?"

"వారం పదిరోజుల క్రితం. తిరుపతిలో ఆర్ట్ ఎగ్జిబిషన్ జరుగుతోన్న విషయం శ్యామలకి తెల్సింది. ప్రసాద్ కి తెలియ జెయ్యాలనుకుంది. నా సలహాపై అతనికి కాలేజీ అడ్రసుకి ఉత్తరం కూడ వ్రాసింది. అది అందుకొని వచ్చాడు. మళ్ళీ రాలేదు."

"అతను రాలేదా, మీరు చూడలేదా?"

"నేను చూళ్ళేదు."

"యస్ అతని సర్ నేమ్ కాదు. దీన్నిబట్టి 'శ్యామలా ప్రసాద్' అనే పేరుతో అతడు కార్టూన్లు వేస్తున్నాడని అనుకోవచ్చా?"

"అనుకోవటం నేరంకాదు."

"శ్యామలగారు ఏ వూరివాళ్ళారో మీకు తెల్సా?"

"తెలీదు."

"ఆమెకి బంధువులు ఎక్కడున్నారు?"

"ఆమె మనసే ఆమెకి బంధువు. నేను శ్రేయోభి లాషిని. శారద ఆత్మీయురాలు."

"ఆమె ఎవరు?"

"రచయిత్రి"

"ఎక్కడుంటారు?"

"తెలీదు...."

"శ్యామలగారి గురించి ప్రత్యేకంగా ఏమైనా చెప్ప

గలరా?"

"వూరికి వెళ్ళే ముందురోజు ముభావంగా వుండింది. వివరాలడిగితే చెప్పలేదు. తెల్లారేసరికి తాళం వేసుంది. బహుశ ప్రసాద్ రాలేదనే దిగులువల్ల అలా వుందేమో ననుకున్నాను."

"అదికాక - ముభావంగా వుండటానికి ప్రత్యేక కారణం ఏదైనా వూహించగలరా?"

"ముభావంగా నిస్త్రాణగావున్న రోజుకి ముందురోజు నల్లని బురఖా వేసుకున్న యువతి ఆమెవెంట వాళ్ళింట్లోకి వెళ్ళింది."

"ఏ సమయంలో?"

"సాయంత్రం"

"ఆమె మళ్ళీ తిరిగి వెళ్ళటం మీరు చూశారా?"

"లేదు. నేను చూడనంతమాత్రాన ఆమెని గురించి మరోలా చెప్పలేను. ఎందుకంటే నేను ఆమె బాడీగార్డు గాని కాపలాదారుకాని కాదు కదా! కాన్వెంట్ స్కూల్లో కొలీగ్ అయివుండవచ్చు."

"మీ సమక్షంలో ఆమె గది సోదా చెయ్యాలనుంది. దయచేసి అనుమతించండి."

మొదట తటపటాయించాడు కాశీపతి. కాని 'తన సమక్షంలో' అన్నారు గాబట్టి తనవద్దున్న డూప్లికేట్ తాళం చెవి తీసుకురావటానికి లోపలికి వెళ్ళాడు.

"వనితా కాన్వెంట్ స్కూల్లో బురఖా వేసుకునే ముస్లిమ్ యువతి పనిచేస్తోందేమో వాకబు చెయ్యాలి. గుర్తుంచుకో" అన్నాడు వరదరాజులు.

తాళంచెవి తెచ్చాడు కాశీపతి. తాళం తెరిచారు.

హాలులోంచి వంటింటిలోకి అడుగుపెట్టి, అక్కడ మూలకున్న కసవు కుప్పని చూసి ఆశ్చర్యపోయారు ఇన్స్పెక్టర్లిద్దరూ!

చీమలు! ఎర్రచీమలు!! కొన్ని లక్షల ఎర్రచీమలు - చచ్చిపోయి—గుట్టగా పడివున్నాయి!! తెల్లని పొడి లీలగా వాటిని అలముకొనివుంది!!

వరదరాజులు బుర్రలో ఏదో ఆలోచన మెరిసింది. అజయ్‌కీ కాశీపతికీ కొన్ని సూచనలిచ్చి, ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్టు, ఫొటోగ్రాఫర్ కోసం ప్రయత్నాలుచేసే కార్యక్రమానికి సంసిద్ధుడయాడు.

## 7

"గదంతా శుభ్రంగా వుండటం, ఎర్రచీమలు గుట్టలుగా పడివుండటం మాలో అనుమానాన్ని రేకెత్తించింది. ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్టునీ ఫొటోగ్రాఫర్ని పిలిపించాం. గదిలో ఏ చిన్నవస్తువుపైన కూడ వ్రేలిముద్రల్లేవు. సాధారణంగా నిత్యావసర వస్తువుల డబ్బాలు, సీసాలు, అద్దం, అలారం గడియారంలాంటి వస్తువులపై శ్యామల వ్రేలిముద్రలు తప్పనిసరిగా వుండాలి. అవి కూడ చెరిపి వేయబడటంతో అనుమానం బలపడింది.

ఆమె పోర్షన్‌లో ఓ పాత చెక్కపెట్టెలో కొన్ని పాత పరికరాలున్నాయి. వాటిలో రంపం మాత్రం శుభ్రంగా కడుగబడి, తుడువబడివుంది. యింటిలో శ్యామల ఒక్కతే వుంది గాబట్టి దాన్ని శుభ్రంచేసే అవకాశం ఆమెకి మాత్రమేవుంది. కనీసం దానిపైనకూడా వ్రేలిముద్రలు లేవు. మా అనుమానం మరింత బలాన్ని పుంజుకుంది.

"ఆరోజు శ్యామల అనవసరమైన భయాందోళనలు, రాత్రి

అందరూ నిద్రపోయాక్కూడా ఆమె నాలుగైదుసార్లు ఏదో సంచిని పట్టుకొని మురుక్కాలవ దగ్గరికి వెళ్ళిన విషయం కాశీపతి భార్య చూశారట.

"రాత్రంతా లైటువెలగటం, అర్ధాంతరంగా ఆమె సెలవుపెట్టి ఎవ్వరికీ చెప్పకుండా వూరుదాటడం - అంతకు ముందురోజు బురఖా యువతి ఆమెతోకల్సి వాళ్ళింట్లోకి వెళ్ళటం, ఆ వ్యక్తి తిరిగి వెళ్ళటాన్ని ఎవరూ చూడక పోవటం—యివన్నీ ఆధారంగా చేసుకొని మేధస్సుని జోడించి మధిస్తే బురఖా యువతి—ప్రసాదేనని, ఆమె అతన్ని హత్యచేసి శవాన్ని రంపంతో కోసి విడివిడిగా కాలవలో పారేసిందనీ తేలింది. బురఖా వేసుకునే ముస్లిమ్ యువతి వనితా కాన్వెంట్ స్కూల్లో పని చెయ్యట్లేదనీ అసలు అలాంటి యువతితో ఆమెకి పరిచయమేలేదనీ దర్యాప్తులో వెల్లడైంది.

"మరింత డీప్‌గా ఆమె గదిని పరిశోధించాం. మీరు వ్రాసిన వుత్తరాలు కన్పించాయి. యింకెవ్వరూ ఆమెకి వుత్తరాలు వ్రాయలేదు. దాన్నిబట్టి మీరు తప్ప ఆమెకి ఆత్మీయులెవరూ లేరని, ఖచ్చితంగా మీవద్దకే వచ్చివుం టుందని గ్రహించాము. యిల్లు మారుతున్నట్టు తెలియ జేస్తూ ఫ్రమ్ అడ్రస్‌తోసహా యిటీవల మీరు వ్రాసిన లెటర్, ఎక్కువ కష్టపడనక్కరలేకుండా మీయింటికి వచ్చేలా చేసింది. బస్సు దిగ్గానే మీగురించి వాకబుచేస్తే ఆస్పత్రికి వెళ్ళారని ఎదురింటివాళ్ళు చెప్పటంతో నేరుగా యిక్కడికి వచ్చాము."

అన్నాడు వరదరాజులు శారద మొహంలోని భావాలు చూస్తూ.

దీర్ఘంగా నిట్టూర్చింది శారద.

"మీ ఊహ కరెక్టే ఇన్‌స్పెక్టరుగారూ! హత్యచేశాక నేరుగా యిక్కడికొచ్చి నన్ను కల్సింది శ్యామల. అంతా చెప్పింది...."

"చెప్పండి...."

"ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనాలనుకున్నాడు ప్రసాద్. 'స్నిగ్ధ' అనే కేప్షన్‌తో ఓ శృంగార నాయికని చిత్రించా లనుకున్నాడు. మోడల్‌గా శ్యామలని వ్యవహరించమని కోరాడు.

"అతడు చెప్పినవిధంగా వుండటానికి మొదట సిగ్గుతో ఆమె అభ్యంతరం చెప్పింది. తాళికట్టి తనదాన్ని చేసు కునేంతవరకూ కనీసం తనని 'అలా' చూడటానిక్కూడా వీల్లేదని ఖచ్చితంగా చెప్పేసింది.

"కాని అతడు 'ఆర్టు' గురించి అరగంటసేపు ఉపన్యాసం చెప్పాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమెని తాకనని ప్రమాణం చేశాడు. అంతేకాదు. చాక్‌పీసుతో నేలపై వలయంగీచి అందులో ఆమెని వుండమనీ ఆ వలయంలోకి తను అడుగుపెట్టననీ చెప్పినమీదట అతనిపైని ప్రేమతో, చిత్రకళపట్ల అతనికేగాక తనకీ వున్న అభిమానంతో, కాబోయే భార్యనేకదా అన్నభావంతో అంగీకరించింది.

"అయితే, ఓ మగాడు తన ఇంటిలో ఎక్కువసేపు వుండటం, తలుపులు మూసుకొని గడపటంవల్ల సంఘం చేసే విమర్శల్ని దృష్టిలో వుంచుకొని ముస్లిమ్ యువతిలా బురఖావేసుకురమ్మని సూచించింది. అతడు తన పరికరా లన్నీ తెచ్చుకున్నాడు.

మొత్తంమీద అతడు సూచించిన భంగిమలో నగ్నంగా

కూచుంది శ్యామల. ఆర్ట్‌పేపరుపై స్కెచ్ వేసుకున్నాడు ప్రసాద్. కాని ఆ తర్వాత కథ మారిపోయింది.

"వయసుకితగ్గ వర్చస్సు, యవ్వన సంపదలు నగ్నంగా చూసేసరికి అతడి ఒళ్ళు ఉద్రేకంతో వేడెక్కింది. అతడు చేసిన ప్రమాణాలు ఆ వేడిలో కరిగి ఆవిరై పోయాయి. తను గీచిన వలయంలో తనే ప్రవేశించాడు. ఆమెని ఆక్రమించుకోబోయాడు.

"ఎన్నోవిధాల బ్రతిమాలింది శ్యామల. కాని వేడెక్కిన అతని బుర్ర ఆమె అభ్యర్థనల్ని పెడచెవిని పెట్టింది. ఆమె నోటిలో గుడ్డలుకుక్కి మరీ ఆమెని ఆక్రమించు కొన్నాడా రాక్షసుడు.

"ప్రతిఘటించటానికి బలం చాలదు. అరుద్దామంటే నోరులేదు. ఎదుర్కొందామంటే ఆయుధంలేదు. అలాంటి పరిస్థితుల్లో తనని తాను రక్షించుకునే ప్రయత్నంలో ఏం చేస్తుంది ఆడది? వాణ్ణి కడతేర్చి అయినా సరే, తను బయటపడ్డానికి ప్రయత్నిస్తుంది.

"ఏ ఆయుధమూ లేకపోయినా మగాడి శరీరంలో ఒక భాగాన్ని పిడికిటిలో బిగించి, పిడికిలిని సంకోచింపజేస్తే అతడి అధ్యాయం ముగిసిపోతుందని ఆమె శీలంపై కాటుపడిన రెండవ క్షణంలో స్ఫురించిందామెకి. అంతే. యిక ఆలస్యం చెయ్యలేదామె. ఆ తర్వాత జరిగింది మీకు తెల్సు...." శారద కళ్లు రెండు నీటిబిందువుల్ని వర్షించాయి.

"వెల్ మిసెస్ శారదా. ఆమెని అరెస్ట్ చెయ్యాల్సి వచ్చినా మానసంరక్షణార్థం చేసిన ప్రయత్నంలో జరిగిన దారుణం గాబట్టి శిక్ష తక్కువపడేలా చెయ్యగలము...."

"ఆమెకి శిక్ష భగవంతుడే వేశా డిన్స్పెక్టర్‌గారూ! చిటికెన వ్రేలి గాయం ఆమె ఆయుర్దాయాన్ని హత్యచేసింది. త్రుప్పుపట్టిన రంపం కోసుకోవటంతో, ఆమె దాన్ని మామూలు గాయంగా పరిగణించి కేర్‌లెస్ చెయ్యటంతో అది ధనుర్వాతానికి దారితీసింది."

"ధనుర్వాతం!? యూ మీన్ టెటనస్!?"

"యస్....దట్టూ - ఇన్ క్రానిక్ మోడ్!!" భారంగా అంది శారద.

"పదండి ఆమెని చూద్దాం...."

వార్డుకేసి దారితీశారు ముగ్గురూ.

డాక్టరు ఎదురొచ్చాడు.

"సారీ మిసెస్ శారదా! ఎంత ప్రయత్నించినా శ్యామలని రక్షించలేకపోయాం" అన్నాడు తలదించుకొని. □

---

## యువకవి?



# బ్లడ్ సక్కర్

## శివరామ్

ఉదయం ఎనిమిది గంటలయింది.

'ట్రింగ్ ట్రింగ్' మంటూ ఫోన్ మ్రోగింది.

రిసీవర్ అందుకున్నాను. అవతలివయిపు రెడ్డి.

మామూలే: హత్య జరిగిందట. వర్కింగ్ ఉమెన్స్

హాస్టల్ ప్రక్కనట. అర్జంట్‌గా రమ్మని కబురు - తాపీగా చెబుతున్నాడు రెడ్డి.

"ప్చ్" అంటూ నిట్టూర్చాను. ఏమిటో! రాను రాను జీవితం నిర్లిప్తంగా తయారవుతున్నది. హత్యలు, మాన భంగాలు - పరిష్కరించటం, కేసులు పెట్టడం........"

తల గట్టిగా విదిలించాను.

బ్రహ్మచారి జీవితానికి ఇది మామూలే....అనుకొంటూ వెస్పా దగ్గరికి నడిచాను.

"హలో! యంగ్ బాండ్‌గారూ!"

అంటూ వినిపించిందో పిలుపు.

వెనక్కి తిరిగి చూసాను.

సంకీర్తి. పక్కింట్లో వుంటున్న కాలేజీ లెక్చరర్. చిరునవ్వుతో,

"హలో!"

అన్నాను తల పంకిస్తూ.

"మళ్ళీ....హత్యా కేసా?"

నవ్వుతూ అడుగుతున్న ఆమె వేపు దీక్షగా చూసాను.

ఈవిడ చేరింది ఈ మధ్యనే మా పక్కింట్లో. ఐనా టి. వి. చూడాలనో, నేను పరిష్కరించిన కేసుల గురించి వినాలనో - ఏదో వంకతో వచ్చి పలకరించి పోతూ ఉంటుంది అప్పుడప్పుడూ 'జేమ్సుబాండ్'గారూ అంటూ చనువు తీసుకొంటుంది.

నా కసలే ఆడవాళ్ళతో మాటాడటం అంటే - అదే 'చిట్ చాట్' బాతాఖానీ అంటే పడదు. మౌనంగా ముందుకు నడిచి వెస్పా తీసుకొని బయలుదేరాను వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ వైపు.

# 2

నే నక్కడికి చేరేసరికి స్పాట్ కనుక్కోవడానికి వీలుగా అన్నట్టు జనం గుమిగూడి ఉన్నారు. వారి నంద రినీ తప్పించుకొంటూ లోనికి నడిచాను.

"గుడ్‌మార్నింగ్ సర్!"

అంటూ విష్ చేసిన కాన్‌స్టేబుల్‌తో 'మార్నింగ్' అంటూ అలవాటుగా ఇల్లంతా పరీక్షగా చూసాను.

ఓ చిన్న రూమ్ - అదే బెడ్‌రూమ్ ప్లస్ డ్రాయింగ్ రూమ్ కమ్ గెస్ట్ రూమన్న మాట. ప్రక్కనే ఓ చిన్న వంట గది. అటాచ్‌డ్ బాత్‌రూమ్, వెనక పెరడు అనేది లేకుండా ఉమెన్స్ హాస్టల్ గోడ.

నను చూడగానే రెడ్డి,

"చాలా దారుణంగా మర్డర్ చేయబడింది గురూ! దానితోపాటే రేప్ కూడా...." అన్నాడు.

అప్పుడు చూసాను శవాన్ని.

మంచం మీద నగ్నంగా పడి ఉంది. కాళ్ళు చేతులు మంచానికి కట్టివేశారు. నోట్లో గుడ్డలు కుక్కబడి వున్నాయి. రేప్‌కు గురయినట్టు బుగ్గలమీద గాట్లు.

వంగి మోకాళ్ళమీద కూర్చుని పరీక్షగా చూసాను. శరీరమంతటా ఏదో జంతువు కొరికినట్టు గాట్లు కన్పిస్తు న్నాయి. పండ్లగాట్లు కావవి.

ఏదో జంతువు గాట్లే అవి. కొంపదీసి బ్రిటీషువాళ్ళు చంపినట్టు ఎలుకల్ని వదిలిపెట్టి చంపలేదుగా....నా ఆలో చనలు అర్థమయినట్టు తల అడ్డంగా ఆడించాడు రెడ్డి.

"లేదు బ్రదర్! అవి ఎలుకలు చేసినవి కావు. వాటి గాట్లు పెద్దవిగానే వుంటాయి. బాగా చూడు...."

తీక్షణంగా చూసాను.

కట్టుకట్టే! అవి ఎలుక గాట్లు కావు. చర్మాన్ని కొద్ది కొద్దిగా కొరికినట్టు ఉంది. కళ్ళు భయంతో తెరుచుకుని ఉన్నాయి. పిడికిళ్ళు బిగించబడి ఉన్నాయి గట్టిగా. తల ఎత్తి చూసాను ప్రక్కకి.

అప్పుడు కన్పించాయి అవి.

ఎర్రటి నెత్తురుతో భయంకరంగా వ్రాయబడ్డ అక్షరాలు.

"కెవె టిస్ వెస్పకోలార్."

పరీక్షగా చూసాను. రక్తంతో రాయబడ్డా అందంగానే ఉన్నాయా అక్షరాలు. ఎంత ఆలోచించినా దాని అర్థం ఏమిటో నాకు తెలియలేదు.

అంతలో—

"కల్పనా!" అని పెద్దగా కేక విన్పించింది.

తిరిగి చూద్దును కదా! ఓ పాతికేళ్ళ అమ్మాయి ద్వారం దగ్గర కుప్పకూలి ఉంది.

చటుక్కున లేచి నిలబడ్డాను.

కానిస్టేబుల్ తెచ్చిన వాటర్ చల్లగానే ఓ ఐదు నిమిషాల తర్వాత తేరుకుందా అమ్మాయి. రెండు చేతులతో మొఖం కప్పుకొని బిగ్గరగా రోదించసాగింది.

"కల్పనా! కల్పనా!" అంటూ గుండె తరుక్కుపోయేలా ఏడుపు.

నేను ప్రక్కనున్న ఓ గదివయిపు నడిచాను. అక్కడున్నవారు నన్ను చూడగానే భయంతో కళ్లు పెద్దవి చేసారు. అందరూ అమ్మాయిలే!

"చూడండమ్మా! కల్పన చావు మీ కందరికీ బాధను

కల్పించవచ్చు. భయం పుట్టించవచ్చు - సహజమే! కానీ ఏం జరిగిందో ఉన్నది ఉన్నట్టు మీకు తెలిసింది చెబితే హంతకుణ్ని తేలిగ్గా పట్టుకోవచ్చు."

అంటూ అందరివంక పరీక్షగా చూసాను.

నా మాటలు వారిమీద బాగా పని చేసినట్టున్నాయి. కళ్ళల్లోకి కాంతి కొద్దిగా తోసుకవచ్చింది.

"అడగండీ!" అన్నారంతా కోరస్‌గా.

"అలా కాదు! అందర్ని ఒక్కసారి ప్రశ్నించటం కష్టం. మీరు సహకరిస్తే...."

అంటూ రూమ్ లోపలికి చూసాను.

అర్థమైనట్టు ప్రక్కకి తప్పుకున్నారందరూ. వెళ్ళి గదిలో కూర్చున్నాను.

ఇంతలో రెడ్డి వచ్చాడు. ప్రక్కనే పెయింటయిన అమ్మాయి.

"రండి! మీరు వుండేది...."

అంటూ ప్రారంభించాను. ఒకేసారి అన్ని అడక్కుండా నెమ్మదిగా సంభాషణ ప్రారంభించడం మంచిదని నా అభిప్రాయం.

"ఈ రూమ్‌లోనే ఉండేది...."

"ఐసీ! కల్పనా, మీరూ రూమ్‌మేట్లు కాదన్నమాట!"

"ఊహు! క్లోజ్ ఫ్రండ్స్. కల్పనా ఎంత ధైర్యవంతురాలంటే - మగపిల్లలనే ఏడిపించేది. అటువంటిది...."

నీళ్ళు తిరిగాయి ఆమె కంటిలో.

"ప్లీజ్! బీకూల్! కల్పన, రాత్రి మీ కెన్ని గంటలకి కన్పించిందో చెప్పగలరా?"

కన్నీళ్ళు తుడుచుకుం దా అమ్మాయి.

"మామూలుగానే మేం ఇద్దరం కల్సి పండుకుంటాం. నాకు వంటగది అంటూ లేకపోవడంతో....కల్పన రూమ్‌లోనే అన్నీను. మీల్స్ కాగానే, నేను రూమ్‌కి వచ్చేసాను. కల్పన ఎంత క్లోజ్ ఫ్రెండో....అంత రిజర్వ్‌డ్ కూడా....బ్యాంక్ ఎంప్లాయ్ కనుక ఒక్కతే యిల్లు మెయింటైన్ చేస్తున్నది."

"అలాగా! మరి....మీరు?" అర్థోక్తిలో ఆగాను.

"నేను ప్రయివేట్ ఫరమ్‌లో పని చేస్తున్నానండి! ఒంటరిగా వుండటం కల్పన కిష్టం. కనుక తన రూమ్‌లో ఎవర్నీ వుంచుకోలేదు తోడుగా కూడా."

"ఐసీ! రాత్రి మీరు మీల్సు చేసారు. ఆ తర్వాత...."

"గుడ్‌నైట్ చెప్పి వచ్చేసాను. రేపు కలుద్దాం అనేసి పుస్తకం అందుకొని మంచం మీద పడుకుంది. ఇప్పుడు చూస్తే........"

కంఠం గాద్గదికంగా మారింది.

"చూడండి! మిస్...."

"నా పేరు చంద్రలేఖ."

"చంద్రలేఖగారూ! కల్పన ఈ మధ్య మొండిగా ఉండటం కాని, భయపడుతున్నట్టుకానీ....కన్పించిందా?"

తల అడ్డంగా ఊపింది చంద్రలేఖ.

"లేదు. అటువంటి దేమన్నా వుంటే నాకు తప్పకుండా చెప్పేది. అదీగాక ఆవిడకు పరిచయాలు కూడా తక్కువే!"

"సర్లేండి. ఇక మీరు వెళ్ళి మీ రూమ్మేట్సును ఎవరినన్నా పంపండి!"

అంటూ రెడ్డి వయిపు తిరిగి,

"రెడ్డీ! నువ్వెళ్ళి జరగాల్సిన కార్యక్రమం చూడు!

నేను వీళ్ళతో మాటాడుతాను."

"అలాగే గురూ!" అంటూ లేచి నిలబడ్డాడు రెడ్డి.

రెడ్డి వెళ్ళగానే ఓ అమ్మాయి లోని కొచ్చింది.

ఛార్మింగ్ పర్సనాల్టి.

"నమస్తే! నా పేరు శశికళ! చంద్రలేఖ రూమ్మేటుని."

"నమస్తే....మీ రూమ్ ఇదేనా?"

"ఇదే! బయట వున్నవారంతా ఉమెన్స్ హాస్టలర్స్. మాకు రూమ్ దొరక్క ఇక్కడ చేరాం...." అంది.

"శశికళగారూ! కల్పన మీద మీ అభిప్రాయం ఏమిటో..." ఓరగా మాస్తూ సిగరెట్ తీసి వెలిగించాను.

"తనతో నే నస్సలు మాట్లాడనండీ! మహా తనే బ్యాంక్ ఎంప్లాయ్ అయినట్టు భలే టెక్కు. కానీ ఏ మాట కా మాటే చెప్పాలి. హెల్పింగ్ నేచర్ చాల ఎక్కువ. ఆవిడ లేకపోతే చంద్రలేఖ సంపాదనకి హైదరాబాదులో ఉండటమే...." ఆశ్చర్యంగా అంటున్నట్టు అంది.

చిన్నగా నవ్వుకొన్నాను.

ఆడవాళ్ళకి ఈర్ష్య చాలా ఎక్కువ.

మగవాడ్ని "గురూ! ఈ షర్ట్ ఎలా ఉందంటే...." సాధ్యమైనంతవరకూ "బాగుందని" కాంప్లిమెంట్ ఇస్తాడు. అదే ఆడవాళ్ళని "ఈ చీర జాకెట్ ఎలా ఉందంటే...." ఖచ్చితంగా "చీర అంచుకు, జాకెట్ అంచుకు మ్యాచ్ అయితే బావుండేది" అని కామెంట్ చేస్తారు.

ఆలోచనలనుంచి తేరుకొంటూ,

"ఆఁ! శశికళగారూ! రాత్రి మీరెన్నిగంటలకి పడుకొన్నారో?" గట్టిగా దమ్ములాగుతూ అడిగాను.

"నాకు నవల్లంటే మహా పిచ్చండీ! మల్లాది నవల చదువుతూ నిద్రపోయాను. తెల్లవారి చూస్తే .... కేకలు విన్పడ్డాయి. పరిగెత్తుకెళ్ళితే....కల్పన....ప్చ్!" అంటూ నిట్టూర్చింది.

"శవాన్ని ముందెవరు చూసారు?"

"పాలవాడు. ఆయన కేకలే మమ్మల్ని నిద్రలేపింది."

"ఎన్ని గంటలకు?"

"సుమారు అరున్నరకు అనుకొంటాను."

"సరే! మీ రెళ్ళిరండి!"

అనగానే ఆవిడ వెళ్ళిపోయింది.

మిగతావార్ని 'ఎంక్వయిరీ' చేస్తే పనికొచ్చే ఇన్ఫర్మేషన్ ఏమీ అందలేదు. అందర్ని పంపేసి. కల్పన రూమ్ వైపు నడిచాను.

వర్క్ మొత్తం కంప్లీట్ చేసి, శవాన్ని పంపేసిన రెడ్డి ఎదురొచ్చాడు.

"ఏమన్నా 'క్లూ' దొరికిందా?"

ఆత్రంగా అడిగాడు.

నిస్పృహగా తలాడించి,

"పద! పోదాం!"

అంటూ వెస్పా దగ్గరకు నడిచాను.

"రెడ్డీ! పోస్టుమార్టమ్ రిపోర్ట్ వస్తుందిగా అప్పుడు 'ప్రొసీడ్' అవుదాం, ముందుకు...."అంటూ స్టేషన్ వైపు వెస్పా తిప్పాను.

## 4

ఓ రెండు గంటల తర్వాత—

స్టేషన్ లో కూర్చునివున్న మాకు కల్పన పోస్టుమార్టమ్

రిపోర్టు అందింది.

రేప్ జరిగిందని. ప్రాణంమటుకు భయంవల్లనే పోయిం దని-రిపోర్టు చెపుతోంది.

"సో! రెడ్డీ! మరి ఆ గాట్లు...."

అర్ధోక్తిగా ఆగాను.

"దాన్ని గురించి వ్రాసారు గురూ? ఎలుక లాంటి జంతువు కావచ్చునని అభిప్రాయం. కానీ, చావుకుమటుకు కారణం ఆ గాట్లు కాదు. అలానే అక్కడక్కడ శరీరం చీరి వుందని, నైన్టీ పర్సెంట్ ఆ గాట్లు ఏదో పాకుడు జంతువుదనీ-వ్రాశారు."

విసుగ్గా చూశాను రెడ్డిపంక.

"డామిట్! ఆ జంతువు పేరేదో తెలిస్తే బావుం డేదిగా...."

"ఎందుకు గురూ! ప్రాణం పోయింది భయంవలన, 11 గం॥ల ప్రాంతంలో. పోలీస్‌కుక్కల్ని ఉపయోగించే వీలు లేదు, అక్కడున్నవారంతా 'గజిబిజి' చేసారు కనుక. వేలిముద్రలు కూడా లేవు...."

పురాణం చెప్పుకొచ్చినట్టు చెప్పుకొచ్చాడు రెడ్డి.

"అన్నట్టు రెడ్డీ! చంద్రలేఖ ప్రాణస్నేహితురాలు కదా? మన ముందే ఫెయింటై కూడా పడిపోయింది. మరి శవాన్ని ఉదయం నుండి చూడలేదా?" పాయింటెడ్‌గా అడిగాను.

సాలోచనగా చూశాడు రెడ్డి.

"కరెక్టే! కానీ....పని చేసేది ప్రైవేట్ ఫరమ్‌లో కదా! యెక్కడన్నా ట్యూషన్ చెప్పడానికి వెళ్ళి ఉండొచ్చుగా!"

నిజమేనన్నట్టు తలూపాను.

"ఎనివే రెడ్డీ! ఈ హత్యకి కారణం విఫలమైన ప్రేమే...."

"కావచ్చు! కాకపోవచ్చు!...." అంటూ ఆగి, రెడ్డి, "కారణం ఏదైనా హంతకుడు హంతకుడేగా...."

చిన్నగా నవ్వి,

"నిజమేలే! ఆవిడ పని చేసే బ్యాంక్ స్టాఫ్‌ని కదిలిద్దామా?" అంటూ లేచాను.

నా వెనుకనే వస్తున్న రెడ్డి ఫోన్ మ్రోగడంతో ఆగి రిసీవర్ అందుకొన్నాడు.

ఫోన్‌లో అవతలి మాటలు వినగానే అతని ముఖం పాలిపోయింది.

"ఇదేంటి గురూ! ఒకే రోజు ఇద్దరమ్మాయిల హత్య....చిక్కడపల్లిలోనట....అక్కడి ఎస్.ఐ. రమ్మంటున్నాడు సాయానికి!....పద" అంటూ కదిలాడు.

ఇద్దరి వాహనాలు చిక్కడపల్లి వైపు దూసుకుపోయాయి.

## 5

చిక్కడపల్లి చౌరస్తా దగ్గరికి చేరగానే కానిస్టేబుల్ ఎదురొచ్చాడు.

"రండి సార్! ఈ సందులోనే హత్య జరిగింది" అంటూ ఫస్ట్‌లైన్‌లోకి తీసికెళ్ళాడు.

ఆ ఇల్లు చూడగానే స్టన్ అయ్యాను. ఆ ఇంటి ప్రక్కన 'లేడీస్ హాస్టల్" ఉంది.

రెడ్డి నా వైపు చూశాడు.

తల పంకిస్తూ ముందుకు నడిచాను.

నా అనుమానం నిజమే అయితే, ఈ అమ్మాయి కూడా వర్కింగ్ ఉమెన్ అయివుండాలి. కల్పన ఫ్రెండ్ అయివుండాలి కూడా....

లోపలి గదిలోకి చూడగానే ఉలిక్కిపడ్డాను. కల్పన ఎలా హత్య చేయబడివుందో....సేమ్! అలానే పడి వుంది. నగ్నశరీరం మీద ఏదో జంతువు కొరికినట్లు గాట్లు.

"కెలోటిస్ వెర్సికోలార్"

రక్తంతో రాసిన అక్షరాలు!

కీచుగా అర్చాడు రెడ్డి.

చకచకా చుట్టుప్రక్కల విచారించాను. ఆ అమ్మాయి పేరు నిర్మల. ఏదో ప్రైవేట్ ఫరమ్‌లో క్లర్క్‌గా వర్క్ చేస్తున్నది. చాలా ధైర్యం గల పిల్ల. ఒంటరిగా ఉంటు న్నది.

ఏం చేయాలో అర్థంకాలేదు.

అసలా పదాలకు అర్థం ఏమిటి? వాటిని డీకోడ్ చేసి చూసినా ఏమీ తెలియలేదు.

హంతకుడు అలా వ్రాయడానికి కారణం ఏమిటి?

ఆలోచనలతో తల పగిలిపోతున్నట్టు ఫీలింగ్.

శవాన్ని మార్చ్యురీకి పంపేక ఆ రిపోర్టు కూడా అందింది.

ఒకటే మేటర్!

స్టేషన్‌లో కూర్చునివున్న రెడ్డి నావైపు నిస్పృహగా చూసాడు.

"ఏంటి గురూ! యీ రాత లేంది? యీ హత్య లేంది?...."

జవాబు చెప్పలేదు.

"రెడ్డీ! తర్వాత కలుస్తాను" అనేసి, ఆఫీసుకు వచ్చేసాను.

# 6

ఆఫీసుకు వచ్చానే గానీ, యేం చేయాలో అర్థం కాలేదు.

హత్యలకు మోటివ్ 'పగ' అని తెలుస్తోంది. ఎందుకంటే హత్య జరిగిన చోట యెక్కడా దొంగతనం జరగ లేదు.

పోనీ, రేప్ చేయబడ్డారు కనుక 'సెక్స్' కారణం అనుకొంటే. వాళ్ళిద్దరూ స్నేహితులు కావడమే కాకుండా, వర్కింగ్ ఉమెన్స్ హాస్టలుండేది సికింద్రాబాద్ దగ్గరైతే, నిర్మలుండేది చిక్కడపల్లిలో.

కనుక 'సెక్స్' కూడా కారణం కాదు.

తీక్షణంగా ఆలోచిస్తూ, లాన్‌లోకి నడిచాను. అక్కడున్న కుర్చీలో కూలబడుతూ, సిగరెట్ వెలిగించాను.

సిగరెట్ వెంట సిగరెట్ కాలుస్తున్నానే గానీ, ఏం స్ట్రైయిక్ కావటంలేదు.

ప్రక్కనున్న చామంతుల కుండీ నిండా సిగరెట్ పీకలు.

"హలో! బాండ్‌గారూ! ఎందుకండీ ఆ 'క్రైసాంథిమమ్ ఇండికమ్'ను అలా చంపుతారు."

అంటూ వచ్చింది సంకీర్తి.

ఉలిక్కిపడ్డాను ఆ మాటతో.

"ఏవిటేవిటి? ఈ చామంతి నేమన్నారు?"

విచిత్రంగా చూసింది.

"మామూలేగా! చామంతికున్న శాస్త్రీయనామం అది.

క్రైం జాంతిమమ్ ఇండికమ్ అని. ఎందు కంత కంగారు:"

నా గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

"మరి....కెలోటిస్ వెర్సికోలార్? అంటే...."

చిన్నగా నవ్వింది.

"తొండల శాస్త్రీయనామం అది. దాన్ని 'బ్లడ్ సక్కర్' అని కూడా అంటారు. ఎందుకో?"

సంకీర్తి మాటలు నాకు వినపడలేదు.

ఆలోచనలు పరుగులు తీసాయి.

చటుక్కున లేచి, ఇమ్మీడియట్‌గా ఫోన్ అందు కొన్నాను.

"హలో! రెడ్డేనా?"

"ఆహా! నేనే గురూ! ఏమిటంత కంగారు నీ గొంతులో...." నవ్వుతూ అడిగాడు.

"రెడ్డీ! కల్పనా. నిర్మలలు ఎక్కడచదివారో కనుక్కో. అర్జెంట్. తెల్సింతరువాత అక్కడి కెళ్ళి....ఎందుకూ టైమ్ వేస్ట్! చంద్రలేఖని కలువ్! ఆమె ద్వారా కల్పన, నిర్మలలు ఎవరికన్నా 'కెలోటిస్ వెర్సికోలార్' అన్న నిక్ నేమ్ పెట్టారో కనుక్కో."

చకచక 'ఆర్డర్స్' పాస్ చేసాను.

"ఇదంతా....ఎందుకు"

మధ్యలోనే అడిగాడు రెడ్డి.

"డూ ఇట్ ఫస్ట్. తర్వాత చెబుతాను" అంటూ కుర్చీలో జారగిలబడి సిగరెట్ వెలిగించి గాటుగా పీల్చాను.

"ఏమిటండీ? ఏమిటి ఇదంతా....?"

అంటున్న సంకీర్తికి బదులు చెప్పకుండా రెడ్డి ఫోన్ కాల్ కోసం ఎదురుచూడసాగాను.

ఓ అర్ధగంట తర్వాత రెడ్డి దగ్గిర్నుంచి ఫోన్ వచ్చింది.

"గురూ! వాళ్ళు చదివింది హైద్రాబాద్‌లోనేనట. కో ఎడ్యుకేషన్ కాలేజీలో...."

"రైటో! వెంటనే వాళ్ళ బ్యాచిలో ఉండే మగపిల్లల పేర్లు సేకరించు. వాళ్ళలో ఎవరికన్నా కెలోటిస్ వెర్సికోలార్ అనే నిక్‌నేమ్ ఉందా కనుక్కో! ఉంటే వాడే హంతకుడు...."

చకచక చెప్పాను.

బదులు చెప్పకుండా ఫోన్ పెట్టేసా డతను.

ఆ మాత్రం 'క్లూ' చా లతనికి. హంతకుడ్ని పడతా డని నమ్మకం ఉంది నాకు.

తెల్లమొఖం వేసుకొని వున్న సంకీర్తికి వివరంగా చెప్పసాగాను.

విప్పారిన నేత్రాలతో వింటున్న సంకీర్తి ఉండగానే రెడ్డి వచ్చాడు.

"నీ అంచనా ఫలించింది గురూ! కేశవ్ అనే వ్యక్తికి వాళ్ళు....ఆ పేరు పెట్టి, ఏడిపించేవారట. అతను వీళ్ళ అల్లరి భరించలేక చదువు మానేసాడట. ఆ తర్వాత అవకాశం దొరకగానే కక్ష తీర్చుకొన్నాడు—"

అంటూ కుర్చీలో వెనక్కు వాలుతూ, "ఓ తొండను తీసుకొచ్చి వాళ్ళ శరీరంమీద వదిలాడట. చెబుతూంటే శరీరం జలదరించింది. హారిబుల్ కదూ! అన్నట్టు.... ఇంతకీ నీకెలా వచ్చిం దా ఆలోచన...."

నవ్వుతూ సంకీర్తి వైపు చూసాను.

"ఇదిగో! ఈ సైన్స్ లెక్చరర్ చెప్పారు. లేకుంటే తల బద్దలు కొట్టుకొనే వాళ్ళం...."

రెడ్డి ఆవిడవైపు చూసి,

"థ్యాంక్సండీ! మీ వలన కేసు పరిష్కరించాం అన్న తృప్తికంటే, ఓ క్రూయల్ ఫెలోని, కేవలం అల్లరి చేసినంత మాత్రాన హత్య చేసేంత డేంజరస్ ఫెలోని పట్టుకోగలిగాం అన్న ఆనందం కల్గుతోంది".

అంటున్న రెడ్డి మాటలు, నా ప్రశంస పూర్వక చూపులు భరించలేక లేచి, తన ఇంటివైపు దూసుకెళ్ళింది సంకీర్తి.

ఆవిడ వెళ్ళినవైపు తృప్తిగా చూస్తూ, సిగరెట్ వెల్గించాను. □

---

రక్షణా?

# [illegible] ఇల్లు

[illegible]

అతను ఆ ఇంటిముందుకు వొచ్చి నిలబడ్డాడు. ఇంటి తలుపులు మూసి వున్నాయి. అక్కడే నిలబడి ఆత్రంగా ఒక్కసారిగా ఆ ఇంటిని ప్రేమగా చూశాడు. ఇంటి నెంబరు కోసం అతను శ్రమపడవలసిన అవసరం కలగ లేదు. గుమ్మానికి పక్కగా గోడమీద ఏడు అంకె నల్లటి

రంగుతో కనపడుతూనే వుంది.

అవును. అదే ఇల్లనుకున్నాడు. ఆ ఇల్లు ఎటువంటి మార్పు లేకుండా వుండిపోయింది కాబట్టి అతను పోల్చుకో గలిగాడు. అతనికి ఆ వీధిని గుర్తుపట్టటమే కష్టమయ్యింది. నిజమే. ఎప్పుడో పన్నెండేళ్ళ క్రితం ఆ వీధిలో వున్నాడతను. ఈ పన్నెండేళ్ళలో ఆ వీధి వూహించలేనంతగా మారిపోయింది.

చేతిలో వున్న సిగరెట్టును గోడ పక్కనే ప్రవహిస్తున్న మురిక్కాలువలోకి విసిరాడతను. కర్చీఫ్‌తో ఒకసారి మొహాన్ని తుడుచుకుని గేటు తెరుచుకుని తలుపుల దగ్గరకు వెళ్ళాడు.

కాలింగ్‌బెల్లు నొక్కుతున్నప్పుడు అతని గుండెలో అలజడి మొదలయ్యింది.

అదృష్టరేఖ తలుపులు తెరిచి తనని ఆహ్వానిస్తుందా? అనుకున్నాడు.

రెండు నిముషాలకు తలుపులు తెరిచి "ఎవరుకావాలి?" అనడిగిం దామె.

వెంటనే ఏమీ చెప్పలేక పోయాడు అతను. ఆలోచిస్తూ ఆమె మొహంలోకి చూశాడు. యాభైయేళ్ళు దాటిన వయసులో వుందామె.

"చెప్పరేం? ఎవరికోసం?" మళ్ళీ అడిగింది.

"ఈ ఇంట్లో వుంటున్నాయన పేరు?" అడిగాడు.

"గోవర్ధనరావుగారు" చెప్పిందామె.

"అవును. ఆయన్ని కలుసుకుని మాట్లాడాలి"

ఆమె "లోపలకు రండి" అంటూ వెళ్ళిపోయింది.

ముందు గదిలోకి అడుగుపెట్టాడు. అతనికి ఏదోలా అనిపించింది.

రెండు కుర్చీలు, ఒక బల్ల వున్నాయి. గోడలకు ఎప్పటివో చాలా పాత కేలండర్లు దుమ్ము కొట్టుకుని వున్నాయి.

అతను కూర్చోలేదు. ముందు గదిని చూస్తున్నాడు. అంతా గుర్తుచేసుకుంటూ నిలబడ్డాడు.

తను ఆ ఇంట్లో వున్నాడు. పన్నెండేళ్ళ క్రితం—

ఒకాయన వొచ్చి "గోవర్ధనరావు నేనే" అన్నాడు.

"నా పేరు శ్రీనివాస్" అన్నా డతను.

"కూర్చోండి" అన్నాడు గోవర్ధనరావు. ఆయన జుట్టు పూర్తిగా తెల్లబడిపోయింది. బుగ్గలు లోపలకు పీక్కుపోయాయి. అరవైయేళ్ళు దాటుతున్నాయి. తెల్లటి పంచె కట్టుకుని లాల్చీ వేసుకున్నాడు.

"చెప్పండి....ఎవరుమీరు?" అడిగా డాయన.

"మీరు ఈ ఇంట్లో అద్దెకు వుంటున్నారా?" అడిగాడు శ్రీనివాస్.

ఆయన ఆశ్చర్యపడి తర్వాత నవ్వి "లేదు. ఈ ఇంటి యజమానిని నేనే" అన్నాడు.

"ఎన్నేళ్ళక్రితం మీరు ఈ ఇల్లు కొన్నారు?" మళ్ళీ అడిగా డతను.

ఈసారి ఆయన నవ్వలేదు.

"ఎందుకివన్నీ అడుగుతున్నారు?" అనడిగాడు శ్రీనివాస్‌ను అనుమానంగా చూస్తూ....

"చెబుతాను. నే నొక ఇల్లు కొనాలనుకుంటున్నాను. ఏదో నెంబరు ఇల్లును అమ్ముతారని ఎవరో చెప్పారు. వచ్చాను" అన్నాడు శ్రీనివాస్.

"ఆశ్చర్యంగా వుంది. ఎనిమిదేళ్ళక్రితం నేను ఈ ఇంటిని కొన్నాను. కొన్నాళ్ళలో నేను రిటైరవుతాననీ

ఇక్కడే స్థిరపడిపోవాలనీ ఈ ఇల్లు కొన్నాను. అమ్మే ఉద్దేశం నాకులేదు. మీ కెవరో అబద్ధం చెప్పారు."

"ఆల్‌రైట్....వాళ్ళు అబద్ధం చెప్పివుండొచ్చు... ఇప్పుడు నేను అడుగుతున్నాను. ఈ ఇంటిని మీరు నాకు అమ్ముతారా?" అనడిగాడు శ్రీనివాస్....

"సారీ....నాకా ఉద్దేశంలేదు. కావాలంటే ఇంతకంటే మంచి ఇల్లు ఒకటి అమ్మకానికివుంది—ఈ వెనక వీధి లోనే నా స్నేహితుడి ఇల్లు....అతను దాన్ని అమ్మా లనుకుంటున్నాడు" చెప్పాడు గోవర్ధనరావు....

"నిజం చెప్పమంటారా?" వున్నట్టుండి అడిగాడు శ్రీనివాస్.

"ఏమిటి?"

"నాకు ఈ ఇల్లేకావాలి... మీరు ఈ ఇంటిని ఎంతకు కొన్నారో చెప్పండి....ఆ రేటుమీద పదిహేనువేలు ఎక్కువ ఇస్తాను. ఇంకా కావాలంటే అడగండి."

గోవర్ధనరావు కుతూహలంగా ముందుకు వొంగి "ఈ ఇంటిమీద మీకున్న ఇంట్రస్టు ఏమిటి?" అన్నాడు.

"సెంటిమెంటు" అన్నా డతను.

"సెంటిమెంటా!"

"అవును. పన్నెండేళ్ళక్రితం ఈ ఇంట్లో నేను అద్దెకు వున్నాను. అప్పుడు నాకు భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. బిజినెస్ చేస్తూ వుండేవాడిని. బాగా సంపాదించాను. ఇంకా సంపాదించాలనే ఆశ పుట్టింది. ఇక్కడి వ్యాపారం వదిలి ఒక్కడినే నైజీరియా వెళ్ళాను. నా భార్యనీ పిల్లల్నీ నా అత్తగారింటిలో వుంచాను. నైజీరియాకు వెళ్ళిన సంవత్సరానికి నా భార్యపిల్లలు ఒక యాక్సి డెంటులో చచ్చిపోయినట్టు నాకు కబురొచ్చింది. అంతే.

తిరిగి ఇక్కడికి రాకూడదని అక్కడే వుండిపోయాను. పదిరోజుల క్రితం ఈ దేశంలో తిరిగి అడుగుపెట్టాను. అప్పుడే ఈ ఇంటిని కొనటానికి నిశ్చయించుకున్నాను."

శ్రీనివాస్ ఆపగానే "అవును - నిజంగానే వెంటి మెంటు....నాకు చాలా బాధగావుంది. ఇప్పుడు మీరు ఒంటరిగా మిగిలిపోయారు. అవునా!" అన్నాడు గోవర్ధన రావు.

తలూపాడు శ్రీనివాస్....మళ్ళీ ఇలా అన్నాడు:

"ఈ ఇంటిలో వున్నప్పుడు నే నెంతో సుఖంగా సంతోషంగా వున్నాను. నా భార్యపిల్లలతో ఆనందంగా గడిపాను. బిజినెస్‌లో కూడా బాగా కలిసొచ్చింది. అప్పుడే ఈ ఇంటిని కొనాలనుకున్నాను. నైజీరియాదేశం వెళుతున్న కారణంగా కొనలేకపోయాను. ఇప్పుడు ఈ ఇంటిలోవుండి నేను పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకోవాలనుకుంటున్నాను. ఇక నాకు మిగిలింది అవే కదా?"

"వెరీపిటీ....ఈ ఇంటితో నాకూ కొంత బంధం పెరిగిపోయింది. అంతేకాదు. ఈ ఇల్లు అమ్మవలసిన అవసరం కూడా నాకు లేదు. మీకోరిక తీర్చలేకపోతున్నందుకు ఐయామ్ సారీ" అన్నా డాయన.

నిరాశగా ఆయన కళ్ళలోకి చూశాడు శ్రీనివాస్. ఆ చూపును భరించలేక తల పక్కకు తిప్పుకున్నాడు గోవర్ధనరావు.

"ఆల్‌రైట్ ....ఈ ఇంటిలోవుండే అవకాశం నాకు లేదు. ఎంతో ఆశతో వచ్చాను. కనీసం ఒక్కసారి ఈ ఇంటిలో తిరిగే అవకాశం ఇస్తారా?"

"తప్పకుండా....రండి" అని నిలబడ్డాడు ఆయన.

శ్రీనివాస్ లేచి ఆయన వెనుకే లోపలకు వెళ్లాడు.

వరుసగా చూస్తూ "ఈ ఇంటిలో మార్పేమీ లేదు" అన్నా డతను.

"నిజమే. మార్పులు చెయ్యాల్సిన అవసరం నాకేమీ కనపడలేదు" అన్నాడు గోవర్ధనరావు.

హాలుకు పక్కనేవున్న గదిలోకి రాగానే శ్రీనివాస్ గుండె వేగంగా కొట్టుకుంది. ఒక్కసారిగా భరించ లేనంత టెన్షన్‌కు లోనయ్యాడు. అవును. ఇదే గది— అనుకున్నాడు మనసులో....గోడలకు బిగించిన బీరువా తలుపుకువున్న అద్దంలో అతని రూపం కనపడింది. అతని ఆలోచనలు పన్నెండేళ్ళ వెనక్కు పరుగెత్తాయి.

కిచెన్‌లో గోవర్ధనరావు భార్య కనబడింది.

ఆయన శ్రీనివాస్‌కు ఇల్లంతా ఎందుకు చూపుతున్నాడో ఆమెకు తెలీదు.

మళ్ళీ ముందుగదిలోకి వచ్చారు ఇద్దరూ.

"థాంక్స్ ఎలాట్" అన్నాడు శ్రీనివాస్ వెళ్ళటానికి సిద్ధపడుతూ....

"ఈ వూళ్ళోనేవుంటే ఎప్పుడయినా వస్తూ వుండండి. ఐయామ్ సారీ" అన్నాడు గోవర్ధనరావు అతనికి షేక్ హాండిస్తూ.

బయటకు వచ్చాడు శ్రీనివాస్. రోడ్ మీదకు వచ్చి ఒక్కసారి వెనక్కు తిరిగి చూశాడు. అతనికి గోడమీద నల్లటి రంగుతో వేసిన ఏదో నెంబర్ కనపడింది.

## 2

హోటలు గదిలో కూర్చుని సిగరెట్ కాలుస్తున్నాడు అహోబలం. అతని అసలు పేరు అదే. గోవర్ధనరావుతో

తన పేరు శ్రీనివాస్ అని అబద్ధం చెప్పాడు.

పదహారేళ్ళ క్రితం అహోబలం పేరు ప్రజల్లో కొంత సంచలనాన్ని కలిగించింది. అతడితోపాటు భూర్‌మల్ జుయెలరీ షాపులో దొంగతనం చేసిన జాన్సన్ పేరుకు అంతగా పబ్లిసిటీ లభించలేదు.

అహోబలం - జాన్సన్ కలిసి భూర్‌మల్ జుయెలరీ షాపులో ఒకే ఒక్క వజ్రాన్ని కొట్టేశారు. దొంగతనం జరిగిన రెండో రోజు రాత్రి జాన్సన్ ఒక మోటార్‌కారు యాక్సిడెంట్‌లో ప్రాణాన్ని పోగొట్టుకున్నాడు. అప్పటికే అహోబలం లక్షన్నర ఖరీదుచేసే ఆ వజ్రాన్ని తను వుంటున్న ఏడో నెంబర్ ఇంట్లో హాలు పక్కనే వున్న గది గోడలో వుంచి సిమెంట్‌పూత వేశాడు.

అప్పటికే ఎన్నో దొంగతనం కేసుల్లో పోలీసు రికార్డులలో ఎక్కివున్న అహోబలాన్ని పోలీసులు పట్టుకోగలిగారు. ఆ వజ్రం గురించిన సమాచారం కోసం అతన్ని ఎన్నో హింసలు పెట్టి చావుకు దగ్గరగా తీసుకువెళ్ళారు. ఐనా అతను చలించలేదు. జాన్సన్ ఆ వజ్రాన్ని కాజేశాడనీ, ఆ దొంగతనంలో తను అతనికి సహకరించాననీ చెప్పాడతను. అందుకు జాన్సన్ తనకు పదివేల రూపాయలిచ్చినట్టుగా అతను ఒప్పుకున్నాడు.

పోలీసులు ఏడో నెంబర్ ఇంటిని సోదా చేశారు. చివరికి వాళ్ళు అహోబలం మాటల్ని నమ్మారు. జాన్సన్ ఆ వజ్రాన్ని ఎక్కడో దాచి ప్రమాదంలో చనిపోయాడని అనుకున్నారు.

ఐతే అహోబలాన్ని వాళ్ళు సులభంగా వదల్లేదు. అతని మీద కొన్ని పాత నేరాలు బనాయించి కోర్టులో

నిలబెట్టారు.

కోర్టు అతనికి పన్నెండేళ్ళ జైలుశిక్ష విధించింది.

లక్షన్నర విలువ చేసే ఆ వజ్రం గురించిన ఆందోళనతోనే శిక్షనంతా గడిపేశాడతను.

జైలుకు వెళ్ళేరోజుకు అతడికి ముప్పయ్యేళ్ళుంటాయి.

జైలునుంచి తిరిగి రాగానే ఆ వజ్రాన్ని తిరిగి సంపాదించి దాన్ని అమ్మి సుఖంగా గడిపేయాలనుకున్నాడు.

అందుకే అతను ఏడో నెంబరు యింటికి వచ్చి గోవర్ధనరావుకు శ్రీనివాస్‌గా పరిచయమయ్యి ఒక కథను చెప్పాడు.

కాని దానివల్ల అతడికి ప్రయోజనం కలగలేదు.

నిజానికి గోవర్ధనరావు ఏడో నెంబరు ఇంటిని అమ్మటానికి ఒప్పుకున్నా దాన్ని కొనటానికి అహోబలం దగ్గర డబ్బు కూడా లేదు. కాని ఆయన ఒప్పుకుంటే తర్వాత విషయం గురించి ఏదో ఒకటి చెయ్యాలనుకున్నాడు.

సిగరెట్టును యాష్‌ట్రేలో నొక్కి ఇంకో సిగరెట్ వెలిగించాడు.

తిరిగి ఏదో ఒక ప్లాన్ వేసి ఏడో నెంబరు ఇంట్లో వున్న వజ్రాన్ని బయటకు తియ్యాలనుకున్నాడు.

ఏం చెయ్యాలి?

ఇప్పుడు ఆ వజ్రం విలువ మూడు లక్షలు వుండొచ్చు. అంత డబ్బుతో మంచివాడుగానే ఏ వ్యాపారం చేసినా హాయిగా బతికే అవకాశం వుంది.

అతడికి కొన్ని నిముషాలకు ఒక ఆలోచన వచ్చింది.

అవును - ఇలా చెయ్యాలి అనుకున్నాడు లైటార్పి పడుకుంటూ.

# 3

తలుపు తెరిచి గోవర్ధనరావు ఆశ్చర్యంగా "మీరేనా!" అన్నాడు.

"క్షమించండి....మళ్ళీ మిమ్మల్ని కలుసుకోక తప్ప లేదు" అన్నాడు అహోబలం.

"కూర్చోండి" అన్నా డాయన.

కూర్చొని "రాత్రంతా నిద్రపట్టలేదు. కళ్ళ ముందు నా భార్య, పిల్లలు ఈ ఇంట్లోనే వున్నట్టు నన్ను కూడా రమ్మని పిలుస్తున్నట్టు అనిపించింది. ఈ సెంటిమెంటును భరించలేకుండా వున్నాను. అందుకే మీతో ఒక విషయం మాట్లాడటానికి వొచ్చాను" అన్నాడు అహోబలం.

గోవర్ధనరావు నవ్వి "మళ్ళీ ఈ యింటిని ఇంకొంచెం ఎక్కువ ఖరీదుకయినా అమ్మమని అడగటానికి వచ్చారా?" అన్నాడు.

"కాదు. ఈ ఇంట్లో కనీసం నాలుగు రోజులయినా గడిపే అవకాశాన్ని నాకు కలిగించండి. అంటే నాలుగు రోజులకు అద్దెకు ఇవ్వండి. అందుకు వెయ్యి రూపాయలు తీసుకోండి" అన్నా డతను.

ఆయన ఆశ్చర్యంగా అహోబలాన్ని చూసి "నాలుగు రోజులకు వెయ్యి రూపాయలా! మైగాడ్!" అన్నాడు కళ్ళు పెద్దవి చేసి.

"అవును. వెయ్యిరూపాయలకంటే నా సెంటిమెంటు నా దృష్టిలో విలువయినది. ప్లీజ్, కాదనకండి...." అంటూ జేబులోనించి వెయ్యిరూపాయలు తీసి ఆయన ముందు బల్లమీద వుంచాడు.

గోవర్ధనరావు మాట్లాడకుండా లేచి నిలబడి "ఇప్పుడే వస్తాను" అంటూ లోపలకు వెళ్ళాడు.

భార్యతో చెప్పటానికి వెళ్ళాడని అనుకున్నాడతను. ఆ ఇంటిని కొనటంకంటే ఇలా అద్దెకు తీసుకునే ఆలోచన వచ్చినందుకు అహోబలం సంతోషపడ్డాడు.

ఆయన తిరిగి వచ్చి "ఆల్ రైట్....కానివ్వండి....మీ సెంటిమెంటును నేనెందుకు కాదనాలి? మీరు రేపు ఉదయం రండి - మా సామాన్లన్నింటినీ స్టోరు రూమ్‌లో వేసి తాళం వేసుకుంటాం. మే మిద్దరం ఈ నాలుగు రోజులూ ఏదయినా హోటల్లో గడుపుతాం" అన్నాడు.

"థాంక్యూ సోమచ్....మీ హోటలుకు అయ్యే ఖర్చు కూడ నేనే భరిస్తాను" అన్నా డతను

"వద్దులెండి....ఇప్పటికే చాలా ఇచ్చారు" అన్నా డాయన.

"ఫర్వాలేదు. మీరు తిరిగి రాగానే ఎంతయ్యిందో చెప్పండి....నేను డబ్బును లక్ష్యపెట్టదల్చుకోలేదు ఈ విషయంలో" అన్నాడు అహోబలం చాలా ఈజీగా.

"నాలుగు రోజులే కాదు మీరు కావాలనుకుంటే ఇంకోరోజు కూడా వుండండి" అని చెప్పాడు గోవర్ధనరావు.

ఆయనకు థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు అహోబలం.

## 4

ఏడో నెంబరు ఇంట్లో హాలు పక్కనే వున్న గదిలో నిలబడి వున్నాడు అహోబలం. ఆ ఇంటి తలుపులన్నీ మూసి వున్నాయి.

అతడి చేతిలో ప్లాస్టిక్ పెట్టె వున్నది. అందులో అతను పన్నెండేళ్ళ క్రితం దాచిపెంచిన విలువైన వజ్రం వుంది. అతడికి సంతోషంతో అరవాలనిపించింది. బలవంతంగా

ఆ కోరికను అణుచుకున్నాడు.

గోడ దగ్గర పూడిపోయిన సిమెంటు ముక్కలు వున్నాయి.

అతడు కొంచెంసేపటికి పెట్టెను జేబులో పెట్టుకుని గోడకు సిమెంటు పూత పూసే ప్రయత్నంలో మునిగి పోయాడు. సున్నం కూడా పూసిన తర్వాత క్రిందపడి వున్న క్యాలెండర్ని తిరిగి అక్కడే తగిలించాడు.

చాలా సులభంగా ఆ వజ్రాన్ని తిరిగి సంపాదించి నందుకు అతను గర్వంగా ఫీలయ్యాడు.

సిగరెట్ వెలిగించి వాచీకేసి చూసుకున్నాడు.

రహస్యంగా వజ్రాలతో వ్యాపారంచేసే రూప్‌చంద్, నగల షాపునుండి ఇంటికి తిరిగి వచ్చివుంటాడని అను కున్నా డతను.

రూప్‌చంద్ ఇంటి ఎడ్రెసును అహోబలం రెండ్రో జుల క్రితమే తెలుసుకున్నాడు.

సిగరెట్టును ఆర్పి యింటికి తాళంవేసి రోడ్డుమీదకు వచ్చాడు.

పదిహేను నిముషాలకు రూప్‌చంద్‌ని కలుసుకున్నాడు ఆటోరిక్షాలో వెళ్ళి....

"రండి....కూర్చోండి" అన్నాడు రూప్‌చంద్. అతడు యువకుడు. ముప్పయేళ్ళు దాటి వుండవు....

"నా పేరు శ్రీనివాస్" అన్నాడు అహోబలం.

"ఏం పనిమీద వచ్చారు?"

మాటాడకుండా జేబులోనించి వజ్రం వున్న పెట్టెను తీసి అతడికిస్తూ "దీన్ని అమ్ముతాను" అన్నాడు.

అతడు దాన్ని ఆశ్చర్యంగా చూశాడు, చాలా పెద్ద వజ్రం. పరీక్ష చెయ్యకుండానే అది అసలైన వజ్రమని

గ్రహించాడు. ఐనా పరీక్ష చేస్తూ "ఈ వజ్రం ఎక్కడిది?" అన్నాడు నవ్వుతూ ...

అహోబలం కూడా నవ్వుతూ "సీక్రెట్. రూప్‌చంద్.... యిలాంటి ప్రశ్నలు నువ్వడక్కూడదు. నీకు అంతా తెలుసు" అన్నాడు.

"అర్థమయ్యింది లెండి" అన్నాడు రూప్‌చంద్.

"నకిలీ వజ్రం కాదు. చాలా రేర్‌గా దొరికేది.... చెప్పు....దీని విలువెంత!" అనడిగాడు అహోబలం.

"లక్షన్నర" చెప్పాడతను.

"చాలా తక్కువ. సగానికి సగం చెప్పావు....మూడు లక్షలకు అమ్ముతాను."

"కష్టం....వజ్రాల బిజినెస్‌లో నేను ఇప్పటికే చాలా నష్టపోయాను. రెండు లక్షలకు మించి నేనివ్వలేను.ఇష్టం లేకపోతే ఇంకెక్కడయినా ఇచ్చుకోండి" అన్నాడు రూప్ చంద్ అతడికిస్తూ....

రెండునిమిషాలు ఆలోచించాడు అహోబలం. తర్వాత "ఆల్‌రైట్....ఒప్పుకుంటున్నాను. డబ్బు పూర్తిగా ఇప్పుడే ఇవ్వాలి" అన్నాడు.

"సాధ్యం కాదు. రేపు సాయంత్రం రండి....బేంక్‌లో డ్రా చేసి తీసుకువస్తాను....వజ్రాన్ని నా దగ్గర వుంచు తాను....నామీద నమ్మకం వుంటే ఇవ్వండి."

"వ్యాపారంలో నాకు కొన్ని నియమాలున్నాయి. రేపు సాయంత్రం ఇక్కడే కలుస్తాను. డబ్బు తీసుకుని వజ్రం ఇచ్చేస్తాను" అన్నాడు అహోబలం నవ్వుతూ.

"అలాగే చేద్దాం....కూర్చుంటారా కొంచెంసేపు, హాట్ డ్రింక్ తీసుకుందాం" అన్నాడు రూప్‌చంద్.

"వద్దు....నా ఆరోగ్యం బాగాలేదు ...వెళతాను."

"ఒక్క నిముషం కూర్చోండి....మన బిజనెస్ పెటి లైన అకేషన్‌లో కూల్‌డ్రింకైనా తీసుకుందాం" అని పక్కనే వున్న గదిలోకి వెళ్ళాడు రూప్‌చంద్.

ఆ గదిలో ఫ్రిజ్ వుంది. దాన్ని తెరిచిన చప్పుడయ్యింది.

హాట్ డ్రింక్ తీసుకోవాలని వున్నా వద్దన్నాడు అహోబలం. వజ్రం దగ్గరవుంది కాబట్టి చాలా జాగ్రత్తగా వుండాలనుకున్నాడు.

రూప్‌చంద్ రెండు కాంపా కోలా సీసాలు తీసుకొచ్చి ఒకటి అహోబలాని కిచ్చాడు.

"ఈ వజ్రాన్ని యింకెవరిదగ్గరైనా అమ్మటానికి చూపించారా?' అనడిగాడు అతన్ని.

"చూపలేదు...మొదటగా యిక్కడికే వచ్చాను" అన్నాడు అహోబలం సీసా కింద పెడుతూ....

ఇంకో నిముషానికి రూప్‌చంద్‌కు చెప్పి ఆ యింట్లో నించి వచ్చేశాడు అతను. రోడ్డు పక్కగా నడవటం మొదలుపెట్టాడు.

తనకేదో జరుగుతున్నదనే ఆలోచన అతడికి వచ్చేసరికే అహోబలం ప్రాణం వదిలేశాడు. సరిగ్గా రూప్‌చంద్ యిచ్చిన కాంపాకోల డ్రింక్ తాగిన యాభై నిముషాలకు అతను ఏడో నెంబరియింట్లో వజ్రాన్ని దాచిన గదిలోనే చచ్చిపోయాడు.

* * *

రూప్‌చంద్, తంబ్రూర్‌మల్ ఫోటో ముందు నిలబడి వున్నాడు ఆ రాత్రి...ఫోటో ఎదురుగా ప్లాస్టిక్

పెట్టెలో వుంచిన వజ్రం వుంది.

అతడు తండ్రి ఫోటోకు యిలా చెప్పాడు:

—పన్నెండేళ్ళ క్రితం మనం పోగొట్టుకొన్న వజ్రాన్ని తిరిగి సంపాదించాను. నిన్ను నాకు దూరంచేసిన వాడ్ని ఈ లోకానికి దూరం చేశాను. వాడికి నే నెవరో తెలీదు. కాని వాడ్ని శ్రీనివాస్‌గా పేరు మార్చుకున్నా నేను గుర్తు పట్టాను. అందుకే తెలివిగా వాడ్ని తప్పించి వజ్రాన్ని తీసుకొచ్చాను. నువ్వే ఆ అహోబిల్ని నా దగ్గిరకు పంపించి వుంటావు. అవునా?—

భూర్‌మల్ జుయెలరీ షాపులో లక్షన్నవిలువైన వజ్రం పోయిన రెండేళ్ళకే భూర్‌మల్ దిగులుతోనే చచ్చిపోయాడు. □

---

## ఆత్మ రక్షణ -



# మహామాన్వితుడు

కె.బి.యస్.కుమార్



నేను సన్న్యాసుల్లో కల్సిపోవాలని నిశ్చయం చేసుకున్నాను.

....వీళ్ళలో రెండు రకాలున్నారు. మొదటిరకం సన్న్యాసులు: వీరు భార్యాపిల్లల్ని కలిగుంటారు. ఉద్యోగమో,

వ్యాపారమో చేస్తుంటారు. అయితే వాళ్ళకి ఆ భార్యా పిల్లలపై శ్రద్ధాశక్తులుండవు. ఉద్యోగ వ్యాపారాలపై గౌరవాభిమానాలుండవు. క్రమశిక్షణ వాళ్ళకి తెలియదు.

అభిమాన సంఘాలంటూనో కల్చరల్ ప్రోగ్రామ్సంటూనో మరేదో పనికిమాలిన పనో పెట్టుకొని ఎటూ గాకుండా అనవసరంగా హొద్దుపుచ్చుతూ వుంటారు.

వీళ్ళు నా దృష్టిలో 'సన్నాసులు!!'

'సన్న్యాసులు' వేరు!! వీళ్ళకి భవబంధాలుండవు.

"....ఎవరు భార్య, ఎవరు పిల్లలు? ఏది యిల్లు, ఏది వాకిలి? మమతా, అనురాగమూ, డబ్బూ, సౌఖ్యమూ, ఆపేక్ష, అంతఃకరణ, క్రోధమూ, రోషమూ, ఆవేశమూ, ఆక్రోశమూ నా కెందుకు నాయనా! సర్వం గురుమయం జగత్! ఓం తత్ సత్!!" అంటూ, దీక్ష తీసుకుని కాషాయాంబరధారిగా ఏ బదరీకో, శివానంద నగర్‌కో వెళ్ళి ముక్కు మూసుకుని జపం చేసుకునేవారు యీ కోవకు చెందినవారు.

ఇదిగో—సరిగ్గా నేను ఈ కోవనే యెంచుకున్నాను.

నాకు భార్య వుంది. ఇల్లుంది, ఉద్యోగముంది, ఆరోగ్యముంది.

సంవత్సరం క్రితమే నాకు వివాహమైంది. అది పెద్దలు నిర్ణయించి చేసిన సంబంధమైనా కళావతి నాకు అనుకూలవతి.

మా నాన్నకి అంతో యింతో ఆస్తి వుంది. మేం ఇద్దరమే అన్నదమ్ములము. నేను పెద్దవాణ్ని. చిన్నవాడు ఎమ్.బి.బి.ఎస్. మూడో సంవత్సరంలో వున్నాడు. మా నాన్నకి ఆరోగ్యం బాగాలేదు. ఏ క్షణంలో ఏమవుతుందోనని ఆస్తిని యిద్దరికీ పంచాడు. ప్రస్తుతం నే నున్న

యిల్లు నాకే వచ్చింది. కొంత పొలంతోబాటు.

ఆరు సంవత్సరాల క్రితమే నా కుద్యోగం వచ్చింది.

చిన్నప్పట్నుండీ అనారోగ్యమన్న మాట యెరగన్నేను.

ఓ సగటు మనిషికి యివన్నీ తప్పనిసరిగా కావాలి. కాని ఇవి మాత్రమే మనిషికి ఆనందాన్నీ సౌఖ్యాన్నీ కలిగించలేవు. మనిషికి మరోటి కూడ కావాలి.

మానసిక ఉల్లాసం!!

ఆ తర్వాత చెప్పుకోదగ్గది-సుఖం!!

ఈ రెండూ కరువయ్యాయి నాకు.

గత రెండు మాసాలుగా కళావతికి వొంట్లో బాగుండటం లేదు. ఏదో జబ్బు. మనిషి బాగానే వుంటుంది. ఉన్నట్టుండి పడిపోతుంది. ఆ సమయంలో ఏదేదో పిచ్చిగా మాటలాడుతుంది. అవి ఫిట్సు కావు. మరేమిటో తెలీ లేదు. గుండెల్లో నెప్పి అంటుంది. ఒకోసారి మెలికలు తిరిగి పడిపోతుంది. కాని అది గుండెజబ్బు కాదు, పదిహే న్రోజులకీ నెలకీ ఓసారి-మాటలాడిందే ప్రతిసారి మాట లాడుతూంటుంది. చేసినపనే మళ్ళీ మళ్ళీ చేస్తూంటుంది. చేసే పనికీ పలికే మాటకీ పొంతన వుండదు.

కాని అది పిచ్చికాదు!!!

నా తమ్ముడు చూశాడు. సరే-వాడు క్షుద్రవెధవనుకుంటే కొమ్ములొచ్చిన డాక్టర్లు సైతం చూశారు. సైకియాట్రిష్టులూ వచ్చారు.

జబ్బేమీ లేదని తేల్చారు.

కళావతి చాల బాధపడింది. నా గుండెల్లో తల దాచుకుని యేడ్చింది. యేడుస్తూ యేడుస్తూ మళ్ళీ పడిపోయింది.

ఆఫీసులో వున్నంతసేపూ నాకు భయంగానే వుంటుంది. కొంపదీసి స్టవ్‌దగ్గిర కూచుని వున్నప్పు డలా పడిపోతే?

ఎంత ప్రమాదం!?

ఓ పనిపిల్లని పెట్టుకుందామని ఎన్నోసార్లు చెప్పి చూశాను. కాని కళావతి అంగీకరించలేదు. తను అలా పడిపోయిన సమయంలో పనిపిల్ల కాస్త కొంపని నిలువు దోపిడీ చేసే ప్రమాదముంది.

అదీ నిజమే!!

తమ్ముడు మెడికల్‌కాలేజీ హాస్టల్లోనే వుంటున్నాడు. వచ్చి వుండమంటే వుండడు.

అనారోగ్యంగావున్న నాన్నని వదిలి అమ్మని రమ్మంటం బాగోదు. ఇద్దర్నీ రమ్మందామనుకుంటే-వాళ్ళు రారు. అదో బాధ సం.

నిన్న నే నాఫీసు నుండి వచ్చేసరికి కళావతి చక్కగా ముస్తాబైంది. నాకు స్వర్గమే ఎదుట నిల్చినట్టయింది.

"ఏమిటి విశేషం?" అడిగాను.

శోభనంనాటి రాత్రి తాలూకు సిగ్గుల్ని పునరావృతం చేసింది.

నా మనసు గాల్లో తేలిపోయింది.

గబగబా బైటికి పరిగెత్తాను. పావు కిలో మల్లె పువ్వులు పర్చేజ్ చేశాను. ఖరీదైన సెంట్‌బాటిల్ కూడ కొన్నాను. నేరుగా ఇంటికివెళ్ళి స్నానంచేశాను వెంటనే.

"సిన్మాకెళదాం...." అంది కళావతి.

"ఛా....ఎందుకూ?" అన్నాను.

నా ఆదేశం ప్రకారం త్వరగా వంట పూర్తికానిచ్చింది. ఏడున్నరకల్లా భోంచేశాం. పడగ్గది అందంగా సర్దింది.

లోషన్ వేసి తుడిచింది.

'తీ-ఇన్ పన్' అగరొత్తులు వెలిగించాను.

పువ్వులు - వాటివాటి స్థానా లలంకరించాయి.

రంభా ఊర్వశీ తిలోత్తమల అంశాలని రంగరించు కుని కళావతి లోపలికి అడుగుపెట్టింది.

నరాలు జివ్వుమన్నాయి. నెమ్మదిగా లేచాను. ఆమెని పొదివి పట్టుకున్నాను.

అంతే.

దభీమని వెనక్కి పడిపోయాను.

కళావతి కళ్ళు ఎరుపుని పులుముకున్నాయి. ముక్కు పుటా లదుర్తున్నాయి. శరీరం చెమటతో తడిసిపోయింది.

ఆమె కళ్ళు విశాలంగా తెర్చింది. కనుగుడ్లు పళ్లెంలో బంతిలా తిరుగుతున్నాయి. పెదాలు అస్పష్టంగా కదులు తున్నాయి. ఆమె మొహం క్రమంగా విషాదంలోకి తిరి గింది. గట్టిగా ఏడ్చింది. కడుపూ గుండే పట్టుకొని విల విలా తన్నుకోసాగింది.

చల్లనీరుపడ్డ వేడిగ్లాసులా అయింది నా హృదయం.

రాత్రంతా బాగా ఆలోచించి, యివాళ పొద్దున్నే—

నేను సన్న్యాసుల్లో కల్సిపోవాలని నిశ్చయం చేసు కున్నాను.

## 2

అన్నం ముద్ద జారి, మళ్ళీ కంచంలోనే పడిపోయింది.

"ఏమిటీ? నువ్వు చెపుతున్నది నిజమా?" అన్నా నాశ్చర్యంగా.

అవునన్నట్టు తలూపింది కళావతి.

ఇటీవలే వెనర్జీ అనే ఒకతను ఊవూరొచ్చి 'హోటల్ అభినేత్రి'లో రూం నెంబరు నూటపదకొండులో మకాం

పేశాట్ట అతడు శక్తిసంపన్నుడు. కొన్ని అతీంద్రియ శక్తు లతనిసద్దున్నాయి. యంత్రాలు వెయ్యగలడు. గ్రహ దోషాల్ని నివారించగలడు. భూతభవిష్యద్వర్తమానాలు చెప్పగలడు. జాతకాలు రాయగలడు. పొలాల్లోగానీ మరెక్కడైనాగానీ - భూమిలో ఎక్కడ నీళ్ళుపడేదీ చెప్ప గలడు. భూతప్రేత పిశాచాల్లో ఏది ఆవహించినా అవ లీలగా వదలగొట్టగలడు.

అన్నిటినీమించి - డాక్టర్లచే సాధ్యంకాక వదలివేయ బడిన అన్నిరకాల రోగాల్నీ కేవలం ప్రకృతివైద్యంతో బాగుచెయ్యగలడు!

"....ఎవరు చెప్పారు నీ కిదంతా?" ప్రశ్నించాను.

"కాత్యాయని...." అంది కళావతి.

కాత్యాయని మా వీధిలోనే వుంది. కాని పరిచయం లేదు. ఆడవాళ్ళతో అనవసర పరిచయాలు నాకు రుచించవు.

"కాత్యాయని భర్తకీ గ్రహచారం సరిగాలేదుట. వెళ్ళి చూపించుకున్నాట్ట. ఆయనో నిమ్మకాయ మంత్రించి యిచ్చి ఆరోజు రాత్రి తలక్రిందపెట్టుకు పడుకోమన్నా డుట. మరురోజు విశేషాలడిగాట్ట.

"ఆరాత్రి కాత్యాయని భర్తకి రెండు పాములు పోట్లాడుకుంటున్నట్లు కల వచ్చిందట. ఆ విషయం విని, మరిన్ని పరీక్షలుచేసి కాత్యాయని భర్తకి నాగదోషం పట్టిందని చెప్పాడట.

"ఆ విషయం నిజమేనట. దాదాపు పదిరోజులక్రితం కాత్యాయని భర్త ఓ నాగుపాము పిల్లని చంపాడుట...." అంది కళావతి.

"ఆ తర్వాతేమైంది?" చందమామలో తాతయ్య కథ ల్లోని మనవడిలా ప్రశ్నించాను.

"నూటఎనిమిది నిమ్మకాయలు తెప్పించుకుని ఓ యంత్రాన్ని తయారుచేసిచ్చాట్ట. ఇప్పుడు కాత్యాయని భర్త బాగున్నాడట" అంది కళావతి.

నా సమస్యకి పరిష్కారం లభించినట్టన్పించింది నాకు.

"ఏమండీ! మొన్నటి మీ ఆవేదన చూశాక నా హృదయం తరుక్కుపోయింది. ఈ పేరుతెలియని జబ్బు నన్ను తినేస్తోంది. మిమ్మల్ని సుఖపెట్టలేకపోతున్నాను. పాడు జన్మ...."

మధ్యలోనే కళావతి నోరు మూశాను.

"....పోనీ మరోపెళ్ళి చేసుకోండి అంటే మాట వినరు. ఇప్పటికైనా నామాట వినండి. కావాలంటే కాగితం రాసిస్తాను. ఆ వచ్చే అమ్మాయిని సవతిలాకాక - చెల్లిలా చూసుకుంటాను. తాళికట్టిన నేరానికి ఏదో - యింత ముద్ద పారేయండి...."

"అయిందా, మాట్లాడాల్సింది యింకా వుందా?" కోపంగా అన్నాను.

కళావతి మాట్లాడలేదు.

"చూడు కళా! నాపేరు శ్రీరామచంద్రమూర్తి కాదు. ఏకపత్నీవ్రతు లందరికీ ఆపేరు వుండాల్సిన పన్లేదు. శారీరక సుఖంకోసం గంగవెర్రులెత్తటానికి నేనేం పశువుని కాను. నువ్వు గొడ్రాలిగానే మిగిలిపోవాలనీ నా వంశం నిర్వంశం కావాలనీ విధి వ్రాతల వుంటే తప్పించటం ఎవరితరమూ కాదు...." అన్నాను గంభీరంగా.

ఎనలేని సంతృప్తి కళావతిని అల్లుకుపోగా - ఆమె నన్ను అల్లుకుపోయింది.

## 3

ఆటోదిగి ఫేర్ చెల్లించి గేటులోంచి కంపౌండులోకి ప్రవేశించాం.

హోటల్ అభినేత్రి మూడంతస్తుల భవనం. ప్రతి ఫ్లోర్ల నూ నూటపదకొండు గదులున్నాయి. గ్రవుండ్ ఫ్లోర్‌లో మొత్తం గదులన్నీ సింగిల్ రూమ్స్! ఫస్టు, సెకెండు ఫ్లోర్సు మొత్తం డబల్ రూమ్స్!!

రూమ్ రెంటు చాల ఖరీదని చెప్పుకుంటారు.

“అస్ట్రాలజిస్టు మిస్టర్ ముఖర్జీ ఏ రూములో వున్నారండీ!?” రిసెప్షన్ దగ్గరకెళ్ళి అడిగాను.

“వారు పేరు బెనర్జీ సార్! నూట పదకొండులో వుంటారు.” చెప్పింది ఆంగ్లో ఇండియన్‌లా కన్పిస్తోన్న రిసెప్షనిస్టు, దారి చూపిస్తూ.

నేరుగా అటుకేసి నడిచాము.

రూమ్ నెంబర్ నూటపదకొండు తలుపులు వారగా వేసివున్నాయి. అంటే - బెనర్జీ లోపలే వున్నారన్న మాట.

కాలింగ్ బెల్ మ్రోగించాను.

సరిగ్గా నిముషం తర్వాత తెరుచుకున్నాయి. అగరొత్తుల పరిమళం గుప్పున ముఖాన్ని సోకింది.

బెనర్జీనిచూసి ఆశ్చర్యపోయాను.

అతని పేరునీ పేరుప్రఖ్యాతుల్ని బట్టి కనీసం నలభై ఏళ్ళకి తక్కువ వుండవనుకున్నాను. నా అంచనా తప్పు.

పాతికేళ్ళకి మించి వుండవు. తెల్లని దేహచ్ఛాయ. శాంత గాంభీర్యాల నొలికించే విశాలమైన ముఖం. కను

బొమలమధ్య సంధ్యావర్ణంలో సింధూరం మెరుస్తోంది. నడుముకి పైభాగాన ఆచ్ఛాదన ఏదీలేదు. ఖరీదైన పట్టు లుంగీ ధరించాడు.

అప్రయత్నంగా చేతులు జోడించాను. నిండుగా పయ్యెద కప్పుకొని తనూ నమస్కరించింది కళావతి.

"లోపలికిరండి...." అన్నాడు బెనర్జీ, స్వచ్ఛమైన తెలుగులో.

లోపలికి నడిచాము. ఖరీదైన అగరొత్తుల వాసన గదంతా వ్యాసించి వుంది. తూర్పువైపున పొడుగాటి బెంచీ వుంది. మధ్యన దాదాపు నాలుగడుగుల ఎత్తున్న భద్రకాళి ఫోటో ఫ్రేమ్ నిలబెట్టబడివుంది. దాని కిరు ప్రక్కలా రకరకాల దేవుళ్ళ, దేవతల ఫోటోలున్నాయి. ఒకవైపున రాగి పళ్ళెరం, చిన్న రాగి కలశం. అందులో రాగి ఉద్ధరేణి వున్నాయి. పటాలన్నిటికీ కుంకుమ దిద్దబడి వుంది. ఓ ప్రక్క గంధంచెక్క, పలక.

ఆయన చూపించిన కుర్చీల్లో కూర్చున్నాము.

ఆయన కుర్చీలో కూచున్నాడు.

బరువుగా నిట్టూర్చి కళావతి విషయమంతా ఏకరువు పెట్టాను.

రెండు క్షణాలపాటు కళ్ళు మూసుకుని ధ్యానమగ్నుడై పోయాడు బెనర్జీ. యిరవై క్షణాల తర్వాత ఆయన కళ్ళు విప్పుకున్నాయి. మొహంలో అదోరకమైన గంభీరత అలముకుంది.

"దాదాపు రెండు మాసాలక్రితం మీరు ఒక మూడు రోడ్ల కూడలిలో రోడ్డుమీద బోల్తాపడ్డారు. బాగా గుర్తుకి తెచ్చుకోండి...."

నే నాశ్చర్యపోయాను. నిజానికి నేను పేరుకి మాత్రమే

ఆ స్తికుణ్ని. నాలో నా స్తికవాదమే అధికం. అయినా అంత త్వరగా బైటపడను.

కాని యిది వింటూంటే నాకు మతిపోతున్నట్టనిపించింది. నాలోని నా స్తికుడు పారిపోతున్నాడేమో ననిపించింది.

బెనర్జీ చెప్పింది నిజమే!

రెణ్నెల్లక్రితం మేమిద్దరం మొదటి ఆట సిన్మాకెళ్ళి వస్తోండగా కళావతి ఏదో రాయిని తట్టుకొని తూలి బోర్లా పడింది. నలుగుర్లో తలవంపులైంది. చాలిమందే చూశారు.

తలవంచుకొని గబగబా ఫర్లాంగుదూరం నడిచి వెళ్ళి రిక్షా ఎక్కి యింటికి వెళ్ళిపోయాం.

యిదంతా బెనర్జీ కెలా తెల్సు? ఇంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నాడు? అతడెవరు? మేమెవరు? ఆ సమయంలో అతనెక్కడున్నాడో! అయినా సరిగ్గా చెప్పగలుగుతున్నాడంటే—?

'అదే నిదర్శనం - అతనిలో అతీంద్రియ శక్తులున్నాయంటానికి' అన్నాడు నాలో బలం పుంజుకుంటోన్న ఆ స్తికుడు.

"చెప్పండి. నిజమేనా!" గట్టిగా అడిగాడు బెనర్జీ.

"అవునండీ" అన్నాను వులిక్కిపడి.

మళ్ళీ ఆయన ధ్యానంలో మునిగిపోయాడు.

దాదాపు ఐదు నిముషాల తర్వాత కళ్ళు తెర్చాడు. కూజాలోని నీళ్ళు గ్లాసుతో తెమ్మన్నాడు.

నేనే తీసుకొచ్చాను. తన చేతిలో పోసుకొని రెండు క్షణాలు కళ్ళుమూసుకొని నా చేతిలో పోశాడు.

"రుచి చూసి ఎలా వున్నాయో మనసులోనే వుంచుకోండి." అన్నాడు. కళావతి కూడ అలాగే చేసి "ఎలా వున్నాయో చెప్పండి." అన్నాడు.

"చేదుగా వున్నాయి" అంది కళావతి.

అదిరి పడ్డాన్నేను. నాకు మామూలుగా వున్న నీళ్లు....

నాలోని ఆస్తికుడు వళ్ళు విరుచుకున్నాడు.

"భద్రకాళి పటం ముందు శక్తితో అభిమంత్రించిన రెండు రకాల వస్తువులున్నాయి. కాస్త దూదిలో రెండూ తీసుకురండి" అన్నాడు నాకేసి చూస్తూ.

వెళ్ళాను. ముదురు నీలంవర్ణంలో సన్నని పలుకులు ఓ గిన్నెలో వున్నాయి. బహుశ అరుదైన ఒక ప్రాంతంలోని ఇసుక అనుకుంటాను. మరో గిన్నెలో చిక్కని ద్రవం వుంది. దాన్ని పోల్చటానికి నా వూహకి ఏదీ అందలేదు. బెనర్జీ చెప్పినట్టుగా తీసుకొచ్చాను.

"మిమ్మల్ని మీరు దిగదీసుకొని నేలపై పారేయండి" అన్నాడు బెనర్జీ.

అలాగే చేశాను.

ఒకటి-రెండు-మూడు-అయిదు-ఎనిమిది-పది.

ఏమీ కాలేదు.

"దాన్ని మీరు తీసుకొని మీ వారు చేసినట్టే చేయండి" అన్నాడు కళావతి వైపు చూస్తూ.

అలాగే చేసింది కళావతి.

ఆశ్చర్యం!!

కళావతి క్రింద పారేసిన నాలుగైదు సెకెన్సులో ఆ దూది చిటపటమన్న శబ్దంతో అంటుకొని మండింది.

మరుక్షణం గ్లాసులోని నీటితో దాన్ని ఆర్పేశాడు బెనర్జీ. గట్టిగా ఏదో మంత్రోచ్చారణ చేశాడు.

నాలోని ఆస్తికుడు వామన మూర్తిలా ఎదిగిపోయాడు.

"పూజచేసి నిమ్మకాయ మంత్రించి యిస్తాను. కాసేపు

మీరు బయట కూర్చోండి దయచేసి'' అన్నాడు బెనర్జీ.

అప్రయత్నంగా తలూపి బైటికి నడిచాను.

# 4

నాలోని నాస్తికుడు మళ్ళీ ప్రాణం పోసుకుంటున్నాడు.

కళావతిని ఎదురుగా కూర్చోబెట్టుకొని బెనర్జీ ఏం చేస్తున్నాడు? నిజంగా పూజ చేస్తున్నాడా లేక నేనూహించనిదీ ఊహించకూడనిదీ ఏదైనా జరుగుతోందా లోపల??

ఆస్తికుడు మందలిస్తున్నాడు.

ఛ....కళావతి బంగారుబొమ్మ. మాది ప్రేమ వివాహం కాదన్నమాటేకాని మాలాంటి అనుకూల దాంపత్యం ప్రేమించి చేసుకున్నవాళ్ళు కూడ అనుభవించలేరు. అలాంటిది నా కళావతిని నేనే అనుమానించటమా?!

బెనర్జీ కూడ పాపం ఎక్కడివాడో ఏమిటో! అతని శక్తుల్ని యిందాక నేను స్వయంగా చూశాను. అతన్ని అనుమానించటమా?

మళ్ళీ నా స్తికుడు పనిచెయ్యసాగాడు.

ఆస్తికుడు బుజ్జగిస్తున్నాడు.

ఈ ఘర్షణ, సంఘర్షణవల్ల నా మస్తిష్కం వేడెక్కనారంభించింది. ఆస్తిక నాస్తిక సంవాదంలో తాత్కాలికంగా నాస్తికుడే గెలుపొందాడు.

ఫలితంగా కీహోల్‌లోంచి తొంగిచూశాను సిగ్గువగైరాలు విడిచి.

పద్మాకారంలో ఓ ముగ్గు వేయబడివుంది. మధ్యలో కళావతి కూర్చొని వుంది, పయ్యెద భుజాల నిండుగా కప్పుకొని.

బెనర్జీ ముగ్గు బయట - అంటే కళావతికి కనీసం

అడుగు దూరంలో - కూర్చొనివున్నాడు. అతని మొహం నైర్మల్యంతో ప్రకాశిస్తోంది. అతని చేతిలో తొమ్మిది నిమ్మకాయలున్నాయి. ఒక్కో నిమ్మకాయనీ ఆమెకేసి చూపిస్తూ దిగదీస్తున్నాడు. తూర్పు పడమర ఉత్తర దక్షిణ దిశలుగా మొహంచేసి కూర్చోమని చెబుతోన్నట్టుగా నా కర్థమవుతోంది.

కళావతి అలాగే చేస్తోంది. అతడు మళ్ళీ దిగదీస్తున్నాడు. మధ్య మధ్యలో ఉలిక్కిపడుతూ తల విదిలిస్తున్నాడు. తన మెడలోని తాయెత్తుని గట్టిగా పట్టుకుంటున్నాడు. అతని మొహం క్రోధంతో అరుణిమ దాలుస్తోంది. మళ్ళీ చల్లబడుతున్నాడు. నుదుటిపై స్వేదబిందువులు మొలకెత్తి తళతళా మెరుస్తున్నాయి.

కాసేపయ్యాక కళావతి లేచి నిలబడింది అతని ఆదేశం ప్రకారం. మళ్ళీ నాలుగు దిక్కులకీ వరసగా మొహం చేస్తూ నిలుచుంది. మళ్ళీ మంత్రోచ్చారణ జరిగింది.

ఈ కార్యక్రమం మొత్తం మీద దాదాపు ముప్పయ్ అయిదు నిమిషాలపాటు కొనసాగింది. ఈ మధ్యకాలంలో బెనర్జీ కళావతి కేసి ఆకలి చూపులు చూడటం కాని వెకిలి చేష్టలు చెయ్యటం కాని కనీసం ఆమెని కొనగోటితో తాకటంకాని చెయ్యలేదు. అతని మొహంలో ఆ నైర్మల్యం అవగింజంతయినా తగ్గుముఖం పట్టలేదు.

తృప్తిగా నిట్టూర్చాను.

తలుపు తెరువమని ఆదేశించినట్టున్నాడు బెనర్జీ.

ముందుకి నడుస్తోంది కళావతి.

చటుక్కున అక్కణ్నుంచి తప్పుకున్నాను తృప్తి నిండిన మనసుతో.

# 5

రెండు చేతులూ జోడించాను వాకిట్లో నిలబడి.

అప్పుడే స్నానం చేసినట్టున్నాడు. పచ్చని శరీరంపై నీటి బిందువులు - తామరాకుపై నీటి చుక్కల్లా మెరుస్తున్నాయి.

ఆయన్ని, ఆ వాతావరణాన్ని చూస్తోంటే ఓ పుణ్య క్షేత్రంలో అడుగు పెట్టినంతగా అనుభూతి కల్గుతోంది.

చిరునవ్వుతో ప్రతినమస్కారం చేస్తూ కూర్చోమన్నట్టుగా సైగ చేశాడు బెనర్జీ.

కూచున్నాను.

"ఎలా వున్నారు మీ ఆవిడగారు?"

"రాత్రి చాలా ప్రశాంతంగా నిద్రపోయింది. తలగడ క్రింద మీరు నిన్న మంత్రించి యిచ్చిన నిమ్మకాయ వుంచుకొని పడుకుంది. తల లేని శరీరం తనకేసి నడుస్తూన్నట్టుగా కల వచ్చిందిట. మీతో చెప్పమన్నది" అన్నాను.

దీర్ఘంగా ఆలోచిస్తూ వుండిపోయాడు బెనర్జీ.

"నిన్న నా పరిస్థితి విపరీతంగా పరిణమించింది. కడుపులో మెలితిప్పుతోన్నట్టుగా బాధ ననుభవించాను. మనసంతా ఏదో గుబులు ఏదో వెలితి - ఏదో అశాంతి. మొత్తం మీద నిన్న రాత్రి ఆందోళనగా గడిచింది. కారణం ఏమై వుంటుందంటారు?" అడిగాను.

కాసేపు నా తలమీద, నుదుటి మీద చెయ్యి పెట్టాడు బెనర్జీ. మరుక్షణం ఆయన మొహంలో రంగులుమారాయి. నా కేసి క్రోధంగా చూశాడు.

"మీరు నిన్న నేను చేసిన పూజని దొంగతనంగా గమనించారు కదూ!" అన్నాడు.

ఉలిక్కిపడ్డాను. దోషిలా తలొంచుకున్నాను.

"దేనికయినా నమ్మకం కావాలి మిస్టర్ ఫణీంద్రా! సమాజంలో రోగులున్నారు కాబట్టి వైద్యులున్నారు. భక్తులున్నారు కాబట్టి దేవుళ్ళున్నారు. లేదా దేవుళ్ళున్నారు కాబట్టి భక్తులున్నారని కూడ అనుకోవచ్చు. దెయ్యా లున్నాయి కాబట్టి మాంత్రికులున్నారు.

వైద్యుణ్ని నమ్మితే రోగులు బాగుపడతారు. దేవుణ్ణి నమ్మితే భక్తులు బాగుపడతారు. మాలాంటివాళ్ళని నమ్మితే మీలాంటివాళ్ళు బాగుపడతారు. ఇది చాల పవిత్రమైన ప్రక్రియ. క్షుద్రవిద్య కాదు. యిందులో నే నేమాత్రం చిత్తశుద్ధిని కోల్పోయినా రక్తం కక్కుకొని ఛస్తాను.

యిప్పటికయినా మించిపోయింది లేదు. నాకే ఫీజులూ చెల్లించాల్సిన పని లేదు. మీరీ క్షణం నుండే...."

"అంతమాటనకండి....ప్లీజ్ నన్ను క్షమించండి. ఇక మీదట ఎప్పుడూ మూర్ఖుడిగా ప్రవర్తించను" అన్నాను బాధగా.

## 9

నేను క్యాంపు నుండి తిరిగొచ్చేసరికి కళావతి ఎదు రొచ్చింది. ఆమె చెప్పిన వార్త విని తలపై బాంబు పడ్డ ట్టులిక్కిపడ్డాను.

"బెనర్జీ - బెనర్జీ హత్య చెయ్యబడ్డాడా?" యింకా ఆశ్చర్యంగానే వుంది నాకు.

"అవును. నిన్న దారుణంగా రక్తం కక్కుకొని చని పోయాట్ట!"

"ఏదో విద్య బెడిసికొట్టి వుంటుంది. రక్తం కక్కు కొని, చచ్చిపోయి వుంటాడు" అన్నాను.

"కాదండీ! మొదట అందరూ అలాగే అనుకున్నారట. కాని తర్వాత పోస్టుమార్టమ్ రిపోర్టులో వెల్లడయిందిట.

ముందుగా తలపై కొట్టి స్పృహ తప్పించి, ఆనక గుండె లపై కాలితో తొక్కారుట. ఉరఃపంజరం ఎముకలు విరిగిపోయాయిట. నోటివెంట రక్తం వచ్చిందిట" అంది కళావతి.

నా మొహంలో ఎన్నో రకాల భావాలు తిరుగాడాయి. "నేను వూరికెళ్ళాక అసలేం జరిగింది? నీ పరిస్థితి యెలా వుంది? ఈ వివరాలు కనుక్కుందామని ఆసక్తిగా వచ్చాను. వెధవ క్యాంపు...."

"ఏముందీ!? మూడు రోజులు వరసగా మనింట్లో పూజలు చేశాడు. అదిగో గోడకున్న మేకుకి కొబ్బరికాయ కాషాయం రంగులో కన్పిస్తోందే! దాన్ని మంత్రించి కట్టాడు. యికపైన అంతా సవ్యంగా జరుగుతుందని చెప్పాడు. ఈ వూళ్ళో మరికొన్ని రోజులుంటాననీ మీ రొచ్చాక కలవమని చెప్పమనీ చెప్పాడు" అంది కళావతి.

"ప్రస్తుతం నీకెలా వుంది?"

"బావున్నాను. యిదుగో! ఈ తాయెత్తు యిచ్చాడు. ఎప్పుడూ దీన్ని తీసేయవద్దని మరీ మరీ చెప్పాడు."

"సర్లే - వెళ్ళి కలిసి వస్తాను...."

"ఎవర్ని!?" ఆశ్చర్యంగా అంది కళావతి.

"పోలీసుల్ని" అన్నాను.

## 7

నేను వెళ్ళేసరికి ఎస్సయ్ వరదరాజులు స్టేషన్లోనే వున్నాడు. విష్ చేసి పరిచయం చేసుకున్నాను.

"మీరా! మీ కోసమే ఎదురుచూస్తున్నాం" అన్నా డాయన.

"చెప్పండి...." అన్నాను సిగరెట్ వెల్గించుకుంటూ,

"హత్య చెయ్యబడటానికి ముందు బెనర్జీ మీ ఇంటికి

వచ్చాడని మా దర్యాప్తులో వెల్లడైంది. ఆ సమయంలో మీరు వూళ్ళోలేరు. ఈ విషయంలో మీరేదైనా మాట్లాడే దుంటే మాట్లాడండి....''

కళావతి జబ్బుగురించి, మేము బెనర్జీని కలుసుకున్న విషయమూ కళావతికి కల రావటమూ అంతా చెప్పి, ''సార్! నా భార్యకి మొండెం నడుస్తున్నట్టుగా కలొచ్చింది. ఆమెని ఓ దుష్టగ్రహం పీడిస్తోందనీ మూడు రోజులు పూజలు చెయ్యాలనీ చెప్పా డాయన.

నాకు సరిగ్గా అదే సమయానికి క్యాంపు వచ్చి పడింది. మా కమర్షియల్ టాక్సెస్ డిపార్టుమెంటే అంత! క్యాంపు అంటే చాలు. వెళ్ళాల్సిందే, వీల్లేదనటానికి వీల్లేదు.

నాకు నా భార్యపైగాని బెనర్జీపైగాని యిద్దరిపైగాని అనుమానంలేదు. కాని అతడు చూడబోతే లాడ్జిలో వున్నాడు. నా భార్యని అక్కడికి పంపటం నా కభ్యంతరం లేకపోయినా లోకుల్ని దృష్టిలో పెట్టుకోవాలి.

అందుచేతనే ఎవ్వరిళ్ళకి రానని బెనర్జీ చెప్పినా వినకుండా ఆయన్ని కాళ్ళా వేళ్ళాపడి అర్థించాను; యింటికి రమ్మని. రోజుకి నూటపదహార్రూపాయలు చొప్పున మూడు రోజులకీ ఛార్జి అవుతుందని చెప్పినా సమ్మతించాను....''

''అయితే మీకు బెనర్జీపై ఎలాటి అనుమానమూ లేదంటారు!'' అన్నాడు వరదరాజులు.

లేదన్నట్లు తలాడించాను. ''ఆయన నిజంగా ఇంద్రియ నిగ్రహం కలవాడు సార్!'' అన్నాను, పేపర్ వెయిట్ని గుండ్రంగా తిప్పుతూ.

''మీ కెన్నాళ్ళనుండి పరిచయం?''

''అబ్బే! నా భార్యకి వింతజబ్బు వచ్చింది. బాధపడు

తోన్న సమయంలో దైవికంగా బెనర్జీ వచ్చినట్టు తెల్సింది. వెళ్ళి పరిచయం చేసుకున్నాం. అదే తొలిసారి పరిచయం."

"మరి అతడు ఇంద్రియ నిగ్రహం కలవాడని ఎలా చెప్పగలరు?" అడిగాడు ఎస్సయ్.

చెప్పక తప్పలేదు - ఆనాడు నేను కీ హోల్లోంచి దొంగ చాటుగా చూసిన సంగతి.

"ఆల్‌రైట్ చనిపోయాడని తెల్సిన వెంటనే స్పాట్‌కి వెళ్ళాం. ప్రాథమిక పరీక్షలోనే 'హత్య' అన్న అనుమానాన్ని వెలిబుచ్చాడు మా డాక్టరు. ఆధారాలకోసం రూమంతా గాలించాము. పెదవి విరచాల్సి వచ్చింది. పోస్టుమార్టమ్ రిపోర్టులో జరిగింది హత్యేనని ధృవపడింది. దర్యాప్తులో అతన్ని సమస్యలకోసం కలుసుకున్న వ్యక్తుల్లో చివరి దంపతులు మీరేనని తెలిసింది. మీ యింటికి వచ్చాము. మీరు లేరని, క్యాంపు వెళ్ళారనీ ఏ వూరో తెలీదనీ వచ్చాక కలవమనీ చెప్పారు మీ వైఫ్. బైది బై - మీరు ఏవూరెళ్ళారు?"

"కొడుమూరు ...."

"ఎలిబీ వుందా?"

వుందన్నట్టు తలూపాను.

వరదరాజులుకి నమ్మకం కలిగినట్టులేదు. నా ఎదురుగానే ట్రంకాల్ బుక్ చేశాడు అక్కడి మా ఆఫీసుకి. రెస్పాన్సువిని, తృప్తిగా నిట్టూర్చాడు.

## 9

నాలుగురోజులు ప్రశాంతంగా గడిచిపోయాయి. ఈ నాలుగురోజుల్లో కళావతిలో ఏలాంటి అవాంఛనీయమైన మార్పూ జరగలేదు. నాలుగురోజుల్లో వరసగా ఆమెలో

రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమల్ని చూశాను. ఆమెతో కల్సి స్వర్గపుటంచుల్లో విహరించాను.

నేను క్యాంపు కెళ్ళేముందు కళావతి సంపూర్ణారోగ్యవంతురాలైతే దంపతులం తిరుపతి వస్తామని కూడ ఆమె ఎదుటే మొక్కుకున్నాను.

ఆ ప్రకారం ప్రయాణమయ్యాం.

కంపార్టుమెంటు చాలా రద్దీగావుంది. నా క్యాంపుల గొడవ కారణంగా రిజర్వేషన్ వద్దన్నాను. ఎప్పుడు ఏ క్షణంలో క్యాంపు వెళ్ళాల్సివస్తుందోనని.

కళావతితో కల్సి నిలబడాలంటే కష్టంగావుంది. తోసుళ్ళలో క్రమంగా డోర్ వద్దకి వచ్చాం.

రైలు వేగంగా పోతోంది. కంపార్టుమెంటులో కొంతె వెధవల అల్లరి ఎక్కువైపోతోంది. ఒకడైతే అదను చూసుకొని కళావతిని అదేపనిగా తాకుతున్నాడు.

చేసేదిలేక ఆమెని నాముందుకి లాక్కున్నాను. 'గట్టిగా పట్టుకో. పడిపోగలవు' అని హెచ్చరించాను.

బాగా చీకటిపడింది. కంపార్టుమెంటులో జనాలు ఒక్కరొక్కరే నిద్రలోకి జారుకుంటున్నారు. మరో అర గంటలో 'గుత్తి' స్టేషను వచ్చేస్తుంది.

అటూ ఇటూ చూశాను. బలంగా కళావతిని బైటికి తోసేశాను.

అదేక్షణంలో ఎవరివో రెండు బలమైన చేతులు— ఒకటి కళావతిని పడిపోకుండా పట్టుకుంది. మరొకటి నా భుజంపై బలంగా పడింది.

అదిరిపడి వెనక్కి తిరిగిచూశాను.

అతడు మారువేషంలో వున్న వరదరాజులని అతను చెప్పేదాకా తెలీలేదు నాకు!

# 9

"బెనర్జీని హత్య ఎందుకు చేశావు? నీ భార్యని హత్య ఎందుకు చెయ్యబోయావు?" గంభీరంగా ప్రశ్నించాడు వరదరాజులు సూటిగా నన్ను చూస్తూ.

"వాళ్ళిద్దరూ ప్రేమికులు గాబట్టి!!" పళ్ళు నూరుతూ చెప్పాను.

"అంటే....?"

"అతని అసలు పేరు దిలీప్. బెనర్జీ అనే పేరుతో అస్ట్రాలజిస్టుగా చేరాడు హోటల్ అభినేత్రిలో. కానీ ఇవన్నీ నాకు తెలీనివ్వకుండా చాల తెలివిగా నాటక మాడింది కళావతి.

మే మిద్దరం తొలిసారిగా బెనర్జీ వద్దకి వెళ్ళినప్పుడు కీ హోల్‌లోంచి నేను గమనించాను. గమనిస్తానని ఊహించి అతడు చాలా పవిత్రుడుగా నటించాడు. నేనూ నమ్మాను....

తలగడ క్రింద నిమ్మకాయ పెట్టుకొని పడుకుంది కళావతి. కాని ఆమెకి సరిగా నిద్ర పట్టలేదు. మధ్య మధ్యలో నన్ను అనేకసార్లు దొంగచాటుగా గమనించటం నేను గమనించాను. నిద్ర నటించాను.

ఆ తర్వాత ఆమె తలగడక్రింది నిమ్మకాయని తీసి ప్రక్కన పెట్టి నిద్రపోయింది. నాలో అనుమానం బయలు దేరింది. మహిమగల నిమ్మకాయ ఎందుకు తీసేసింది? అందులో మహిమ లేదని ఆమెకి తెలిసివుండాలి. అందులో మహిమ లేకపోతే దాన్ని యిచ్చినవాడు మహిమాన్వితుడు కానేరడు.

అలాంటప్పుడు అతనెవరు? పరిశీలనగా కళావతిని

చూశాను.

తలగడక్రింద నిమ్మకాయ అసౌకర్యం అన్పించి, నేను నిద్రపోయానన్న నమ్మకంతో, నా కంటే ముందుగా తనే నిద్ర లేస్తుందన్న ధీమాతో దాన్ని తీసేసి తృప్తిగా నిద్ర పోతుంది.

అయితే ఈ రెండుమాసాల నుండీ సైకియాట్రిస్టుల కూ్కాడ అంతుపట్టని ఈ జబ్బు-కేవలం నటనేనా? నటనే అయ్యే పక్షంలో రెండుమాసాలకి ముందే వీళ్ళిద్దరూ కల్సుకొని పథకం వేసుకొని వుండాలి! ఆ పథకం యేమిటి?

ఆలోచనల్తో నాకు నిద్ర పట్టలేదు. ఏ మాత్రం బైట పడకుండా దీనిని పరిశోధించాలనుకున్నాను. బెనర్జీని పరీ క్షించాలనుకున్నాను ముందుగా.

మర్రోజుదయమే కలిశాను. రాత్రి బాగా అప్సెట్ అయ్యానని చెప్పాను. నిద్రలేమివల్ల ఎర్రబడ్డ కళ్ళనిచూసి నిజమే అని భ్రమించాడు. అలా భ్రమ కలిగించడానికి నేను సహజత్వానికి నూరు శాతం దగ్గర్లో వుండా ల్సొచ్చింది.

అతడు చాల తెలివిగలవాడు. అనుమానం వల్ల గదిలో వున్న తమని నేను గమనించి వుంటానని వూహించాడు. నేను చెప్పిన అబద్ధానికి రెస్పాన్సు వచ్చింది. నేను దొంగ చాటుగా గమనించినందువల్ల దుష్టశక్తి ఎదో నాలో ప్రవే శించినట్టుగా కల్పించాడు.

మా శ్రీమతి-మొండెం నడుస్తూ వచ్చిందని 'కల' సారాంశంగా చెప్పింది. నిమ్మకాయ తీసేసి పడుకుంటే అదెలా సాధ్యం?

ఈ రెంటినీ అన్వయించి చూస్తే యిదేదో గూడుపుఠాణీ అన్పించింది.

అతని 'మహిమల' గురించి పరిశోధించాను. దూదిమండటానికి అతడు పొటాషియమ్ పర్మాంగనేట్, గ్లిజరిన్ వుపయోగించాడు. ఆ రెంటినీ కలిపి రాపిడి కలిగిస్తే మంట త్వరగా పుడుతుంది. నన్ను దిగదీసుకోమని వూరకే చెప్పాడు. నేనలాగే చేశాను. ఆ తర్వాత కళావతినీ అలాగే చెయ్యమన్నప్పుడు ఆమె తనని తాను దిగదీసుకుంటూ దూదిని నలిపింది. రసాయనిక చర్య వేగంగా జరిగి మంట వెంటనే పుట్టింది.

మూడు రోజుల కాంపు మిషతో ఈ వూళ్ళోనే మారు వేషంతో గడిపాను.

అతను మా యింటికి వచ్చాడు. మా వీధిలో రాత్రి ఎనిమిది దాటితే నిశ్శబ్దం అలుముకుంటుంది. ఆ అవకాశాన్ని తీసుకుని మిద్దె ఎక్కి గవాక్షం గుండా గమనించేవాణ్ని.

వాళ్ళ సంభాషణల్ని బట్టి మూడు రోడ్ల కూడలిలో కళావతి ఎప్పుడో బోర్లాపడటాన్ని జోస్యంగా చెప్పటం కేవలం నన్ను నమ్మించటానికేనని, కూజాలోని నీళ్ళు చేదుగా వున్నాయని కళావతి చెప్పటం కేవలం ఓ పథకం ప్రకారమే జరిగిందని గ్రహించాను.

ఆ తర్వాత వాళ్ళిద్దరూ-ఏ భర్తా చూడకూడని విధంగా గడిపారు మా యింట్లో.

అసలు బెనర్జీ అనే పేరుగల అస్ట్రాలజిస్టు వుండటం అబద్ధం. ఇతడు కేవలం కళావతి కోసమే ఈ అవతారం ఎత్తాడు!"

కాసేపాగి-మళ్ళీ ప్రారంభించాను.

"మా వివాహం కాక పూర్వం కళావతి, దిలీప్ ప్రేమించుకున్నారు. కాని దిలీప్ కులం వేరు కావటంతో కళావతి నాన్న అంగీకరించలేదు. కూతుర్ని తీవ్రంగా మందలించాడు. వెంట వెంటనే సంబంధాలు చూశాడు. నేను దొరికాను. వెంటనే ముడివేశాడు.

తండ్రిచాటు కూతురు, సంప్రదాయాలకి వారసురాలు అయిన కళావతి ధైర్యంగా ఎదిరించలేకపోయింది. నా మంచితనానికి కట్టుబడి క్రమంగా అతన్ని మరిచి పోయింది.

మొన్న నవంబర్‌లో జరిగిన జాతీయ సమైక్యతా వారోత్సవాల సందర్భంగా యిక్కడి నెహ్రూ యువక కేంద్రంవారు కార్యక్రమాలు నిర్వహిస్తూండటంతో అక్కడి నెహ్రూ యువకకేంద్రం ఉద్యోగి, కార్యక్రమాల ప్రతినిధిగా ఈ వూరొచ్చాడు. అనుకోకుండా కళావతిని కలుసుకున్నాడు. ఆమెలో మానిన గాయాన్ని మళ్ళీ రేపాడు.

అమాయకురాలు కళావతి వాడి మాటలకి లొంగి పోయింది. అప్పుడు వారు పథకం వేసుకున్నారు.

కళావతి కొత్త జబ్బు నటిస్తుంది. నాకు సుఖాన్ని కరువు చేస్తుంది. నేను నిరాశతో విసుక్కుంటూ వుంటాను. నే నామెకి విడాకులు యిచ్చేలా చేస్తుంది. ఆ తర్వాత వాళ్ళిద్దరూ పెళ్ళాడతారు.

కాని నా తత్వం అందుకు విరుద్ధం. కళావతిని నేను మనఃపూర్వకంగా ప్రేమించాను. విడాకులు, వదలెయ్యటం

లాంటివి కుదరవని చెప్పాను.

కళావతి సందిగ్ధంలో పడింది. ఏం చెయ్యటానికి పాలుపోక-దిలీప్‌కు వుత్తరం వ్రాసింది.

రిప్లయ్ వచ్చింది. అందులో అతడు మహిమాన్వితుడుగా ఈ పూరొచ్చి హోటల్ అభినేత్రిలో దిగుతున్నట్టు వ్రాస్తూ, మరో పథకం వివరించాడు.

ఆమె అలాగే జబ్బు నటిస్తుంది. నేను గాబరాపడతాను. మహిమాన్వితుడు హోటల్లో దిగుతాడు. ఆ విషయం నా చెవిని బడేలా ఆమె చేస్తుంది. యిద్దరం వెళతాం. పరీక్ష చేస్తాడు. రకరకాల ప్రయోగాలు చేస్తాడు. ఆమె సంసార యోగానికి పనికిరాదనీ అసలు మా జాతకాలు సరిపోలేదని విడాకులొక్కటే సరైన మార్గమనీ నన్ను బలవంతంగా ఒప్పిస్తాడు. అప్పటికీ ఒప్పుకోని పక్షంలో - ఆమె సహకరిస్తే-నన్ను హత్యచేస్తాడు!

ఈ ఉత్తరం నాకు ఆమె పెట్టెలో అడుగున దొరికింది. హడలిపోయాను. కాని గవాక్షం గుండా చూస్తున్నప్పటి వాళ్ళ సంభాషణ విన్నాక నన్ను హత్యచేసే విషయమై కళావతి తీవ్ర అభ్యంతరం తెల్పింది. తనని లేవదీసుకుపోయి వివాహం చేసుకోమని చెప్పింది. కాని అందుకతడు అభ్యంతరం తెల్పాడు. తను గవర్నమెంట్ ఉద్యోగినని విడాకులు మంజూరు కానిదే అలాంటి పిచ్చిపనులు చేస్తే వుద్యోగం వూడే అవకాశం వుందని చెప్పాడు.

నా ఆలోచనలు దారి మళ్ళాయి.

యిహ లోకంలో ఎటూ వాళ్ళిద్దరూ కలుసుకునే అవకాశం లేదు. కనీసం పరలోకంలోనైనా కలుపుదాం అన్పించింది. పథకం సిద్ధం చేసుకున్నాను. నా కొలీగ్

భూషణంని కల్సి క్యాంపులో నేను కోడుమూరులో వున్నట్టు ఎలిబీ క్రియేట్ చేసుకున్నాను. భూషణం అలా చెప్పేందుకు ఒప్పుకున్నాడు.

రకరకాల మారువేషాలు వేశాను. హోటలు గదిలో కస్టమర్‌గా పరిచయం చేసుకున్నాను. గంధపు చెక్కతో అదనుచూసి తలపై మోది స్పృహ తప్పించాను. రక్తం కక్కుకు చచ్చాడని వూహించటానికి వీఁగా గుండెలపై తొక్కి నోట్లోంచి రక్తం వచ్చేలా చేశాను. గంధపు చెక్కపై వ్రేలిముద్రలు పడివుంటాయేమోనన్న అనుమానంతో శుభ్రంగా తుడిచి పారిపోయాను...."

"అక్కడే నువ్వు పొరబాటు చేశావు...." నా మాటలకి అడ్డొస్తూ అన్నాడు వరదరాజులు. "గంధపు చెక్కను తుడవటానికి నీ వద కర్చీఫ్ లేక అక్కడేవున్న గాజు గ్లాసుని జరిపి నాప్‌కిన్ తీసుకొని తుడిచావు. ఆ ఖంగారులో గాజు గ్లాసుపై వ్రేలి ముద్రలు పడివుంటాయన్ని గ్రహించలేకపోయావు.

మాకు వ్రేలి ముద్రలు లభించాయి. పదిలపర్చాం. దర్యాప్తుల మీ దంపతులు దిలీప్‌ని కలుసుకున్నట్టు చెప్పారు. మీ యింటికి వెళ్ళాం. నీ భార్య నీ గురించి చెప్పలేకపోయింది.

మా రహస్య దర్యాప్తులో దిలీప్ మీ యింట్లో మూడు రోజులు గడపటం, ఆ సమయంలో నువ్వు వూళ్ళో లేక పోవటం, అదే సమయంలో ఎన్నడూ కన్పించని ఓ 'బిచ్చ గాడు' మీ యింటి ప్రాంతంలో తచ్చాడుతూండటం, నువ్వు రాగానే బిచ్చగాడు మాయం కావడం, నువ్వు నన్ను కలవటం నన్ను కాస్త ఆలోచింప జేసింది.

నువ్వు సేషన్‌కి వచ్చినప్పుడు శుభ్రంగా తుడిచిన గ్లాస్ పేపర్ వెయిట్‌ని నీకు అందుబాటులో పెట్టాను. నువ్వు దాన్ని తిప్పుతూ మాట్లాడావు. దాన్ని జాగ్రత్త చేసి పరీక్ష చేయించాను. దిలీప్‌ని హత్యచేసింది నువ్వేనని తేలి పోయింది.

బైదిబై నీకు తెల్సా!? నువ్వు క్యాంపులో వున్నట్టు సాక్ష్యమిచ్చిన నీ కొలీగ్ భూషణం నా బావమరిదే! ఆ తర్వాత అతన్ని పర్సనల్‌గా కల్సి నువ్వు అబద్ధం చెప్పావని ధృవపర్చుకున్నాను.

నీ చుట్టూ వల అల్లబడింది. నువ్వు నీ భార్యని తిరుపతి తీసుకుపోతున్నట్టుగా నాకు ఇన్‌ఫర్మేషన్ అందింది. మారు వేషంతో బైలుదేరాను. నా అనుమానం నిజమైంది. నువ్వు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డావు." అన్నాడు యస్సయ్ వరదరాజులు ముగింపుగా. □

## షాక్!!



# విషం కక్కిన పాము

‘రాజీ’

ఆది ప్రముఖ వారపత్రిక ‘నెలవంక’ కార్యాలయము.

దీపావళి సందర్భంగా వెలువడనున్న ప్రత్యేక సంచికకు గాను ఆహ్వానించిన పోటీకి వచ్చిన కథలు టేబుల్లపై కుప్పలు కుప్పలుగా పడివున్నాయి.

కథల్లో ముఖ్యమైనవి మొత్తం పాతిక అంతకు ముందే

స్టాఫ్ ప్రక్కకు తీసి పెట్టారు. అందులోంచి ఇతివృత్తము, శైలి, కథనం బాగున్న ఎనిమిది కథలు ఎంపిక చేయాల్సిన బాధ్యత ఎడిటర్‌గారు నాపైన పెట్టారు.

దాదాపు వారం రోజులుగా వాటిని పరిశీలించి అనేక సార్లు చదివి ఆలోచించి ఎట్టకేలకు ఎనిమిది కథలు తీసి పక్కకు పెట్టాను.

"సార్ మిమ్మల్ని అయ్యగారు రమ్మంటున్నారు!" అంటు వచ్చి చెప్పాడు చవలయ్య.

ప్రక్కగా పెట్టిన ఎనిమిది కథల వ్రాత ప్రతులను జాగ్రత్తగా పట్టుకుని ఎడిటర్ గదికేసి నడిచాను.

"వాట్ మిస్టర్ నిహాంత్! నీకు అప్పజెప్పిన కార్యక్రమం ఎంతవరకు వచ్చింది?" కళ్ళజోడును సవరించుకుంటూ అడిగాడు ఎడిటర్.

"మన స్టాఫ్ తీసిన పాతిక కథల్లోంచి బహుమతి యోగ్యమైనవనిపించిన ఎనిమిది కథలు ప్రక్కకి తీసి పెట్టాను. వాటిల్లో ఏ కథకి ఏ బహుమతి యివ్వవచ్చో మీరే సూచిస్తే బాగుంటుందని నా అభిప్రాయం" అన్నాను కుర్చీలో కూర్చుంటూ.

"జర్నలిజంలో మాస్టర్ డిగ్రీ పుచ్చుకుని, అయిదేళ్లుగా అసోసియేట్ ఎడిటర్‌గా చేస్తున్నావు, పైగా ప్రతి ఏటా కథల ఎంపిక నీవే చేస్తున్నావు; పాఠకుల నుండి కాని, రచయిత(త్రు)ల నుండిగాని ఎలాంటి విమర్శలు రాలేదు. అందుచేత ఏ కథకి ఏ బహుమతి యివ్వవచ్చో కూడా నీవే నిర్ణయించు" చిరునవ్వుతో అన్నారు ఎడిటర్.

"మీ నమ్మకానికి కృతజ్ఞుణ్ణి సార్! కాని అనుభవజ్ఞులు మీరు కూడా ఓరల్‌గా ఓసారి చూస్తే బాగుంటుందని

నా అభిప్రాయమండి" అన్నాను కథల ప్రతులను ఎడిటర్ ముందుకి తోస్తూ!

ఎడిటర్ కథల ప్రతులను తీసుకుని ఒక్కొక్కటి చదువసాగారు. సమయం మూడు గంటలు కావస్తూంది. ఉత్తరకార్తె ఎండలు కాస్త తీవ్రంగా వున్నాయి. ఎయిర్ కూలర్ చిన్న సవ్వడితో చల్లటి గాలిని గది నింపుతుంది.

నేను ఎడిటర్‌గారి నెరిసి, నెరసి కొద్దిగా మిగిలివున్న తల వెంట్రుకల్ని చూస్తూ ఆలోచించసాగాను. అనుభవంతో పండిన తల. పదహారేళ్ళక్రితం నెలవంక మాసపత్రికను స్థాపించి, తనదంటూ ఒక ప్రత్యేక పత్రికగా నిలిపి, రెండేళ్ళ క్రితం ప్రారంభించిన 'నెలవంక' సపరి వార పత్రిక అత్యధిక జనాదరణ పొంది తెలుగు వార పత్రికల్లో అత్యధికంగా అమ్ముడవుతుందంటే అది వారి ప్రజ్ఞే.

ఆయన పరిశీలిస్తున్న ఎనిమిది కథల్లో ఏ కథకి ప్రథమ ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్‌లు ఇవ్వవచ్చో నేను ముందుగానే వాటిపైన చిన్నగా పెన్సిల్‌తో మార్క్ చేశాను.

ఇంతలో ఫోన్ మోగింది. ఆలోచనల్లోంచి తేరుకుని, ఎడిటర్‌గారి సైగతో ఫోనందుకుని....

"హలో!" అన్నాను.

"హలో!....మీరెడిటర్‌గారేనా?....నేనండి సాంస్కృతిక శాఖ మంత్రిని....కళా సన్యాసిరావుని మాట్లాడుతున్నా! ఆ....మరేం లేదండి....మీది ప్రముఖ వార పత్రిక కథండి....ఈ మధ్య ఏదో పోటీ పెట్టారుట కదండి.... అదే మా అమ్మాయిలేదండి....ప్రముఖ వర్ధమాన రచయిత్రండి....కళామనెమ్మ....అమ్మాయి మీ

పత్రికకి ఒక కథ పంపించిందటండి. అదే...."పలుకు బడి" కథ పేరండి ఫస్ట్‌క్లాస్‌గా వుందండి. ఆ కథకి ఫస్ట్ ప్రైజ్ యివ్వాలండి. మనం మనం ఒకటే కదండి! పైగా కులము ఒక్కటే! మీ పనేమైనా వుంటే చూసి పెడ్తాలెండి. అవును....ఇంతకీ మీరేమి మాట్లాడలేరండి....హలో...."

ఆగాడు అవతలివేపు. తుపాను తర్వాతి ప్రశాంతత ఫోనుకి.

ఓ క్షణం ఆలోచించి "హలో! నాను పెలమయ్య నండయ్యా. ఎడిటర్ గోరు అచ్చాక చెప్పతానండయ్యా! మీ ఫోను యిసయం...." గొంతు మార్చి యాసగా పలికాను ఫోనులో.

"ఆ ముక్క ముందే సెప్పేద్వచ్చుగా...." దన్ మంటూ అవతలి పక్క ఫోను పెట్టేసిన చప్పుడు వినిపించింది.

నవ్వుతూ ఫోన్ పెట్టేసాను. కథలు చదవడం పూర్తి చేసి నా వేపు చూస్తున్నారు చిరునవ్వుతో ఎడిటర్‌గారు. మా సంభాషణ పూర్తిగా విన్నట్టున్నారు.

"వెల్ మైబాయ్! చాలా మంచిపని చేశావ్. మంత్రుల రికమెండేషన్లతో కథలు వేసుకుంటే పత్రిక తూకం వేసి అమ్ముకోవాల్సిందే!....ఇక అసలు విషయానికి వద్దాం.

నీవు ప్రథమ బహుమతికి ఎంపిక చేసిన "విషం కక్కిన వానపాము" కథ చాలా చాలా బాగుంది. నేటి పరిస్థితికి అనుగుణంగా వుంది. గదిలో బంధించి కొడితే పిల్లే పులిగా మారుతుందనే విషయం ఈ కథ ద్వారా వెల్లడవుతుంది. పురుషుడికై క్రొవ్వొత్తిలా వెలిగే స్త్రీ ఒక్కోసారి ఆ పురుషుని జీవితాన్ని భస్మం చేస్తుందని

నిరూపించింది కథలో.

పోతే. మూడవ బహుమతికి ఎంపిక చేసిన "కళా జలతారు"లో సినిమా వ్యామోహంలో నేటి యువత ఎలా నాశనమౌతున్నది వివరించబడింది. దీనికంటే కన్సోలేషన్ యిచ్చిన "కలియుగ బ్రహ్మ"లో నేటి డాక్టర్లు ఎలాంటి దంపతులకైనా సంతానం కలుగజేస్తారని నిరూపించ బడింది. ఈ కధకి మూడవ బహుమతి యిచ్చి, "కళా జలతారు"కి కన్సోలేషన్ యివ్వాలి!

బై దిబై ....ఆ యా రచయిత(త్రు)లకు టెలిగ్రామ్స్ యిచ్చి ఫోటోస్, బయోడేటాస్ తెప్పించు యిమిడి యట్‌గా...." వ్రాత ప్రతులను నా వేపుకి జరుపుతూ అన్నారు ఎడిటర్‌గారు.

"ఓకే సార్!" అని చెప్పి గదిలోంచి బయటకు వచ్చాను కథల ప్రతులను పట్టుకుని.

"పోస్టాఫీసు బంద్ కాక మునుపే చేరుకుని టెలి గ్రామ్స్ యివ్వాలని తొందర తొందరగా పని ముగించు కుని, ఆ యా రచయిత(త్రు)ల చిరునామాలు తీసుకుని బజాజ్ చేతకనుదూకించాను.

## 2

టెలిగ్రామ్ యిచ్చి వారం రోజులు దాటింది. దాదాపు అందరి ఫోటోలు, పరిచయాలు వచ్చాయి. కాని ఒకే ఒక్క ప్రథమ బహుమతి పొందిన కథారచయిత్రి ఫోటో వివరాలు తప్ప. ప్రథమ బహుమతి కథా రచయిత్రి 'స్నిగ్ధ' రచనలు అడపా దడపా 'నెలవంక'లో వస్తుం టాయి. తప్పకుండా భవిష్యత్తులో మంచి గొప్ప రచ యిత్రి అయ్యే లక్షణాలు వున్నయామె రచనల్లో.

'స్నిగ్ధ' తన ఫోటో పంపలేదు కాని అందమైన

దస్తూరితో ఉత్తరం వ్రాసింది. తన ఫోటోగాని, పరిచయం గాని పత్రికలో ప్రచురించేందుకు యిష్టం లేదని; మన్నించ మని వ్రాసింది.

చాలా కాలంగా 'నెలవంక'లో బహుమతి గ్రహీతల ఫోటో పరిచయాలు తప్పనిసరిగా వేస్తున్నాము - దానివల్ల పాఠకులకు రచయిత(త్రు)ల మధ్య చక్కని అవగాహన ఏర్పడుతుందనే వుద్దేశ్యంచేత. అయినా ఈ కాలంలో ప్రతివారు తమ ఫోటో ఎప్పుడు పత్రికలో ప్రచురింప బడుతుందో అని ఎదురుచూస్తుంటారు.

ఆ విషయమే ఎడిటర్‌గారితో సంప్రదించాను: వారెలా చెప్తే అలా చేద్దామనే వుద్దేశ్యంతో.

"చూడు నిహాంత్! మనం ప్రతియేడు విధిగా బహుమతి పొందిన వాళ్ళ ఫోటోలు, పరిచయాలు తప్పకుండా వేస్తున్నాము. వేస్తేనే బాగుంటుంది కూడా నీవో పనిచెయ్! 'స్నిగ్ధ' స్థానికురాలే కదా! చిరునామా తీసుకుని వెళ్ళి కల్సి మాట్లాడు. తప్పకుండా ఒప్పించు" అన్నారు ఎడిటర్‌గారు.

"సరే సర్! సాధ్యమైన ప్రయత్నం చేస్తాను" చెప్పి ఆవిడ చిరునామా తీసుకుని బయటకు వచ్చి చేతక్ స్టార్టు చేసాను.

రచయిత్రి చిరునామా ప్రకారం హనుమాన్ జంక్షన్లో డ్రైవ్ చేయాలి. కేరాఫ్ నటరాజన్ అని వుంది. ఆలోచిస్తూ మెల్లిగా పోనిస్తూ, ప్రథమ బహుమతి పొందిన కథను నెమరువేసుకోసాగాను.

కథలో ప్రధానపాత్ర సావిత్రి. చదువు ముగించుకునే సరికి ఎవరూలేని ఏకాకిగా మిగులుతుంది. ప్రయివేట్ ఫర్మ్‌లో వుద్యోగం సంపాదించుకుని కాలం వెలిబుచ్చు

తుంది. తన పని తను చూసుకునే మనిషి. ఎవరితోను అనవసరంగా కల్పించుకుని మాట్లాడదు. నిరాడంబరంగా, సభ్యతగా వుండే మనిషి. అందగత్తె కాకున్నా అనాకారి మాత్రం కాదు.

సావిత్రికి అనుకోని విధంగా బ్యాంకు వుద్యోగి సతీష్‌తో పరిచయమౌతుంది. సతీష్‌యొక్క సంస్కారం సభ్యత నచ్చి స్నేహానికి దారి తీస్తుంది. ఆ స్నేహం ప్రేమగా, ప్రేమ పరిణయంతో శాశ్వత మౌతుంది.

ఆ తర్వాతే వుంటుంది అసలు కథ. సతీష్ నటనతో సావిత్రిని ఆకర్షించుకున్నాడు. అతనికి లేని వ్యసనమంటూ లేదు. పేకాట, త్రాగుడు, వ్యభిచారం ముఖ్య నేస్తాలు. క్రమంగా ఇంటినే క్లబ్బుగా మార్చాడు. త్రాగుడు, పేకాటల కేంద్రమైంది ఇల్లు.

సావిత్రికి ఇల్లు నరకంగా తోస్తుంది. సతీష్ మిత్ర బృందంలోని రాజు అనే అతను ఆరోజు సతీష్ తప్పతాగి పడిపోయాక సావిత్రిపై అత్యాచారానికి ప్రయత్నిస్తాడు.

సావిత్రి విపరీతంగా భయపడి. ప్రతిఘటిస్తూ. సతీష్‌ను లేవనెత్తి వివరిస్తుంది. సతీష్ మిత్రునిది తప్పుగా లెక్కించక, రాజు చెప్పినట్టు వినమని తను గదిలోంచి బయటకు వెళ్తాడు. అది వారిద్దరు ముందుగా వేసుకున్న పథకమే నని గ్రహిస్తుంది సావిత్రి.

సావిత్రి రోదిస్తూ రాజుని తననేమి చేయవద్దని వేడుకుంటుంది. కళ్ళలో కామం, కడుపులో మందు; సావిత్రి కొంగుపట్టుకుని చీర లాగిపారేస్తాడు. ఆపైన ఆమె నాక్రమించుకునేందుకు ప్రయత్నిస్తుంటాడు.

సావిత్రి ప్రతిఘటించే శక్తి సన్నగిల్లి, పక్కనే బట్టలు

కత్తిరించే కత్తెర నందుకుని, రాజు పొట్టలో దించేస్తుంది. రాజు చావు కేక విని లోపలికి పరిగెత్తుకొస్తాడు సతీష్.

'నెత్తురు మడుగులో కోడిలా తన్నుకుంటున్న మిత్రుడు. రక్తసిక్తమైన చేతుల్లో కత్తెర, లోలంగాతో విడిపోయిన జుట్టుతోవున్న సావిత్రిని చేరుకుని చావు దెబ్బలు కొట్టి, గొంతు పట్టుకుని పిసికి చంపాలని ప్రయత్నిస్తాడు.

ప్రతిఘటిస్తూ, వేడుకుంటూ విధిలేక, ఆత్మరక్షణకై, భర్త దుర్మార్గం గుర్తుకువచ్చి, అదే కత్తెరతో సతీష్ పొట్ట చీల్చేస్తుంది.

ఆ తర్వాత పోలీసులకు లొంగిపోతుంది.

న్యాయస్థానంలోని న్యాయదేవతకు, సావిత్రి చర్య ఘాతుకంగా తోచి, యావజ్జీవ కారాగారశిక్ష విధిస్తుంది. కథ పూర్తవుతుంది.

పరధ్యానంగా సాగుతున్న నా ప్రయాణం యిద్దరు పాదచారులచేత అక్షింతలు వేయించింది. హనుమాన్ జంక్షన్‌కి రాగానే ప్రక్కనున్న రిక్షా పుల్లర్‌ని అడ్రసు గురించి అడిగాను.

నటరాజన్‌గారిల్లు ఈ రోడ్డులోనే తిన్నగా యిక్కడి నుండి మూడో కరెంట్ స్తంభం దగ్గరుంటుంది. బయట ఆయన పేరుగుల పెద్ద బోర్డు వ్రేలాడదీసి వుంటుంది— చెప్పాడు.

థాంక్స్ చెప్పి స్కూటర్‌ను పోనిచ్చి మూడో స్థంభం వద్ద ఆపి స్టాండ్ వేసాను ప్రక్కగా. ప్రక్కనే 'నటరాజన్' అని బోర్డు వ్రేలాడదీసి వుంది.

కర్చీఫ్‌తో ముఖం తుడ్చుకుని, కాలింగ్ బెల్ నొక్కాను. రెండు నిమిషాలనంతరం తలుపులు తెర్చు

కున్నాయి.

ఎదురుగా ఆరడుగుల భారీ విగ్రహం; కసరత్తు చేసిన బాడీ, సూదంటురాయి కళ్ళు. గుబురుగా పెంచిన మీసాలు, సన్నటి క్రాఫ్, గంభీరతను తెచ్చిపెట్టాయి చూపుల్తో ఆహ్వానించాడు.

కుర్చీలో కూర్చున్నాక, పరిచయం చేసుకుని, వచ్చిన పని వివరించాను.

రచయిత్రి 'స్నిగ్ధ'ను పిలిచి, ఫోటో పరిచయం యిప్పించవలసిందిగా కోరాను.

నటరాజన్ తన సూదంటురాయి కళ్ళతో నన్నోమారు పరిశీలనగా చూసి, ఆలోచించి, వెంటనే లోపలికెళ్ళి డ్రెస్ చేసుకుని వచ్చాడు.

"అలా బయటకు వెళ్దాం రండి!" అన్నాడు తన బుల్లెట్‌ను బయటకు తీస్తూ.

వింతగా తోచింది నాకు. బహుశ నటరాజన్ అపార్థం చేసుకున్నారేమో, లేకపోతే వింతగా ప్రవర్తిస్తున్నాడు ఏమిటో అంతుబట్టడం లేదు.

నటరాజన్ బుల్లెట్ వెనుక స్కూటర్ పరిగెత్తించాను. అలా చాలాసేపు సాగిన ప్రయాణం ఒకచోట ఆగింది.

స్టాండు వేసి లోపలికి ఆయన వెంట సాగాను మరింత ఆశ్చర్యపోతూ. అంతా అగమ్యంగా వుంది.

## 3

ఇద్దరం ఒక గదిలో కూర్చున్నాము. నటరాజన్ ఎవరినో పిలిచి, చెవిలో ఏదో చెప్పి పంపాడు. ఆలోచిస్తూ కూర్చుండిపోయాను.

కొద్ది టైం గడిచాక, తెల్లటి బట్టల్లో, ముప్పైఏళ్ళ యువతిని వెంటబెట్టుకు వచ్చాడా వ్యక్తి.

ఆమె రాగానే నటరాజన్‌కి నమస్కరించి, చూపించిన కుర్చీలో కూర్చుంది. నిండుగా ఒళ్ళు కనబడకుండా పైట కప్పుకుంది. ముఖంలో గంభీరతతో కూడిన ప్రశాంతత కనబడింది.

నా ఆలోచనలను భంగపరుస్తూ నటరాజన్.

"చూడమ్మా ఈయన 'నిహాంత్' అని 'నెలవంక' పత్రిక అసోసియేట్ ఎడిటర్. నీతో మాట్లాడదాని కొచ్చారు....మిస్టర్ నిహాంత్! మీ రడిగిన రచయిత్రి ఈవిడే! మాట్లాడండి." చెప్పాడు నటరాజన్.

నాకు తల తిరిగినంత పనయ్యింది ఆ మాటలు విన్నాక. ఇదంతా కలా? నిజమా? అనిపించింది. అప్రయత్నంగా ఆవిడకు నమస్కరించాను.

ప్రతినమస్కారం చేసి వుండిపోయింది.

"చూడండి స్నిగ్ధగారు! మీ రచనకు ప్రథమ బహుమతి విషయం మీకు తెలియజేసాము. అయితే మీ ఫోటో పరిచయానికి కూడా అంగీకరిస్తారనే వుద్దేశ్యంతో, ఎడిటర్‌గారి ప్రోత్సాహంతో వచ్చాను. కాని మీరెందుకు నిరాకరించారో యిప్పుడర్థమైంది. అయినా సరే మీరు తప్పకుండా ఫోటో పరిచయం ప్రచురణకి ఒప్పుకోవాలి! ఆలోచించండి మరోసారి....!" మృదువుగా చెప్పి ఆగాను, ఆమె మొహంలోకి చూస్తూ

స్నిగ్ధ గొంతు సవరించుకుని "నిహాంత్‌గారు! నా కథని ప్రథమ బహుమతికి ఎంపిక చేసినందుకు మీకూ, ఎడిటర్‌గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అయితే అది కథ అనే బదులు నా జీవిత గాథ అంటే సరిపోతుంది. ఇంతకు ముందుగా వ్రాసినట్టుగా ఊహాజనితం కాదు. జీవితాన్నే కథగా రచించాను. పాఠకులు దాన్ని కథగా

అంగీకరిస్తారే గాని, వాస్తవ గాథని, నగ్నసత్యమని తెలిస్తే. నన్నూ నా రచనను అసహ్యించుకుంటారు. అందు చేత నా ఫోటో పరిచయానికి అంగీకరించడం లేదు. ఇంతకు మించి మరే విషయమూ లేదు...." చెప్పడం ముగించి తల కిందుకు దించుకుంది. కనుగుడ్లపై వచ్చిన సన్నటి పీటిపొర మాకు కనిపించవద్దనే ఉద్దేశ్యంతో.

ఆ గది చాలాసేపు నిశ్శబ్దంగా వుండిపోయింది. నేను చాలాసేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను.

"చూడండి స్నిగ్ధగారూ! ప్రస్తుత ప్రత్యేక సంచికలో మీ కథ ప్రచురించి, ఆ తర్వాతి సంచికలో మీ ఫోటో పరిచయం వేస్తాము. అంతలోగా మీ కథపై పాఠకుల నుండి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో తెలిసిపోతుంది. అటు పిమ్మట మీ పరిచయం పత్రికా రంగంలో నే ఒక సంచలనం రేపుతుంది.

మరో విషయం! ఈ రకంగా చేయడంవల్ల మీకెలాంటి చెడ్డ పేరు రాదు. మీ కథ మీ పట్ల సానుభూతిని పెంచుతుంది. సమాజంలో మీ వ్యక్తిత్వం పెరుగుతుంది. పైగా మీ కథ చదివిన ఏ కొద్ది పురుషుల్లోనైనా మార్పు వస్తుందని ఆశిద్దాం. అలాగే ఆడవాళ్ళలో ఆత్మస్థైర్యం పెంపొందించగలదని నా నమ్మకం. మీరూ ఆలోచించండి....!"

చాలాసేపు పిన్‌డ్రాప్ సైలెన్స్.

నటరాజన్ శ్రోతగా మిగిలాడు.

"సరే! మీ అందరి మాటను నే నెందుకు కాదనాలి. అలాగే చేయండి. మరో విషయం: కథకుగాను యిచ్చే బహుమతి మొత్తాన్ని, రాష్ట్రంలోని ప్రతి జైలుకు ఒక నెలవంక కాపీ చొప్పున ఖైదీలు చదివేందుకు పంపండి.

ఆ చందా మొత్తం బహుమతి సొమ్ములోంచి మినహా యించుకోండి. ఇకముందు కూడా నా రచనలు పబ్లిష్ అయితే వచ్చే పారితోషికాన్ని జైలు కాపీల చందా క్రింద మినహాయించండి.

మీకు, పత్రికా సంపాదకులకు ముఖ్యంగా నన్ను తండ్రికన్న ఎక్కువగా చూసుకుంటూ, అనుక్షణం నన్ను రచనలు చేయమని ప్రోత్సాహించే ఈ జైలు సూపరెన్ టెన్ డెంట్ నటరాజన్‌గారికి నా కృతజ్ఞతలు....త్వరలో నా ఫోటో, బయోడాటా పంపిస్తాను...." చేతులు జోడించి సెలవుతీసుకుని, పొంగిపొర్లుకు వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుని, భారంగా, మౌనంగా ఆడఖైదీలుండే సెల్ వేపు నడిచివెళ్ళింది.

నటరాజన్‌గారి వద్ద సెలవు తీసుకుని. ఎన్నో విషాద చరిత్రలను గోప్యంగా తల్లిలా కడుపున దాచుకునే ఆ జైలు గోడలను చూస్తూ బయటకు వచ్చాను ఆ జైలులోంచి. □

## బ్యాగు కత్తిరింపు?



ప్రతాప రవిశంకర్

సీరియల్

# మరో యాత్ర

(గత సంచిక తరువాయి)

"ఇంకా మనం దీవి మొదట్లోనే వున్నాం. ఇక్కడి జంతువుల అలవాట్లగురించి మనకు తెలీదు. నడవండి. ఏదైనా చెట్టుకిందకు వెళ్ళి కొంచెంసేపు విశ్రాంతి తీసుకోవాలి" అన్నాడు స్టీఫెన్ నడక వేగాన్ని పెంచుతూ—

కొంచెం దూరంలోనే వాళ్ళకు నీళ్ళకాయల మొక్కలు కనపడ్డాయి. అంతా దాహం తీర్చుకుని మళ్ళీ నడక సాగించారు.

నరేంద్ర మౌనంగా నడుస్తున్నాడు. అతనికి కళ్ళ ముందు నీలూ కనపడుతోంది నడుస్తుంటే....

అండమాన్స్‌కు వెళుతున్నట్టు అతను ఎవ్వరికీ చెప్పలేదు. ఖైదీలందర్నీ అండమాన్ దీవులకు తరలించటానికి రెండు రోజుల ముందు నీలూ—రేణు—భూపేంద్ర మల్కాన్‌పురి జైల్లో అతణ్ని కలుసుకున్నారు. అప్పుడు

కూడా అతను అండమాన్‌కు తన ప్రయాణం గురించి చెప్పలేము.

నీలూ ఏడుస్తున్నట్టు, దుఃఖంతో కుమిలిపోతున్నట్టు అతడికి అనిపించింది.

మనసంతా బరువుగా మారిపోయింది.

అంతా తిరిగి చెట్లు దట్టంగావున్న ప్రాంతానికి వచ్చారు. వెడల్పు ఆకులున్న చెట్టుకిందకు వచ్చి ఆగిపోయారు.

"ఇక్కడ విశ్రాంతి తీసుకుందాం" అన్నాడు స్టీఫెన్.

తలలు వూపారు మిగిలిన ఖైదీలు.

ఇసుకలో కూర్చున్నారు.

నీడగా వుంది.

"ఇదంతా కలగా వున్నది" అన్నాడొక ఖైదీ ఇసుకలో వెనక్కువాలి పడుకుంటూ....

"అవును. తుఫాన్ రాకుండా వుంటే బాగుండేది. ఈ దీవిలో మనం ఎన్నిరోజులు వుండిపోవాలో తెలీదు" అంటూ స్టీఫెన్ కూడా వెల్లకిలా పడుకున్నాడు.

దీవులగురించి ఏవో ప్రశ్నలు అడిగారు ఖైదీలు స్టీఫెన్ని....వాళ్ళతో మాట్లాడుతూనే బాగా అలసిపోయిన వాడిలా నిద్రలోకి జారుకున్నాడు.

కొన్ని నిముషాలు ఆలస్యంగా మిగిలిన ఖైదీలు కూడా నిద్రలో మునిగిపోయారు.

విసురుగా వీస్తూన్న గాలికి ఆ చెట్టు ఆకులు రాలి వాళ్ళ మీద పడుతున్నాయి.

## 21

వాళ్ళందరికీ మెలకువ వచ్చేసరికి చీకట్లు ముసురుకుంటున్నాయి. కప్పివేసినట్టుగా మీద రాలిన ఆకులను

పక్కకు తొలగించుకుని వాళ్ళు లేచి కూర్చున్నారు.

"చాలా సేపు నిద్రపోయాం" అన్నాడు స్టీఫెన్.

"మనం పొరపాటు చేశాం, నిద్రపోకుండా వుంటే బాగుండేది" అన్నాడు నరేంద్ర.

"ఎందుకు?"

"ఈ దీవి గురించి మనకు ఏమీ తెలీదు. ఈ రాత్రి గడపటానికి మనకు అనువుగా వుండే ప్రదేశాన్ని ఎంపిక చేసుకోవాలికదా....ఇప్పుడు చీకటిపడుతోంది" అన్నాడు.

"నిజమే. ఇంతసేపు నిద్రపోవాలని కూడా ఎవ్వరం అనుకోలేదు. ఇంకా బాగా చీకటిపడకముందే మనం ఏదైనా సురక్షితమైన ప్రదేశాన్ని వెతుక్కోవాలి. నడవండి" అన్నాడు స్టీఫెన్.

ఖైదీలు అతన్ని అనుసరించారు.

ముందుకు వెళ్ళిన కొద్దీ ఇంకా దట్టంగా వున్నాయి చెట్లు. వాటి మధ్యనించి నడుస్తున్నప్పుడు చీకటి బాగా పెరిగిపోయినట్టుగా అనిపించింది.

కొంచెం సేపు నడిచేసరికే బాగా చీకటిపడింది.

"ఈ చీకట్లో ముందుకు వెళ్ళటం క్షేమంకాదు" అన్నాడు నరేంద్ర.

"ఐతే ఈ రాత్రికి ఇక్కడే పడుకుందాం" అన్నాడు స్టీఫెన్.

అక్కడ బాగానేవుంది. చెట్లువున్నా కింద ఎటువంటి పొదలూ, చిన్న మొక్కలు లేవు. చిన్న మైదానంలాగా వున్నది.

"భయంగావుంది" అన్నాడొక ఖైదీ చీకట్లోకూర్చుని.

అంతా అతన్ని చూశారు.

ఆ ఖైదీ సన్నగా వున్నాడు.

"ఎందుకు?" అడిగాడు స్టీఫెన్.

"ఎప్పుడూ ఇట్లాంటి దీవుల్లో గడపలేదు. అసలు దీవి లోకి అడుగుపెట్టటం ఇదే మొదటిసారి. ఈ చీకట్లో ఈ చెట్టుకింద పడుకోవాలంటే భయంగావుంది" అన్నాడు.

"నిజమే, మాక్కూడా భయంగా వుంది." అన్నారు కొంతమంది ఖైదీలు.

"ఇట్లాంటి నివాసయోగ్యం కాని దీవుల్లో రాత్రి గడపటం భయంగానే వుంటుంది. ఐనా తప్పదు. భయపడి చెయ్యగలిగింది కూడా ఏమీలేదు" అన్నాడు స్టీఫెన్.

అతని మాటలకు ఎవ్వరూ బదులు చెప్పలేదు. మళ్ళీ అతనే "దయచేసి ఎవ్వరూ భయం గురించి ఆలోచించ కండి. ఇప్పటివరకూ ఈ దీవిలో ఆటవిక జాతి మనుషులు గానీ, జంతువుగానీ, పక్షిగానీ కనపడలేదు. ఏ విధమైన ప్రమాదం కూడా ఎదురుకాలేదు. కాబట్టి ఈ రాత్రి గడిచే వరకు కూడా ఏ ప్రమాదము జరగదనీ—మనందరం సురక్షితంగానే వుంటామని నాకు అనిపిస్తూంది.... భయాన్ని మరచిపొండి" అన్నాడు.

స్టీఫెన్ మాటలు వాళ్ళలో కొంచెం ధైర్యాన్ని కలిగించినా—పూర్తిగా వాళ్ళ భయాన్ని పోగొట్టలేక పోయాయి.

అందుకే ఒక ఖైదీ అడిగాడు—"ఏదైనా జంతువు రాత్రిపేళ మనమీద దాడిచేసినప్పుడు దాన్ని ఎదుర్కోటానికి మనదగ్గర ఎటువంటి ఆయుధం కూడాలేదు. ప్రమాదం కదా"

"నిజమే. వెలుతురు వున్నప్పుడే ఏదైనా చెట్టు కొమ్మలు విరిచి పట్టుకుంటే బాగుండేది" అన్నాడు నరేంద్ర.

ఆ దీవిలో రాత్రివేళ జంతువుల దాడిగురించే అంతా భయపడ్డారు.

ఎక్కడా ఎటువంటి శబ్దమూలేదు. అంతా నిశ్శబ్దంగా వుంది. కళ్ళు తెరిస్తే అంతా చీకటి.

దీవుల్లో సహజంగా ఎదురయ్యే ప్రమాదాలను గురించి స్టీఫెన్ వాళ్ళందరికీ చెప్పాడు. అతడి మాటలు వింటున్నప్పుడు అందరికీ భయం పెరిగిందేకానీ తగ్గలేదు.

"మిమ్మల్ని భయపెట్టటానికి ఇవన్నీ చెప్పటంలేదు. ముందుగా తెలుసుకోవటం మీకు అవసరం అని చెప్పాను" అన్నాడు స్టీఫెన్.

ఎవ్వరూ మాట్లాడలేదు.

భయంతో మాట్లాడటానికి వాళ్ళ అంతరంగాలు ఒప్పుకోలేదు. ఏదో తెలియని భయం అక్కడ వున్న చీకటిలాగానే వాళ్ళ ఆలోచనల్లో నిండిపోయింది.

ఒక్కొక్క ఖైదీ మెదడును ఒక్కోరకం ఆలోచనలు చుట్టుముట్టాయి.

రాత్రి గడుస్తోంది బద్ధకంగా.

చివరకు ఆలోచనలతోనే అంతా నిద్రలోకి వారిగిపోయారు. 'భయం....భయం' అన్న ఖైదీ అందరికంటే ఆలస్యంగా నిద్రపోయాడు. అందరూ నిద్రపోతున్నారని తనొక్కడే మెలకువగా వున్నాడనీ తెలిసినప్పుడు అతనికి వణుకు పుట్టింది. ఆ భయంతోపాటు చలిగాలి కూడా తోడయ్యింది.

చివరికి అతను కూడా నిద్రకు తలవంచక తప్పలేదు. ఎంతసేపు నిద్ర పోయాడో తెలీదు. అప్పటికి రాత్రి ఎంత గడిచిందో కూడా తెలీదు.

హటాత్తుగా మెలకువ వచ్చింది.

కళ్ళు తెరిచాడు. చీకటే కనపడింది.

తల పైకెత్తి చూశాడు. ఆకాశం కనపడలేదు. దట్టంగా చెట్టుకొమ్మలు అడ్డుగా వున్నాయి. నక్షత్రాల కాంతి కూడా కిందకు జారే అవకాశమే లేదు.

అతను కూర్చున్నాడు.

నిద్ర పట్టలేదు. ఆవేశంతో అతను చేసిన హత్యా నేరం గుర్తుకు వచ్చింది. కోర్టుకు తీసుకు రావటం - విచారణ - జైలు శిక్ష - అన్నీ వరసగా గుర్తుకొచ్చాయి. ఏడుపు వచ్చింది.

మోకాళ్ళ మీద మొహాన్ని వుంచుకుని చిన్నగా ఏడ్చాడు. ఎంత ఏడ్చినా దుఃఖం ఆగలేదు. పక్కనే అంతమంది వరసగా పడుకున్నా ఏదో ఒంటరితనం - తెలియని దిగులు అతడ్ని భయపెట్టాయి.

ఉన్నట్టుండి ఆతనికి ఏదో చప్పుడు చాలా తగ్గు స్థాయిలో వినపడింది. ఏదో అలికిడి. ముందు గాలికి చెట్టు ఆకులు కదులుతున్న చప్పుడనుకున్నాడు.

కాని - తర్వాత ఏదో అనుమానం వచ్చింది. మోకాళ్ళ మీద నుంచి తలెత్తిచూశాడు. చీకట్లో చూడటానికి అల వాటు పడిన అతని కళ్ళకు ఎదురుగా - మనిషో, మృగమో ఏదో తెలీదు - ఒక ఆకారం నిలబడినట్టుగా కనపడింది అస్పష్టంగా.

మొదట్లో తను భ్రమపడుతున్నాడని అనుకున్నాడు. కాని అతనిది భ్రమ కాదంటూ ఆ ఆకారం కదిలింది. అప్పుడతను కెవ్వున భయంతో అరవబోయాడు. కాని - ఆ ఆకారం అతనికి ఆ అవకాశం ఇవ్వలేదు.

ముందుకు వొంగి వెడల్పుగా వున్న అరచేత్తో ఆ ఖైదీ నోరు నొక్కేసింది. అప్పుడతని మొహానికి ఉన్ని

# అపరాధ పరిశోధన పోటీ-223

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-2-'87 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఏప్రెల్ '87 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఇటీవల కాన్పూర్ వన్ డే ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్‌లో ఘోర పరాజయం పొందిన జట్టు—?
   (ఇండియా, శ్రీలంక)
2. త్రిపురలో ఇవి ముమ్మరంగా సాగుతున్నవి—?
   (దోపిడీలు, హత్యాకాండ)
3. కేంద్రప్రభుత్వం ప్రజలకిచ్చిన నూతన సంవత్సరకానుక—?
   (పోస్టల్ రేట్ల పెంపు, ఋణాలపై వడ్డీ మాఫీ)
4. ఇవంటె కొందరికి సరదా—?
   (చిలక పలుకులు, కోతిచేష్టలు)
5. నగర ప్రజలకు యీ సమస్య అనివార్యమవుతున్నది—?
   (వాతావరణ కాలుష్యం, మంచినీటి కొరత)

బొమ్మలాంటిది తగిలింది. అతని అరుపు బయటకు రాలేదు. ఆ ఆకారం రెండు చేతులతో అతడ్ని పైకి లేపింది. గొంతు నొక్కి-భుజం మీద వేసుకుని చీకట్లో కలిసిపోయింది.

స్టీఫెన్ - మిగిలిన ఖైదీలు ప్రశాంతంగా నిద్ర పోతున్నారు ఆ చెట్టుకింద.

## 22

ఖైదీలకు మెలకువ వచ్చేసరికి బాగా తెల్లారిపోయింది. చెట్లకొమ్మల మధ్యనించి సూర్యుడి కిరణాలు వాళ్ళమీద పడుతున్నాయి.

ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగనందుకు వాళ్ళంతా దేవుడికి కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. ఐతే ఒక ఖైదీ మాయమైపోయినట్టు వాళ్ళు వెంటనే తెలుసుకోలేక పోయారు.

అంతా లేచి నిలబడ్డారు.

అప్పుడు మొదటిసారిగా నరేంద్రకు యెవరో ఒక మనిషి తగ్గిపోయినట్టనిపించి అందర్నీ లెక్క-పెట్టాడు.

స్టీఫెన్ని వదిలేస్తే యిరవై ఒక్క-మంది ఖైదీలు వున్నారు.

అంటే ఒక ఖైదీ లేడు.

"మనలో ఒక ఖైదీ కనపడటంలేదు...." అన్నాడు నరేంద్ర.

అప్పుడు గమనించారు మిగిలినవాళ్ళు.

"అతను రాత్రి నాపక్క-నే పడుకున్నాడు. భయంగా వుందని చాలాసార్లు అన్నాడు. ఆ ఖైదీ కనబడటంలేదు" ఎవరో అన్నారు.

"వెతకండి. మనకంటే ముందు నిద్రలేచాడేమో.




మా వద్ద సాంఘిక నవలలు, డిటెక్టివ్‌లు, బాల సాహిత్యం, నాటకములు, వైద్య, విద్య మరియు స్కూలు, కాలేజి విద్యార్థులకు అచ్చుపుస్తకములు, ఎక్సర్‌సైజు పుస్తకములు హిందీ, ఇంగ్లీషు నవలలు లభించును.

నేడే కేటలాగుకై వ్రాయండి.

# శ్రీ గణేశ్ బుక్ హౌస్

(బుక్ డిస్ట్రిబ్యూటర్స్ & స్టేషనరీ)

టౌన్‌హాల్ రోడ్డు—రాజమండ్రి - 1

ఇక్కడే తిరుగుతూవుంటాడు" అన్నాడు బలదేవ్.

అంతా ఆ చెట్టువెనక్కి వెళ్ళారు. అక్కడ కూడా ఎత్తుగా పెరిగిన చెట్లు వున్నాయి. అన్నివైపులా కొంత దూరంవరకు కనపడకుండాపోయిన ఖైదీకోసం వెతికారు.

ఎక్కడా అతడు కనపడలేదు.

మళ్ళీ అంతా చెట్టుకిందకు చేరారు. అందరి మొహాల్లోనూ ఆందోళన అందరికీ కనబడింది. ముందుగా ఎవ్వరూ మాట్లాడలేకపోయారు.

నరేంద్ర గొంతు పెగల్చుకుని "మనలో యెవ్వరికీ ఏ ప్రమాదం జరగలేదని దేవుడికి కృతజ్ఞతలు తెలియ జేసుకున్నాం. కాని మన ఆలోచన నిజం కాదని ఇప్పుడు తెలిసింది. ఒక ఖైదీ మాయమయ్యాడు. ఎవరో అతన్ని ఎత్తుకుపోయారు" అన్నాడు.

"ఎవరు? మనుషులా?" అన్నాడు బలదేవ్?

"తెలీదు. ఈ దీవి గురించి యిప్పటివరకూ మనకు యేమీ తెలీదు. మనుషులో, మృగాలో ఏవో మన మనిషిని యెత్తుకుపోయాయి. అంతవరకూ మనం అనుకోవచ్చు" అన్నాడు నరేంద్ర.

"అవును. అతను తనకు తనే ఇక్కడి నుండి వెళ్ళిపోలేదు. ఐనా ఒంటరిగా ఈ దీవిలో తిరిగి రావటానికి ఏ మనిషీ సాహసం చెయ్యడు. తప్పకుండా అతన్ని ఎవ్వరో ఎత్తుకుపోయారు" అన్నాడు స్టీపెన్.

"జంతువులా!" ఎవరో అడిగారు.

"అయివుండక పోవచ్చు. జంతువులు లాక్కెళితే యిక్కడికి దగ్గర్లో చంపి తినివుంటాయి. ఎక్కడా మనకు అందుకు గుర్తులు కూడా లేవు. జంతువులు కాదు. పైగా

# "హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు, వారికి పత్రికలన్నీ 'బుక్ పోస్టు' లో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జులై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము. పత్రికల ఖరీదుకు మించి మీరు పైసా చెల్లించ నవసరం లేదు.

3. 'అపరాధ పరిశోధన' మాసపత్రిక మరియు సప్లిమెంట్‌కు కలిపి అర్థసంవత్సర చందా రు. 84/-లు మాత్రమే.

4. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియజేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై- మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

6. సభ్యులకు ప్రతి నెలా V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యంకూడా వుంది. అయితే వి.పి. ఖర్చులుకూడా వారే భరించవలసి వుంటుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెలకానెల రు. 17-60లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం కావలసిన వారు మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!

ఏదైనా జంతువు ఈడ్చుకెళుతున్నప్పుడు అతనికి మెలకువ వచ్చేది. తప్పకుండా కేకలు పెట్టేవాడు. కాని అట్లా జరగ లేదు. ఎవ్వరికీ ఏ చప్పుళ్ళూ వినపడలేదు. ఆశ్చర్యంగా వుంది'' అన్నాడు స్టీఫెన్.

"ఐతే యెట్లా మాయమయ్యాడు? యే చప్పుడూ చెయ్యకుండా అతన్ని తీసుకెళ్ళే అవకాశం మనుషులకే వుంది. కాబట్టి ఈ దీవిలో మనుషులున్నారని మనం అనుకోవచ్చు'' అన్నాడు నరేంద్ర.

"నాకు నమ్మకం కలగడంలేదు. ఈ దీవుల్లో వుండే మనుషులు ఎవరు? ఏ ఆటవిక జాతులవాళ్ళో అయివుంటారు. అట్లాంటివాళ్ళు మనకెవ్వరికీ అపకారం చెయ్యకుండా ఒక్క మనిషినే ఎందుకు తీసుకెళతారు? ఒక్క మనిషితో వాళ్ళకు అవసరం ఏమిటి?'' అన్నాడు బలదేవ్.

"నిజమే. ఈ దీవిలో నిజంగానే మనుషులు వుంటే మనం వాళ్ళందరికీ శత్రువులం. ఒక్కర్ని కూడా వాళ్ళు వదిలిపెట్టరు. కాని మనం సురక్షితంగానే వున్నాం. మనలో ఒక మనిషి మాయమైపోయాడు. ఇందులో వున్న రహస్యం తెలీటంలేదు'' అన్నాడు స్టీఫెన్.

ఖైదీ మాయమైపోవటంలోని అంతరార్థం ఎవ్వరి వూహకీ అందలేదు.

అప్పుడు వాళ్ళంతా నిజంగానే భయంతో వణికారు.

మవునంగా ఆ చెట్టుకింద ఆలోచనలతో నిలబడి పోయారు.

ముందుగా—"ఇక్కడ నిలబడి ప్రయోజనంలేదు. ముందు ఈ దీవిగురించి మనం తెలుసుకోవాలి. మాయమైన మనిషి గురించి అన్వేషించాలి. పదండి. ఇంకా ముందుకు

# ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్ కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్ ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-2-'87 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు ఏప్రెల్ '87 నెల సంచికలో ప్రకటిస్తాము.

## డిసెంబరు '86 పోటీ ఫలితాలు

(1) డిసెంబరు '86 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

కదం తొక్కింది కన్నెపరువం!
కదలనంటుంది మొండి గుఱ్ఱం!!

పంపినవారు: కుమారి కె.ఎల్. సౌమ్య, బి. ఏ, బి. ఇ. డి.,
సుబ్బారావుపేట, తాడేపల్లిగూడెం-534 101.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

గురి చూసి,
గుండెల్లో కొట్టు!!

పంపినవారు: శ్రీమతి ఓ. మాధవి, D/O ఓ. ఈశ్వరరెడ్డి,
25/120, సంజీవ నగర్, నంద్యాల-518 501.

వెళదాం" అన్నాడు నరేంద్ర.

"అవును. సమయాన్ని వృథాచెయ్యకూడదు. బహుశ ఏవైనా జంతువులు మనమీద దాడిచెయ్యవచ్చు. ఇప్పుడైనా వాటిని ఎదుర్కోటానికి ఆయుధాలు కలిగివుండాలి" అన్నాడు స్టీఫెన్.

అప్పటికప్పుడే నలుగురు ఖైదీలు చెట్టుమీదకు ఎక్కారు. పొడుగ్గా వున్న కొమ్మలను విరిచారు. ఆకులను తీసేసి అంతా చేతుల్లో పట్టుకున్నారు బరిశెల్లాగా.

ఇప్పుడు వాళ్ళందరికీ కొంచెం ధైర్యం వచ్చింది. కొంచెం చిన్నచిన్న జంతువులను ఆ కొమ్మలతో ఎదుర్కోవచ్చు.

చెట్లు తగ్గిపోయాయి.

ఎండ—వెలుతురు అప్పుడు వాళ్ళకు బాగా కనపడ్డాయి.

చిన్నగా మాట్లాడుకుంటూ నడుస్తున్నారు. మాట్లాడుతూనే వున్నా ఏ మూలనించి ఏ ప్రమాదం ఎదురవుతుందోనన్న అనుమానం అందరినీ వేధిస్తూనే వున్నది.

చూపులను అటూ ఇటూ తిప్పుతున్నారు. కనపడకుండా పోయిన ఖైదీకోసం చూస్తున్నారు—కాని ఆ ఖైదీ జాడ వాళ్ళకి తెలీలేదు.

చాలాదూరం నడిచారు. అంతదూరం నడిచినా వాళ్ళు గమనించింది ఒక్కటే. ఎత్తుగా—వెడల్పుగా పెరిగిన చెట్లు తప్పించి ఆ దీవిలో వాళ్ళకు ఏమీ కనపడలేదు. అక్కడక్కడ విషపండ్లు వున్న చెట్లు కనపడ్డాయి. ఒక్క జంతువుకూడా కనపడలేదు.

ఒకచెట్టుకింద నిలబడిపోయారు. అక్కడికి దగ్గర్లోనే వాళ్ళకు నీలిరంగు దుంపలు వున్న మొక్కలు కనపడ్డాయి.

# శ్రీ మహాలక్ష్మి వారి వెరైటీ నవలలు

## వెలువడినవి !

| | | | |
|---|---|---|---|
| 1. | రాక్షస సంహారం | మల్లాది వెంకట కృష్ణమూర్తి | 30-00 |
| 2. | కాంతి కిరణాలు | 'మీరా' లక్ష్మి | 25-00 |
| 3. | పుష్యరాగం | ,, ,, | 25-00 |
| 4. | నరసింహావతారం (అపన సీరియల్) | వసుంధర | 22-00 |
| 5. | శివరామ్ నేరాలు (అపన సీరియల్) | V.S. రావ్ | 20-00 |
| 6. | మైనా (సాహిత్య అకాడమి బహుమతి పొందినది) | శీలావీర్రాజు | 25-00 |
| 7. | ఇంకా ఉంది చాలా దూరం | భట్టిప్రోలు కృష్ణమూర్తి | 20-00 |
| 8. | పరుగో పరుగు | మల్లిక్ | 30-00 |
| 9. | వెన్నెల్లో పావురాళ్ళు | ఆదూరి వెంకట సీతారామమూర్తి | 16-00 |

నేడే అడ్వాన్సుతో పాటు మీ ఆర్డరు పంపండి.

ఫోన్ నెం: 63322

**శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్**

మ్యూజియం రోడ్, గవర్నరు పేట,

విజయవాడ-520 002.

వాటిని చూడగానే వాళ్ళందరికీ ఆకలి గుర్తుకువచ్చింది.

ఉదయం ఎండయినా బాగా తీక్షణంగా వుంది. ఐతే వేడి బాధ తెలీకుండా చెట్లు వాళ్ళకు నీడనిస్తున్నాయి.

"ఈ దీవిలో ఒక్క జంతువుకూడా లేదు" అన్నాడు బలదేవ్ అందర్నీ చూస్తూ.

"అవును. అట్లాగే అనుకోవచ్చు" అన్నాడు నరేంద్ర.

"ఆశ్చర్యంగా వుంది. ఇప్పటివరకూ ఒక్క పక్షికూడా కనపడలేదు" అన్నాడు స్టీఫెన్.

"కాని—ఈ ప్రశాంతతకూడా భయంకరంగానే వుంది. ఏదో ప్రమాదాన్ని సూచిస్తున్నట్టుగా అనిపిస్తూంది" అన్నాడు నరేంద్ర చుట్టూ చూస్తూ.

"అవును. మనలో ఒక మనిషి కనపడకుండా పోయిన విషయాన్ని మరచిపోకూడదు. కనీసం అతని మృతదేహం సూచనగా అతను వేసుకున్న దుస్తులు కూడా మనకు కనపడలేదు. అంటే ఏం జరిగి వుంటుందో మనము తెలుసుకోగలగాలి. లేకపోతే మనందరంకూడా అట్లాగే మాయమైపోయే ప్రమాదం వుంది" అన్నాడు స్టీఫెన్.

భయంగా చూశారు ఖైదీలు అతన్ని.

"అర్థంకాని విషయమే.... ఒక్క జంతువుగాని, మనిషిగానీ కనపడలేదు. కాని మన మనిషి మాయమైపోయాడు. ఆలోచించండి. ఏం చేద్దాం?" మళ్ళీ స్టీఫెన్ అన్నాడు అందర్నీ ఉద్దేశించి. (సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.